
శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥ 180/-
పేజీలు: 180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 138 | శనివారం | 18-04-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




మహిళా రిజర్వేషన్ బిల్లు రూపశిల్పి గీతా ముఖర్జీ 06

# ఇండియా కూటమి ఐక్య విజయం

### వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు

## ఎన్‌డిఎ సర్కార్‌కు పరాభవం

**బిల్లుకు అవసరమైన 2/3మెజారిటీ సాధించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం**

**అడ్డగోలు సీట్ల పెంపు, డీలిమిటేషన్ యత్నాలకు విపక్షాల చెక్**



ఓటింగ్‌లో పాల్గొన్న ఎంపిలు – 528

బిల్లు ఆమోదానికి కావలసిన ఓట్లు – 352

| అనుకూలం | వ్యతిరేకం |
|---|---|
| 298 | 230 |

మిగతా రెండు బిల్లులు వెనక్కి తీసుకున్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** మహిళలకు 2029 నుంచి చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచడం కోసం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లు ఆమోదం పొందడానికి అవసరమైన ఓట్లను కేంద్రం సాధించలేకపోయింది. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026కు ఆమోదం పొందడానికి ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం కాగా, అనుకూలంగా కేవలం 298 ఓట్లు మాత్రమే రాగా, 230 మంది సభ్యులు వ్యతిరేకించారు. ఓటింగ్‌లో 528 మంది ఎంపిలు పాల్గొనడంతో, ఈ చట్టం ఆమోదం పొందడానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఈ ఓటమి నేపథ్యంలో, నియోజకవర్గాల పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపును ప్రతిపాదించే బిల్లులతో సహా, దీనికి సంబంధించిన మరో రెండు బిల్లులను ఓటింగ్‌కు చేపట్టకుండా ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుంది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం గట్టిగా వాదిస్తుండగా, లోక్‌సభలో చర్చ గురువారం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగి, శుక్రవారం కూడా సాగింది. ప్రభుత్వ వాదనకు నాయకత్వం వహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, తరువాయి 2లో




## మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర

- కేంద్రంపై రాహుల్ ధ్వజం
- ప్రభుత్వం ఇప్పుడు పెట్టేది అసలు మహిళా బిల్లే కాదని వ్యాఖ్య
- ప్రధాని మోదీని ఇంద్రజాలకుడితో పోల్చిన ప్రతిపక్షనేత

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దుమ్మెత్తిపోశారు. మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పుడు పెట్టేది అసలు మహిళా బిల్లే కాదని, 2023లోనే అది ఆమోదం పొందిందని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా మహిళా బిల్లు పెట్టాల్సిన అవసరమే లేదని చెప్పారు. పాత మహిళా బిల్లును రద్దుచేసి కొత్త బిల్లు తరువాయి 2లో

## మోదీ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ

బిజెపి తీసుకువచ్చిన సమాఖ్యవాద వ్యతిరేక డీలిమిటేషన్ బిల్లు లోక్‌సభలో అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైంది. 2023లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల ముసుగులో భారతదేశ రాజకీయ పటాన్ని తిరగరాయాలన్న మోదీ ప్రభుత్వ ప్రయత్నానికి ఇది ఒక నిర్ణయాత్మక ఎదురుదెబ్బ.దేశం, ముఖ్యంగా భారత మహిళలు బిజెపి మోసాన్ని గ్రహించాలి. మహిళా రిజర్వేషన్లను మొదట జనాభా లెక్కలు, డీలిమిటేషన్‌కు ముడిపెట్టి, తాజాగా తీవ్ర సమాఖ్యస్ఫూర్తికి వ్యతిరేక చర్య కోసం దానిని ముసుగుగా వాడుకుంటూ బిజెపి, ప్రధాని మోదీ అడ్డుకోవడానికి నిరంతరం ప్రయత్నించారు. ఇది వారి మహిళా వ్యతిరేక ఉద్దేశాన్ని, నిజమైన రాజకీయ ప్రాతినిధ్యాన్ని కల్పించాలనే వారి అయిష్టతను బట్టబయలు చేస్తుంది. రాజ్యాంగాన్ని బలహీనపరచడానికి పార్లమెంటును తేలికగా తీసుకోలేరని విభజనవాద మితవాద శక్తులకు ఇది ఒక బలమైన హెచ్చరిక.వ్యవసాయ చట్టాలను రద్దు చేసేలా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసిన రైతుల చారిత్రక పోరాటాన్ని ఈ ఓటమి ప్రతిధ్వనిస్తుంది. ఈ తరుణం ప్రజలలో ఐక్యతను మరింత బలోపేతం చేసి, అంతిమంగా ఈ ప్రభుత్వాన్ని కూలదోయడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది.

**– డి. రాజా**
**సిపిఐ ప్రధాన కార్యదర్శి**

### రాజ్యాంగ విరుద్ధమైన బిల్లులను ఓడించాం

ఈ బిల్లులు రాజ్యాంగంపై దాడి చేయడమే. రాజ్యాంగ విరుద్ధమైన బిల్లులను ఓడించాం. ఇది మహిళా బిల్లు కాదని స్పష్టంగా చెప్పాం. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం వ్యతిరేకం కాదు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బిల్లు ముమ్మాటికీ మహిళా బిల్లు కాదు. ఇది భారత రాజకీయ నిర్మాణంపై దాడి. దేశ రాజకీయ నిర్మాణాన్ని మార్చే కుట్రను అడ్డుకున్నాం. 2023 మహిళా బిల్లును ఆమోదించేందుకు సిద్ధమని ప్రధానికి చెబుతున్నా. 2023 మహిళా బిల్లును అమలు చేయండి.. పూర్తిగా సహకరిస్తాం.

**– రాహుల్ గాంధీ**

### ప్రతిపక్షాలు ఆగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుంది

కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ఆలోచనా విధానం మహిళల ప్రయోజనాలకు గానీ, దేశ ప్రయోజనాలకు గానీ అనుకూలంగా లేదు. లోక్‌సభలో చాలా విచిత్రమైన దృశ్యం ఆవిష్కృతమైంది. కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీలు కీలకమైన 'నారీ శక్తి వందన అధినియమ్' అనే రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదాన్ని అనుమతించలేదు. 'నారీ శక్తి'కి జరిగిన ఈ అవమానం నలుదిక్కులా వ్యాపిస్తుంది. ప్రతిపక్షాలు కేవలం 2029 లోక్‌సభ ఎన్నికల్లోనే కాకుండా, ప్రతి స్థాయిలో, ప్రతి ఎన్నికలో, ప్రతిచోటా మహిళల ఆగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుంది.

**– అమిత్ షా**

### జాతీయ విపత్తును నివారించగలిగాం

ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్ష నాయకులు ఏకమై జాతీయ విపత్తును నివారించారు. నల్ల బిల్లులను ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ ఐకమత్యంతో, సాహసంతో నిలిచారు. భారత దేశ చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే మరుపురాని రోజు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్ష నాయకులు అంతా ఏకమై ఒక జాతీయ విపత్తును నివారించిన సందర్భం. మిత్రపక్షాల నాయకులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు.

**– ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

### తమిళనాడు ఢిల్లీని ఓడించింది

తమిళనాడు పోరాడింది, తమిళనాడు గెలిచింది. దక్షిణాది ఐక్యంగా నిలబడి తమ గళాన్ని వినిపించింది, ప్రజాస్వామ్యం విజయం సాధించింది. ఢిల్లీ అహంకారానికి మద్దతిచ్చే బానిసలతో కలిసి ఆ అహంకారాన్ని ఓడిస్తాం. మేము నియోజకవర్గాల పునర్విభజనను ఎన్నడూ వ్యతిరేకించలేదు. మేము నిష్పక్షపాతంగా, సంప్రదించి, ఆలోచించి, అంగీకరించిన ప్రక్రియను కోరాము. రాజకీయ లబ్ధి కోసం బలవంతంగా రుద్దే ప్రక్రియను కాదు.

**– తమిళనాడు సిఎం ఎంకె. స్టాలిన్**



## సమ్మె విరమిస్తాం

- ఆర్టిజన్‌ల జెఎసి చైర్మన్ సతీశ్‌రెడ్డి ప్రకటన
- సమస్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి సానుకూలంగా స్పందించారని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తుందని, ఆర్టిజన్ల జెఎసితో చర్చలు జరపాలని ట్రాన్స్‌కో సిఎండిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీతో సమ్మెను విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జెఎసి చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. ఆర్టిజన్ల జెఎసి నాయకులు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో హైదరాబాద్‌లోని 'ప్రజాభవన్'లో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను డిప్యూటీ సిఎంకు వివరించారు. వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారని, ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించినందుకు భట్టి విక్రమార్కకు జెఎసి కన్వీనర్ సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సిఎంను కలిసిన వారిలో తరువాయి 2లో

## విచ్ఛిన్న, విభజన రాజకీయాలకు కుట్ర



- శాశ్వత అధికారం కోసం బిజెపి దేశభక్తి ముసుగువేసుకుంది
- చట్టసభల స్థానాల పునర్విభజనకు అఖిలపక్షంతో పాటు రాజ్యాంగ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలి
- అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించి అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యతతో కూడిన నిర్ణయం తీసుకోవాలి
- తేజస్వీ సూర్య ఎంపిగా అనర్హులు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి శాశ్వత అధికారం కోసం దేశ భక్తి ముసుగులో దేశ విచ్ఛిన్న, విభజన రాజకీయాలకు కుట్ర చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకుని రిజర్వేషన్ల పరంగా బిసిలకు, రాజకీయ ప్రాధాన్యతపరంగా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. చట్టసభల స్థానాల పునర్విభజనకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయడం తోపాటు రాజ్యాంగ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించి అన్ని రాష్టాలకు సమాన ప్రాధాన్యతతో కూడిన నిర్ణయం తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో తరువాయి 2లో




## స్వతంత్ర భారతావనిలో దళితులపై ఆగని అకృత్యాలు

బిజెపి పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం : ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్

వరంగల్‌లో అట్టహాసంగా ప్రారంభమైన డిహెచ్‌పిఎస్ రెండవ రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం/ వరంగల్

బిజెపి పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం ఉందని, స్వతంత్ర భారత వనిలో దళితులపై అకృత్యాలు ఆగడం లేదని ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ (ఎఐడిఆర్ఎం) జాతీయ అధ్యక్షుడు ఎ. రామ్మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి వి ఎస్ నిర్మల్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నాడు వరంగల్ నగరంలో దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రెండవ రాష్ట్ర మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ మహాసభ బహిరంగ సభ సందర్భంగా వరంగల్ ఇస్లామీయా గ్రౌండ్ నుండి పోచం మైదాన్ అబ్బాస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బందేల నర్సయ్య హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ఏసు రత్నం అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ. రామ్మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి వి ఎస్ నిర్మల్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనర్సింహలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 76 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో నేటికి దళితులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, సమానత్వం, సామాజిక న్యాయం, తరువాయి 12లో

## 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించండి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర మంత్రి జోషితో ఆయన నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు భేటీ అయ్యారు. తెలంగాణలో యాసంగిలో పండే ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని, గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం తరువాయి 12లో

## హోర్ముజ్ ఓపెన్

జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటన

అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడి



**టెహ్రాన్ :** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హోర్ముజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా–ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్–ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు తరువాయి 12లో

### పూర్తి శాస్త్రీయ విధానంలో

## కాళేశ్వరం పునరుద్ధరణ

- పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) చైర్మన్ అనిల్ జైన్‌తో భేటి అయ్యారు. బ్యారేజీల రిపేర్లు, పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికను చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. అన్ని కోణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో ప్రస్తుతం పరీక్షలు చేపడుతున్న తీరుపై ఎన్‌డిఎస్ఎ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారని, త్వరలోనే తాను స్వయంగా బ్యారేజీల సందర్శనకు వస్తానని చెప్పారని తరువాయి 2లో

# ఇరాన్ ఒత్తిడికి ట్రంప్ తలొగ్గారు : లెబనాన్



**బీరుట్ :** పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు దిశగా అమెరికాఇరాన్ రెండో విడత శాంతి చర్చలకు సన్నద్ధమవుతున్న వేళ ఇజ్రాయిల్‌లెబనాన్ మధ్య కాల్పుల విమరణ ఒప్పందం కుదిరింది. ఇరు పక్షాలు 10 రోజులు కాల్పుల విరమణ కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇక ఇప్పుడు అమెరికా ఇరాన్ మధ్య రెండో విడత శాంతి చర్చల కోసం ప్రపంచం అంతా ఆసక్తికగా ఎదురుచూస్తోంది. కాగా, ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కుదిరిన 10రోజుల కాల్పుల విరమణ ఒప్పందం... అమెరికాపై ఇరాన్ పెట్టిన బాహ్య ఒత్తిడి ఫలితమేనని లెబనాన్ పార్లమెంట్ సభ్యుడు తెలిపారు.
ఇరాన్‌కు ట్రంప్ లొంగిపోయారని... ఆ ప్రభావమే ఇజ్రాయిల్ నాయకత్వాన్ని ఈ ఒప్పందాన్ని అంగీకరించేలా చేసిందని ఆయన పేర్కొన్నారు. కాగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోందని లెబనాన్ సైన్యం ఆరోపించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలకు పాల్పడిందని తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దక్షిణ ప్రాంత నివాసితులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**లెబనాన్‌కు చరిత్రాత్మక దినం : ట్రంప్**
ఇజ్రాయిల్ లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడాన్ని చరిత్రాత్మక దినంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభివర్ణించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 'లెబనాన్‌కు ఇది ఒక చరిత్రాత్మమైన రోజు' అని రాసుకొచ్చారు. అలాగే లెబనాన్ కేంద్రంగా ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న హెజ్బొల్లా...సక్రమంగా వ్యవహరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాళ్లు అలా చేస్తే అది వారికి ఒకగొప్ప క్షణం అవుతుందని పేర్కొన్నారు.

**అప్పుడే ఇళ్లకు వెళ్లొద్దు : హెజ్బొల్లా హెచ్చరిక**
కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తొందరపడి ఇళ్లకు వెళ్లొద్దని ప్రజలకు లెబనాన్ హెచ్చరించింది. పరిస్థితులు అదుపులోకి వచ్చే దాకా దక్షిణ, తూర్పు లెబనాన్, బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలకు వెళ్లవద్దని లెబనీస్ మిలిటెంట్ సూచించింది. అయితే గతంలోనూ కాల్పుల విరమణ వెంటనే పెద్ద ఎత్తున ప్రజలు ఇళ్లకు వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో రోడ్లు ఎక్కడికక్కడ దిగ్బంధమయ్యాయి. కాగా, ఇజ్రాయిల్ హెజ్బొల్లా మధ్య కొనసాగుతున్న యుద్ధంలో 10 లక్షలకుపైగా లెబనీస్ ప్రజలు నిరాశ్రయులయ్యారు.

**ఐరాస హర్షం :** ఇజ్రాయిల్‌లెబనాన్ కాల్పుల విరమణను ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ స్వాగతించారు. ఈ ఒప్పందాన్ని కుదర్చడంలో అమెరికా పోషించిన పాత్రను ఆయన ప్రశంసించారు. ఇది దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్చలకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ కాల్పుల విరమణను పూర్తిగా గౌరవించాలని, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలని కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఇరాన్‌పై త్వరలోనే విజయం సాధిస్తున్నాం

### ట్రంప్
### ఒప్పందం కుదిరితే సంతకం చేయడానికి పాక్ వెళ్తానని వెల్లడి




**వాషింగ్టన్ :** ఇరాన్‌పై త్వరలోనే విజయం సాధించబోతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇతర దేశాల్లో దశాబ్దాల పాటు అమెరికా బలగాలు యుద్ధభూమిలో ఉండాల్సి వచ్చిందని...ఇరాన్‌లో మాత్రం రెండు నెలలే ఉండి విజయానికి అడుగు దూరంలో ఉన్నామని అన్నారు. ఇరాన్ నౌకాదళం దాదాపు నిర్వీర్యమైందని ఆయన చెప్పారు. లాస్ వెగాస్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'గత వారం నేను ఒక జాబితాను రూపొందించాను. వియత్నాంలో 17 ఏళ్లు, అఫ్గానిస్థాన్ సహా ఇతర దేశాల్లో ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం పాటు అమెరికా బలగాలు అక్కడ ఉండాల్సి వచ్చింది. అక్కడ(ఇరాన్) మాత్రం రెండు నెలల పాటే ఉన్నాం. మనం త్వరలోనే విజయం సాధించబోతున్నాం. ఇరాన్‌కు ఇక నేవీ లేదు. 158 నౌకలు సముద్రంలో మునిగిపోయాయి. మేం దఢమైన, తెలివైన దేశంతో పోరాడుతున్నాం. అక్కడి ప్రజలు గొప్ప పోరాట యోధులు. కానీ అమెరికా చర్యల వల్ల వారి శక్తి తగ్గింది' అని ట్రంప్ అన్నారు.
రానున్న వారం రోజుల్లో ఏం జరుగుతుందో చూద్దామని ట్రంప్ అన్నారు. అమెరికా ఇరాన్ మధ్య కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించాలా, వద్దా అనే దానిపై ఇంకా స్పష్టత లేదన్నారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉందని...ప్రస్తుతం తాము ఆ విషయం పైనే దష్టిసారించామని, చర్చల్లో పురోగతి సాధిస్తే కాల్పుల విరమణను పొడిగించాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ వారాంతంలో తదుపరి చర్చలు జరగవచ్చని తెలిపారు. శుద్ధిచేసిన యురేనియం నిల్వలను తమకు అప్పగించేందుకు తెహ్రాన్ అంగీకరించినట్లు ట్రంప్ చెప్పారు. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య సంప్రదింపులు విజయవంతంగా సాగుతున్నాయని చెప్పారు. దీంతో త్వరలో జరగనున్న చర్చలు సానుకూలంగా ఉండవచ్చని ఆశాభావం వ్యక్తంచేశారు. త్వరలోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉందని చెప్పారు. వారాంతంలో తదుపరి చర్చలు జరిగే అవకాశముందని తెలిపారు. ఒప్పందం కుదిరితే కాల్పుల విరమణ పొడిగింపు అవసరం లేకపోవచ్చని చెప్పారు. ఒప్పందం కుదరకపోతే మళ్లీ యుద్ధం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఇస్లామాబాద్‌లో జరిగే చర్చల్లో ఇరాన్‌తో ఒప్పందం కుదిరితే దానిపై సంతకం చేసేందుకు పాకిస్థాన్ వెళతానని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌తో యుద్ధం కారణంగా గ్యాస్ ధరలు భారీగా పెరుగుతాయని తాను ముందే ఊహించానని తెలిపారు. ఈ నెల 22తో ఇరాన్‌అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగుస్తుంది. తదుపరి చర్చలుకు సంబంధించిన తేదీలు ఇంకా ఖరారు కాలేదు. దీంతో ప్రస్తుతం పరిస్థితులు ఎలా మారుతాయన్నది అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తిగా మారింది.

# కుప్పకూలిన హెలికాప్టర్

## 8 మంది దుర్మరణం



**జకర్తా:** ఇండోనేసియాలో హెలికాప్టర్ కుప్పకూలింది. వెస్ట్ కాలిమంతన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది మతి చెందారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను అధికారులు గుర్తించారు. మెలావీలోని ఒక ప్లాంటేషన్ ఏరియా నుంచి బయలుదేరిన కేవలం ఐదు నిమిషాలకే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా, గురువారం మధ్యాహ్నం 3:25 గంటల సమయంలో ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన సూపర్ ప్యూమా హెలికాప్టర్ మొదట శకలాలను గుర్తించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. సహాయక బందాలు నాలుగు మతదేహాలను వెలికితీశాయి. మరో మూడు మతదేహాలు శకలాల్లోనే చిక్కుకోగా, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోంది. రాయిటర్స్ నివేదిక ప్రకారం ఈ హెలికాప్టర్ మాథ్యూ ఎయిర్ నుసంతారాకు చెందినది. చిత్ర మహకోట అనే పామాయిల్ కంపెనీకి చెందిన ప్లాంటేషన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.



# క్షిపణి పరీక్షలు...భారత్,పాక్ పోటాపోటీ

### ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన ఇరు దేశాలు

**న్యూఢిల్లీ/ఇస్లామాబాద్ :** అరేబియా సముద్రంలో క్షిపణి విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు భారత, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి నోటమ్ (నోటీసెస్ టు ఎయిర్‌మెన్) జారీ చేశాయి. క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇరుదేశాలు ప్రకటించాయి. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని ఆయా దేశాలు నోటమ్, మారిటైమ్ అడ్వైజరీ వంటివి జారీ చేయడం సహజమే. అయితే ఇప్పుడు రెండు దేశాలు ఒకేసారి నోటమ్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది. ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. 200 కిలోమీటర్ల మేర క్షిపణి విన్యాసాల జోన్‌గా పాకిస్థాన్ ప్రకటించింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ విన్యాసాలకు హెచ్చరికలు జారీ చేసింది. భారత్ 400 కిలోమీటర్ల మేర క్షిపణుల విన్యాసం కోసం జోన్‌గా ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన సంవత్సరం తర్వాత ఇరుదేశాలు ఆయుధ పరీక్షలపై ప్రకటన చేయడం గమనార్హం.

# ట్రంప్ చెప్పేవన్నీ అబద్ధాలే : ఇరాన్



**తెహ్రాన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాల్లో మేడలు కడుతూ... అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఇరాన్ మీడియా దుయ్యబట్టింది. ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ... ఇరాన్‌తో త్వరలో ఓ ఒప్పందం కుదరనుందని... దీంతో వారు మాకు ఉచితంగా చమురు, హార్మూజ్ జలసంధిని అందించనున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వ మీడియా ఎగతాళి చేసింది. ట్రంప్ మాట్లాడుతున్న వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది.
దీనికి 'అమెరికా అధ్యక్షుడు గాల్లో మేడలు కడుతున్నారు' అని పేర్కొంది. ఈ సందర్భంగా ట్రంప్ ఎక్కువగా ఊహించుకుని, తప్పులకు పాల్పడుతున్నారనే ఉద్దేశం వచ్చేలా ఒక సామెతను కూడా అది ప్రస్తావించింది. ఇక శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తమకు అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించిందన్న ట్రంప్ వ్యాఖ్యలను సైతం ఇరాన్ కొట్టిపారేసింది. ఇప్పటివరకు అలాంటి ఒప్పందం ఏదీ జరగలేదని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబఫ్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ట్రంప్ మరో అబద్ధపు ప్రకటన చేశారని తెలిపాయి. అలాంటి పెద్ద పురోగతి ఏదీ సాధించలేదని, ఇరాన్ షరతులన్నింటికీ అమెరికా అంగీకరిస్తేనే చర్చలు కొనసాగుతాయని స్పష్టంచేశాయి.

## ఐక్య విజయం (మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాలపై సీట్ల పునర్విభజన ప్రభావం గురించి ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను పెంచినా దక్షిణ ప్రాంతానికి ఎలాంటి అన్యాయం జరగదని తాను వ్యక్తిగతంగా సభకు హామీ ఇస్తున్నానని ఆయన అన్నారు. ఈ చర్యను రాజకీయ కోణంలో కాకుండా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా చూడాలని, సభ్యులు దీనికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుండి సుమారు 816కు పెంచితే, దక్షిణ రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యం యథాతథంగా ఉంటుందని లేదా స్వల్పంగా పెరుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సభకు తెలిపారు. ఈ చట్టాన్ని వ్యతిరేకించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని, మహిళలకు రిజర్వేషన్‌ను దూరం చేస్తున్నాయని మోదీ, షా ఇద్దరూ ఆరోపించారు. ఇటువంటి ప్రతిఘటనకు రాజకీయ పరిణామాలు ఉంటాయని వారు స్పష్టం చేశారు. తిరస్కరించబడిన ఈ బిల్లు, మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయడానికి, కొత్త జనాభా లెక్కల కోసం వేచి చూడకుండానే నియోజకవర్గాల పునర్విభజనకు అనుమతించడానికి ఉద్దేశించబడింది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి వందన అధినియమ్‌కు సంబంధించిన నిబంధనలను సవరించడమే దీని లక్ష్యం. 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే ఈ కోటాను అమలులోకి తీసుకురావడమే ఈ సవరణల ఉద్దేశం. రిజర్వేషన్ విధానం అమలును సులభతరం చేయడానికి లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచాలని కూడా వారు ప్రతిపాదించారు. కాగా, ఓటింగ్ అనంతరం, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బిల్లును ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత లోక్‌సభ శనివారం ఉదయం 11 గంటల వరకు వాయిదా పడింది.

## కాళేశ్వరం పునరుద్ధరణ
(మొదటి పేజీ తరువాయి)

నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

**దశలవారీగా శాస్త్రీయ పరీక్షలు**
బ్యారేజీల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిపుణుల సంస్థలను ప్రభుత్వం నియమించింది. డిజైనింగ్, టెస్టింగ్ సంస్థలు రంగంలోకి దిగాయి. డిజైన్‌కు ముందు అవసరమైన పరీక్షలు, అధ్యయనాలను సిడబ్ల్యుపిఆర్ఎస్ సంస్థ చేస్తుంది. ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బ్యారేజీల పునరుద్ధరణ కోసం గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జిపిఆర్) స్కానింగ్, డ్రోన్ సర్వేలు, బోర్ హోల్స్, జియోటెక్నికల్, జియోఫిజికల్ పరీక్షలతో భూమి, అక్కడ నిర్మాణాల సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోనున్నారు.

**సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ**
వివిధ సంస్థల మధ్య సమన్వయం కోసం ప్రభుత్వం సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సిడబ్ల్యుపిఆర్ఎస్ ప్రతినిధులు, డిజైనింగ్ సంస్థ ప్రతినిధులు, ఇతర టెక్నికల్ ఏజెన్సీలు సభ్యులుగా ఉన్నారు. పరీక్షలు సకాలంలో జరిగేలా చూడడం, అవసరమైన డేటా సమయానికి అందించడం, అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవడం ఈ కమిటీ చేస్తుంది. ఈ ప్రక్రియ అంతా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగేందుకు, కేంద్ర స్థాయి నిపుణుల పర్యవేక్షణ కూడా ఉండే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అవసరమైతే ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా ఇందులో చేర్చే అవకాశముం ది.

**బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
''గత ప్రభుత్వ లోపాల వల్ల దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేయడమే తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం ఎన్‌డిఎస్ఎ, సిడబ్లుసి అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఐఐటి ముంబయిలోని నిపుణుల సహకారంతో అత్యధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ నెలాఖరులోగా భూసార పరీక్షలు పూర్తి చేసి, వర్షాకాలం తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. పారదర్శకత కోసం ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బ్యారేజీలను క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు'' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## మార్చే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురావాలని కేంద్రానికి సవాల్ విసిరారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా మద్దతు ఇస్తుందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులపై శుక్రవారం మధ్యాహ్నం లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు సభలో గందరగోళం సృష్టించాయి. కేవలం అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకే ప్రధాని మోదీ ఈ రాజకీయ వ్యూహాన్ని పన్నారని ఆయన విమర్శించారు. బిజెపి తమకు లాభం చేకూర్చేలా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాన్ని 'గెర్రీమాండరింగ్'గా రాహుల్ అభివర్ణించారు. 2029 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బిజెపి ఈ కుట్రకు తెర తీసిందని, నియోజకవర్గాల పటాలను మార్చడం ద్వారా ప్రతిపక్షాల బలాన్ని తగ్గించాలని మోదీ చూస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లే ఈ పార్లమెంటు సెషన్ అజెండా అయితే, తాము ఏమాత్రం సంకోచించకుండా ఈ క్షణంలోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. 2023లో పార్లమెంటు ఆమోదాన్ని పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు విషయంలో కేంద్ర సర్కారుకు సహకరించేందుకు తాము సిద్ధమేనని, కానీ ఇప్పుడు కేంద్ర సర్కారు తేవాలని చూస్తున్నది మహిళా కోటా బిల్లులా కనిపించడం లేదని రాహుల్ విమర్శించారు. దానితో డీలిమిటేషన్‌కు లింకులు పెడుతున్నారని మండిపడ్డారు. భారతదేశ జాతీయ ఆలోచనా విధానంలో మహిళలు ఒక చోదక శక్తి అని ఆయన అన్నారు. మనమంతా మహిళల జీవితాల ద్వారా ఎంతో ప్రభావితులం అయ్యామని, ఎన్నో విషయాలను నేర్చుకున్నామన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్, జనాభా గణనలతో మహిళా కోటాకు ముడిపెట్టడం సరికాదన్నారు. మహిళా కోటా అమలుకు డీలిమిటేషన్‌తో అసలు సంబంధమే లేదని, దీన్ని వెంటనే అమల్లోకి తేవచ్చని రాహుల్ తెలిపారు. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేసేలా నియోజకవర్గాల పునర్విభజన చేయడం అనేది దేశ వ్యతిరేక చర్య కంటే తక్కువేం కాదన్నారు. కులగణన డేటాను విస్మరించడం ద్వారా ఒబిసి, దళిత, ఆదివాసీ వర్గాల హక్కులను కేంద్రం దోచుకుంటోందని ('హిస్సా చోరీ') ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంద్రజాలికుడు అడ్డంగా దొరికిపోయారు
ప్రధాని మోదీని ఇంద్రజాలికుడితో పోలుస్తూ, ఆయన మ్యాజిక్ ట్రిక్స్ ఇప్పుడు పని చేయడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఇంద్రజాలికుడు ఇప్పుడు అడ్డంగా దొరికిపోయారు అని ఆయన విమర్శించారు. బాలాకోట్ స్ట్రైక్స్, నోట్ల రద్దు వంటివి గతంలో ప్రధాని చూపిన మ్యాజిక్ ట్రిక్స్ అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని మోదీ చూస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత ఆరోపించారు. దేశ రాజకీయాల్లో జరుగుతున్న మార్పులను చూసి మోదీ ప్రభుత్వం భయపడుతోందని, అందుకే మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పెంపు చేపట్టి తమ బలాన్ని పెంచుకోవాలని చూస్తోందన్నారు. నిజమైన శక్తి ఎప్పుడూ చీకటిలోనే దాగి ఉంటుంది, అది బయటకు కనిపించదని ఒక కథ రూపంలో ఇంద్రజాలికుడి ఉదాహరణను రాహుల్ వివరించారు.

**ప్రధానిని ఇంద్రజాలికుడు అని పిలవడం సరికాదు : రిజిజు**
ఇక రాహుల్ గాంధీ ప్రధానిని ఇంద్రజాలికుడు అని పిలవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి పదాలు అసభ్యకరమైన పదజాలం కిందకు వస్తాయన్నారు. ఇక రాహుల్ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, సభలో గౌరవప్రదమైన భాషను వాడాలని హెచ్చరించారు. చర్చలోని అంశానికి లోబడి మాట్లాడాలని సూచించారు. ఈ క్రమంలో సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, సభ గందరగోళంగా మారింది.

**16 ఇప్పుడొక చిక్కుముడిలా మారింది**
పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైన తేదీలోని 16 అనే అంకె ఇప్పుడొక చిక్కుముడిలా మారిందని రాహుల్ అన్నారు. ఈ తేదీ వెనుక ఒక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాహుల్ తన ఫోన్‌ను చూసుకుంటూ 16వ తేదీ కోసం ఎదురుచూడండి, ఆ నంబర్ 16లోనే ఈ చిక్కుముడికి సమాధానం ఉందని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 16న ప్రభుత్వం హడావుడిగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ప్రవేశపెట్టడం వెనుక ఒక రకమైన భయం కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల మ్యాప్‌ను మార్చే ఉద్దేశంతోనే ఈ 16వ తేదీని ఎంచుకున్నారని రాహుల్ చెప్పారు. ప్రధాని మోదీ ప్రసంగం శక్తి హీనంగా సాగిందని చెబుతూ, ఈ మొత్తం వ్యవహారమంతా '16' అనే అంకె చుట్టూ తిరుగుతోందని రాహుల్ చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశమయ్యాయి.

# మహిళా రిజర్వేషన్ల అమలుపై బిజెపిపై కాంగ్రెస్ ఆగ్రహం

### ఇదీ ప్రజాస్వామ్య విజయం: మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగ 131వ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం ప్రజాస్వామ్యానికి గొప్ప విజయమని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా డీలిమిటేషన్ బిల్లును తీసుకురావాలని ప్రయత్నించిన బిజెపి కుట్రలను కాంగ్రెస్ పార్టీ సమర్థంగా అడ్డుకుందని ఆయన తెలిపారు. డీలిమిటేషన్ అమలు పేరుతో ఉత్తర భారత రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించి రాజకీయ లాభం పొందాలన్న బిజెపి ఎత్తుగడ విఫలమైందని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణన పూర్తయ్యాకే చట్ట సవరణలు చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్ నెగ్గిందని గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో బిజెపి ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. దేశానికి తొలి మహిళా ప్రధానిని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ కట్టుబడి ఉందని, దీనిపై బిజెపిపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమం కొనసాగిస్తామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

**బిజెపికి చిత్తశుద్ధి లేదు:మంత్రి పొన్నం ప్రభాకర్**
మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.. దాని ఫలితమే పార్లమెంట్ లో మహిళా బిల్లు వీగిపోవడం జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఒబిసి రిజర్వేషన్ అమలు చేయాలని మా పార్టీ డిమాండ్ చేసింది.

**రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్య విజయం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తులు ఐక్యంగా పోరాడితే, ప్రభుత్వాలు తీసుకువచ్చే ఎలాంటి దురుద్దేశపూర్వక చట్టాలనైనా అడ్డుకోవచ్చని ఈ రోజు నిరూపితమైందని రాష్ట్ర రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై ఆయన మాట్లాడుతూ ఈ పరిణామం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అభివర్ణించారు. విపక్షాల ఐక్యత దేశ ప్రయోజనాలకు ఎంత అవసరమో ఈ పరిణామం స్పష్టం చేసిందని ఆయన అన్నారు. దేశానికి పొంచి ఉన్న ఒక జాతీయ విపత్తును విపక్షాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయన్నారు.

## సమ్మె విరమిస్తాం (మొదటి పేజీ తరువాయి)

ట్రాన్స్‌కో సిఎండి కృష్ణభాస్కర్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కోచైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్, తదితరులు ఉన్నా రు.

**ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైంది కాదు : డిప్యూటీ సిఎం భట్టి**
వేసవిలో విద్యుత్ డిమాండ్ తీవ్ర స్థాయిలో ఉంటుందని, ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలన్నారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నదని, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని ఆయన తెలిపారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో సమస్యలను పరిష్కరించేందుకు ట్రాన్స్‌కో సిఎండి కృష్ణి చేస్తారని డిప్యూటీ సిఎం తెలిపారు.

## రాజకీయాలకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యులు కళవేణ శంకర్ పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చట్టసభల స్థానాల పునర్విభజన అంశంలో బిజెపి సర్కార్ పూర్తిగా కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికే ఉత్తరాది, దక్షణాది రాష్ట్రాల మధ్య ఉన్న స్థానాల వత్యాసం కారణంగా వివక్ష కొనసాగుతోందని, మళ్లీ 50 శాతం స్థానాలు పెంచితే మరింత వత్యాసం పెరిగి ఈ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోనున్నాయన్నారు. ఇదే అంశాన్ని ఆగ్రహించి 1975లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ, 25 ఏళ్ల పాటు సీట్ల పెంపును నిలిపివేయగా, 2001లో మాజీ ప్రధాని అటల్ బీహర్ వాయపేయి సైతం 2026 వరకు దీనిని కొనసాగించారన్నారు. ఈ నేపథ్యంలో సీట్ల పెంపునకు సంబంధించి పూర్తి శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా తన రాజకీయ లబ్ది కోసం శాశ్వత అధికారమే లక్ష్యంగా దేశంలో భాగమైన దక్షాణాది రాష్ట్రాలకు పూర్తిగా అన్యాయం చేస్తూ మొత్తంగా 50 శాతం స్థానాలు పెంచాలనే నిర్ణయాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలలో 129 ఉన్న స్థానాలు 195కు, ఉత్తరాది రాష్ట్రాలకు ఉన్న 395 స్థానాలు 621కి పెరగనున్నాయని, దీంతో దేశ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల పూర్తి ప్రాధాన్యత తగ్గిపోయి తీవ్ర వివక్షకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న543 స్థానాలు ఒక్కసారిగా 850కి పెరిగితే పార్లమెంట్‌లో అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించే అవకాశం ఉండదని, మందబలంతో అధికారంలో ఉన్న పార్టీలు ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**విప్లవాత్మక ప్రతి మార్పులో సిపిఐదే పాత్ర :**
దేశంలో ఏ విప్లవాత్మక మార్పు జరిగిన సమాజ హితమే లక్ష్యంగా వచ్చిన ప్రతి బిల్లులో సిపిఐ కీలక పాత్ర పోషించిందని సాంబశివరావు తెలిపారు. సిపిఐ కృషి వల్లే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆచరణ సాధ్యంలోకి వచ్చిందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 1960లోనే సిపిఐ ఎంపి రేణుక చక్రవర్తి మొట్టమొదటి లేవనెత్తారని, అందుకు కొనసాగింపుగా ఎంపి గీతా ముఖర్జీ అనేక ఉద్యమాలను నిర్వహించడంతో పాటు పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టారని తెలిపారు. ఇదేక్రమంలో అప్పటి ప్రభుత్వం బిల్లు రూపకల్పనకు గీతా ముఖర్జీ నేతృత్వంలో వేసిన కమిటీ 1996లో మహిళా రిజర్వేషన్ బిల్లును రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని, ఆ నివేదిక మేరకే 2010లో రాజ్యసభ ఆ బిల్లును ఆమోదించిందన్నారు. ఆతర్వాత 2023లో మోదీ ప్రభుత్వం లోక్‌సభలో బిల్లును ఆమోదించిందన్నారు.

**బిజెపి ఎంపి తేజస్వీ సూర్య ఎంపిగా అనర్హులు**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాక్తిసాన్‌తో పోల్చిన బిజెపి ఎంపి తేజస్వీ సూర్య పార్లమెంట్ సభ్యుడిగా అనర్హులని కూనంనేని సాంబశివరావు అన్నారు. బబూాద్యతాయుతమైన ఎంపి స్థానంలో ఉన్న ఆయన కనీసం అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం ఆక్షేపణీయమన్నారు. సూర్య వ్యాఖ్యలను తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు 6 మంది ఎంపిలు కనీసం నోరు విప్పకపోవడం దారుణమన్నారు. నాడు తెలంగాణ ఏర్పాటుకు పూర్తి మద్దతును ఇచ్చిన సుష్మాస్వరాజ్ పాత్రను వీరు తప్పుపడుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలను ఖండించకపోగా సమర్థిస్తూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల మీద తప్పులు చేస్తోంది**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల మీద తప్పులు చేసుకుంటు పోతోందని, వాటిని తక్షణమే సరిదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూనంనేని సాంబశివరావు సూచించారు.
ఆర్‌టిసి కార్మికులు, ఆర్టిజన్లు, సింగరేణి కార్మికులు, అసంఘటిత కార్మికుల పట్ల ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాల్సి ప్రభుత్వం నిరంకుశ ఆలోచనలు చేయడం సరైందికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌టిసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను కూడ తక్షణమే సమస్యలను కూడా పరిష్కరించాలని ఆయన కోరారు.

# తెలంగాణ ఏర్పాటుపై బిజెపి అక్కసు

నోరు మెదపని బిజెపి తెలంగాణ ఎంపిలు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

బిజెపి ఎంపి తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/వరంగల్ : తెలంగాణ ఏర్పాటుపై బిజెపి తన అక్కసును మరోసారి ప్రదర్శించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై లోక్ సభలో బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బిజెపి ఎంపి తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుపై బిజెపి నేటికీ విషం చిమ్ముతూనే ఉందని, లోక్ సభ సాక్షిగా బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్రాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసినా తెలంగాణ బిజెపి ఎంపిలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటినా బిజెపి విషం చిమ్మడం మానలేదన్నారు. తెలంగాణ, ఆంధ్ర విభజనను ఇండియా, పాకిస్తాన్ విభజనతో పోల్చిన కర్ణాటక బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలపై సిపిఐ తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నదని, ఎంపి వ్యాఖ్యలను ఖండించారు. పార్లమెంట్ వేదికగా బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్, బిజెపి ఎంపిలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటుపై అవమానకరంగా మాట్లాడుతున్నప్పటికీ నోరు మెదపని ఈ కాంగ్రెస్, బిజెపి ఎంపిలు ఉండి ఏం ప్రయోజనమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ సారథి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రి బిక్షపతి, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర సభ్యులు పంజాల రమేష్, మండల కార్యదర్శి గుండె బద్రి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎంపి వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి

తేజస్వి సూర్య ఎంపి సభ్యత్వాన్ని రద్దు చేయాలి తొలగించాలి

ఎఐవైఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలతో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దాడి చేశారని, ఆయన ఎంపి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. తెలంగాణ పట్ల తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు బిజెపి అసలు స్వరూపాన్ని బహిర్గతం చేసిందని, ఇది కేవలం వ్యక్తిగత అభిప్రాయం కాదని, ఆ పార్టీ దురహంకార రాజకీయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలను నిరసిస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని వై జంక్షన్ వద్ద సూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేది పాలకవర్గాల దయాదాక్షిణ్యంతో వచ్చినదికాదని, సకల జనుల దీర్ఘకాలిక పోరాటాల ఫలితమన్నారు. వేలాది మంది యువత తమ ప్రాణాలను అర్పించిన ఉద్యమాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదన్నారు. బిజెపి నాయకత్వం ఎప్పటిలాగే ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టి, ప్రజలను మతం,ప్రాంతం పేరిట విభజించి రాజకీయ లాభాలు పొందాలని చూస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఈ విధమైన వ్యాఖ్యలను దేశ ప్రజలు క్షమించరని, బిజెపి ఎంపి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. బిజెపి కేంద్ర నాయకత్వం ఈ అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్ బేగ్, రాష్ట్ర సమితి సభ్యులు కాంపల్లి కళ్యాణ్, మొహమ్మద్ అక్రమ్, లక్ష్మణ్, నదీమ్, రవి, మురళి, ప్రదీప్ పాల్గొన్నారు.



## ఈవి ఛార్జింగ్ కేంద్రాల విస్తృత ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలి

సి.ఎస్ కె.రామకృష్ణా రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అధిక సంఖ్యలో ఈవి ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం సమగ్ర ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. ఈవి వాహనాల వినియోగం పెరుగుతుండడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని ఛార్జింగ్ కేంద్రాల సమగ్ర వ్యవస్థను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవి) ఛార్జింగ్ మౌలిక వసతుల అమలుపై శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, రవాణ, రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టిజిఎస్ ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, టిజిఐఐసి వైస్ చైర్మన్, ఎండి శశాంక, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, టిజిఆర్ఇడిసిఐ ఎండీ అనిలా వవిల్లా, ఒఇఎం ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఎస్ రాష్ట్రవ్యాప్తంగా ఈవి మౌలిక వసతులను విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగవంతం అవుతున్నందున, పెరుగుతున్న ఈవి వినియోగదారుల అవసరాలను తీర్చడానికి విస్తృతమైన ఛార్జింగ్ నెట్‌వర్క్ ఎంతో కీలకమని సిఎస్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఈవి ఛార్జింగ్ మౌలిక వసతులను మ్యాప్ చేయడానికి, పర్యవేక్షించడానికి కేంద్రీకృత, రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ డ్యాష్‌బోర్డ్ ఈవీ కేంద్రాల ఏర్పాటు ప్రణాళిక, పురోగతి పర్యవేక్షణ, పారదర్శకతకు కీలక సాధనంగా ఉపయోగపడనుందని తెలిపారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ భవనాల బేస్‌మెంట్‌లలో ఈవి ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడాన్ని తప్పనిసరి చేసే విధానాన్ని రూపొందించే ప్రక్రియలో ఇంధన శాఖ ఉందని వెల్లడించారు. ఈ విధానం నగర వాసులకు సౌకర్యవంతమైన హోమ్ ఛార్జింగ్ అవకాశాలను కల్పించడం ద్వారా ఈవి వినియోగాన్ని పెంచడానికి దోహదపడుతుందని అన్నారు.

### బిజెపి ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగించి

# ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలి

కేంద్ర మంత్రులు ఆయనను నిలువరించకపోవడం బాధాకరం

టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : బ్రిటీష్ కాలం నాటి పరిస్థితులను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని ముడిపెడుతూ బిజెపి ఎంపి తేజస్వీ సూర్య అవగాహన లేకుండా చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించి, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ లోక్ సభ స్పీకర్‌ను కోరారు. మే 12న టిజెఎసి 4వ ప్లీనరీ నిర్వహించనున్నామని, ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకూ సముచిత భాగస్వామ్యం కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. టిజెఎస్ కార్యాలయంలో హైదరాబాద్‌లోని 'టిజెఎస్ 4వ' ప్లీనరీ పోస్టర్లను ప్రొఫెసర్ కోదండరాం శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కార్యాలయం ఎదుట తేజస్వీ సూర్య దిష్టిబొమ్మను టిజెఎస్ నాయకులు దహనం చేశారు. అంతకుముందు కోదండరామ్ మీడియాతో మాట్లాడుతూ ఎంపి తేజస్వీ మాట్లాడుతున్న సమయంలో కేంద్ర మంత్రులు ఆయనను నిలువరించకపోవడం బాధాకరమన్నారు. బిజెపి సీనియర్ నాయకులు సుష్మా స్వరాజ్, వెంకయ్య నాయుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన విషయాన్నిపరిగణలోకి తీసుకోకుండా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని సూచించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాల మధ్య అసమానతలను పెంచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీట్ల పెంపు ద్వారా శాశ్వతంగా అధికారంలో కొనసాగాలనే ఉద్దేశంతో బిజెపి వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, ధర్మర్జున్,అంబటిశ్రీనివాస్,బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్, పల్లె వినయ్ కుమార్, ఎం.నర్సయ్యగౌడ్, సలీంపాషా పాల్గొన్నారు.

# ఏరోస్పేస్' వ్యూహాత్మక కేంద్రంగా తెలంగాణ

'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' జాతీయ సదస్సులో

మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : భవిష్యత్తు 'ఏరోస్పేస్' రంగ అవసరాలకు అనుగుణంగా 'తెలంగాణను దేశానికి ఒక వ్యూహాత్మక కేంద్రం'గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆర్అండ్ డి, అడ్వానడ్స్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అండ్ కాంప్లియెన్స్... ఈ మూడింటినీ అనుసంధానించగలిగే దేశాలు, రాష్ట్రాలే రానున్న రోజుల్లో 'ఏరోస్పేస్'లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయన్నారు. ఆ దిశగా ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పులను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఛేంజింగ్ సినారియో ఇన్ ఏరోస్పేస్, పరిశోధన, అభివృద్ధి, మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ 'ఏరోస్పేస్' అంటే కేవలం యంత్రాల తయారీ మాత్రమే కాదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ రంగంలో ఒకప్పుడు యుఎస్, రష్యా, ఐరోపా దేశాలదే ఆధిపత్యం చెలాయించేవని, ఇప్పుడు వాటికి దీటుగా 'గ్లోబల్ సప్లై చైన్'లో మన దేశం కూడా 'కీ' రోల్ ప్లే డెలాయిట్ గ్లోబల్ ఏరోస్పేస్, డిఫెన్స్ సర్వే ప్రకారం ప్రస్తుతం 74 శాతం మంది ఏరోస్పేస్ సిఇఒలు కేవలం తక్కువ ఖర్చు కంటే పటిష్ఠమైన సప్లై చైన్, తయారీ సామర్థ్యానికే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రానున్న 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,000 కొత్త ఎయిర్ క్రాఫ్ట్స్ అవసరం ఉంటుందని, బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు అంచనా వేశాయన్నారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్, డిజి సిఎస్ఐఆర్, డిఎస్ఐఆర్ సెక్రటరీ డి.ఎన్ కళైసెల్వి, 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' ప్రతినిధులు డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ సోమనాథ్, రాజబాబు, డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగుల పాఠశాలకు నిధులు ఇవ్వండి

ప్రతీ సంవత్సరం రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించాలి

స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాల నిర్వహణకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించాలని ట్రస్టు ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను తన ఛాంబర్‌లో ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. 1990లో స్థాపించిన ఈ ట్రస్టు, మానసిక వికలాంగులైన పిల్లలకు విద్య, శిక్షణ అందించేందుకు ప్రత్యేక పాఠశాలను నిర్వహిస్తోందని మంత్రికి వివరించారు. తొలుత అద్దె భవనంలో ప్రారంభమైన ఈ పాఠశాల, 2002లో ఎల్ఎండి పరిధిలో ప్రభుత్వం కేటాయించిన 2 ఎకరాల భూమిలో స్థిరపడి, అన్ని వసతులతో కూడిన వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌గా అభివృద్ధి చెందిందని చాడ వెంకట్‌రెడ్డి మంత్రికి వివరించారు. అయితే 2014 తర్వాత కేంద్ర నిధులు సకాలంలో విడుదలకాకపోవడంతో పాఠశాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తాయని, ప్రస్తుతం సిఎస్ఆర్ నిధులు, దాతల సహాయంతో సంస్థ కొనసాగుతున్నప్పటికీ ఆర్థిక భారం పెరుగుతోందని తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.50లక్షల గ్రాంట్ లభించగా, అది ఒక్క ఆర్థిక సంవత్సరానికే పరిమితమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి నెల రూ.8.30లక్షల చొప్పున, సంవత్సరానికి కనీసం రూ.1 కోటి ఆర్థిక సహాయం నిరంతరంగా అందించాలని ఆయన మంత్రిని కోరారు.

పూర్తిస్థాయి నిధులు అందినట్లయితే వొకేషనల్ శిక్షణ, ఫిజియోథెరపీ, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి మానసిక వికలాంగులైన పిల్లలను స్వావలంబన వైపు తీసుకువెళ్లగలమని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర మంత్రులు, అధికారులు, జిల్లా యంత్రాంగం పాఠశాలను సందర్శించి ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొంటూ, ఈ సేవా కార్యక్రమానికి ప్రభుత్వం నిరంతర సహకారం అందించాలని ట్రస్టు మరోసారి విజ్ఞప్తి చేసింది.

# బిసి కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్

రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిసి కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో బిసి సంక్షేమ శాఖపై శుక్రవారం బిసి సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమాయదేవి, బిసి గురుకులాల సెక్రెటరీ సైదులు, ఎండి మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిసి సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలను త్వరిగతినా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అలాగే బిసి విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.

బిసి గురుకులాల్లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించడంతో పాటు హాస్టల్‌లు, గురుకుల పాఠశాల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, షూస్ చేరాలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని, కాటమయ్య రక్షణ కవచాలు శిక్షణ ఇచ్చిన వారికి కిట్స్ అందజేయాలని సంబంధిత అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.



## రాజకీయ లబ్ధి కోసమే చట్టసభల పునర్విభజన

ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్‌బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆటో ఎల్‌పిజి కొరతతో గడిచిన నెల రోజులగా ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ లబ్ధి కోసం చట్టసభల పునర్విభజన అంశాన్ని తేవడం దారుణమని ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్‌బోస్, ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం అన్నారు. తక్షణమే గ్యాస్ కొరతను నివారించాలని వారు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న మొండి వైఖరిని, డి లిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి)ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీలిమిటేషన్ ప్రతులను వారు దగ్ధం చేశారు. అనంతరం బోస్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి గ్యాస్ ధరలను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పెట్రో ఉత్పత్తులను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చిఉంటే వాటి ధరలు తగ్గడమే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు కూడా తగ్గి సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేవన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వానికి సమయంలేదు గాని దక్షిణాది రాష్ట్రాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా చట్ట సభల్లో స్థానాల పునర్విభజనను ముందుకు తేవడం దుర్మార్గమన్నారు. వెంకటేశం మాట్లాడుతూ గత నెల రోజులుగా ఆటో ఎల్‌పిజి లేక ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఎల్‌పిజి ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, ఆటో యూనియన్ నాయకులు సిహెచ్. జంగయ్య, ఎస్.అశోక్, ఎం.నర్సింహా తదితర నాయకులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుపై బిజెపిది కపట నీతి

మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : మహిళా రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలు బిజెపి ద్వంద్వ ప్రమాణాలను, కపట నీతిని బయటపెట్టాయని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. లక్ష్యం ఎంత గొప్పదో, దాన్ని సాధించే మార్గం కూడా అంతే పారదర్శకంగా ఉండాలన్న మహాత్మా గాంధీ మాటలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళల సాధికారతపై బిజెపికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, సింపుల్ మెజారిటీతోనే బిల్లును అమలు చేసే అవకాశం ఉందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

అలా కాకుండా, కావాలనే 'డి లిమిటేషన్' అంశాన్ని బిల్లుకు ముడిపెట్టి ప్రక్రియను సంక్లిష్టం చేశారని మండిపడ్డారు. ఇది మహిళా హక్కుల కోసం చేస్తున్న ప్రయత్నం కాదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వేసిన ఎత్తుగడ అని ఆమె విమర్శించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ఓట్ల వేట కోసమే ఈ బిల్లును ఒక అస్త్రంగా బిజెపి వాడుకుంటుందని సీతక్క ఆరోపించారు. బిజెపి ప్రాథమిక భావజాలమే మహిళా వ్యతిరేకమైనదన్నారు. లోక్‌సభ వేదికగా వారి నిబద్ధత లేని తీరు మరోసారి నిరూపితమైందని విమర్శించారు.

# ఐలాపూర్ 'సర్ఫ్-ఎ-ఖాస్' భూములపై హైపవర్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లాలోని ఐలాపూర్ గ్రామ పరిధిలో దశాబ్దాలుగా నలుగుతున్న 'సర్ఫ్ఎఖాస్' భూముల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ భూముల స్వభావం, టైటిల్ వివాదాలు, అక్రమ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, అత్యున్నత స్థాయి అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సిసిఎల్‌ఎ), సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా, రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి, హెచ్‌ఎండిఏ కమిషనర్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్, స్టాంపులురిజిస్ట్రేషన్‌ల శాఖ కార్యదర్శి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. ఈ హైపవర్ కమిటీ క్షేత్రస్థాయిలో, రికార్డుల పరంగా ఐదు ప్రధాన అంశాలపై దృష్టి సారించనుంది.

ఐలాపూర్ భూములు అసలు 'సర్ఫ్ఎఖాస్' పరిధిలోకి వస్తాయా లేదా 'దివానీ' భూములా? అనే అంశాన్ని రెవెన్యూ రికార్డుల ఆధారంగా తేల్చనున్నారు. సివిల్ కోర్టులో ఉన్న పాత కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్లు, గత ఉత్తర్వులను కమిటీ విశ్లేషిస్తుంది. శాటిలైట్ చిత్రాలు, జియోస్పేషియల్ మ్యాపింగ్ ద్వారా భూమిపై ఉన్న అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను శాస్త్రీయంగా గుర్తిస్తారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా అక్రమంగా లేఅవుట్లు వేసినా లేదా భవన నిర్మాణ అనుమతులు పొందినా, వారిపై కఠిన చర్యలకు కమిటీ సిఫార్సు చేయనుంది. ప్రభుత్వ భూములను కాపాడటానికి, అక్రమ నిర్మాణాల తొలగింపునకు అవసరమైన ప్రణాళికను కమిటీ సిద్ధం చేస్తుంది.

**నివేదిక సమర్పణకు గడువు..**

ప్రభుత్వం ఈ కమిటీకి స్పష్టమైన కాలపరిమితిని విధించింది. ఈ కమిటీ తన విచారణను పూర్తి చేసి 4 వారాల్లోగా మధ్యంతర నివేదికను, 8 వారాల్లోగా సమగ్ర తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. గ్రామస్థుల దీర్ఘకాలిక ఆక్రమణలను క్రమబద్ధీకరించాలా లేక వారికి పునరావాసం కల్పించాలా అనే మానవీయ కోణంలో కూడా కమిటీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేయనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ఐలాపూర్ భూములపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. ఇది స్థానికంగా ఉన్న వేల కోట్ల విలువైన భూముల భవితవ్యాన్ని తేల్చనుంది.


**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
**బోడుప్పల్ సర్కిల్-10, ఉప్పల్ జోన్.**

NIT No. 07/EE/Boduppal Circle-10/SWM/MMC/Tenders/2026-27, తేది: 16.04.2026

**పని పేరు:** ఎంఎంసి, ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్-10 పరిధిలో 2 నెలల కాలానికి రోడ్డు అంచుల శుభ్రత పనుల నిమిత్తం 01 JCB, 02 టిప్పర్లు, 02 ట్రాక్టర్లు, కూలీలు మరియు 01 డోజర్‌ను వినియోగించడం. **అంచనా విలువ :** రూ.30.00 లక్షలు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 20.04.2026న సా.4.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, ఎంఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, ఎంఎంసి.

DIPR R.O. No. : 888-PP/CL/ADVT/2026-27, Date: 17-04-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**శంషాబాద్ సర్కిల్-18**

TENDER NOTICE NIT No. 01/EEC-18/SHBD/GHMC/2026-27, తేది: 17.04.2026

**పని పేరు:** పనుల సంఖ్య 01: జిహెచ్‌ఎంసి, శంషాబాద్ సర్కిల్-18 పరిధిలోని వివిధ వార్డులలో వీధి దీపాల నిర్వహణ నిమిత్తం పైపులు, క్లాంపులు మరియు ఇతర లైన్ సామగ్రిని సేకరించడం, **అంచనా విలువ :** రూ.7.00 లక్షలు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 21.04.2026న మ.02.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.కిష్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, ఎంఎంసి.

DIPR R.O. No. : 925-PP/CL/ADVT/2026-27, Date: 17-04-2026

**మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్**

ఆసక్తి వ్యక్తీకరణ

E2/1580/2026 తేది: 16-04-2026

**పట్టణ ప్రగతి, TUFIDC, ఫైనాన్స్ కమిషన్, సిఎం అస్యూరెన్స్, UIDF మరియు ఇతరుల కింద మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఏవైనా ఇతర పథకాల కింద లభించే గ్రాంట్లకు సంబంధించి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డిపిఆర్) తయారీ కొరకు ఆసక్తి వ్యక్తీకరణలను మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆహ్వానిస్తోంది.**

ఇలాంటి ప్రభుత్వ / సంస్థాగత భవనాల కోసం డిపిఆర్‌ల తయారీలో నైపుణ్యం కలిగిన, ఆసక్తిగల, పేరున్న, అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీ సంస్థలు / ఏజెన్సీలు తమ సాంకేతిక, ఆర్థిక బిడ్‌ను (సీల్డ్ కొటేషన్లలో) వివరాలతో పాటు సమర్పించవచ్చు.

అన్ని వివరాలను మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి తేదీ: 21.04.2026న మధ్యాహ్నం 3:00 గంటలు లేదా ఆలోపు తప్పక చేరాలి. మరియు అదేరోజు @ 3:30 గంటలకు వాటిని తెరవడం జరుగుతుంది. ఈ విషయంలో ఎటువటి కారణాలు చెప్పకుండా ప్రతిపాదనలను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు మున్సిపల్ కమిషనర్‌కు ఉంది.

కొటేషన్లపై ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాల కోసం 9705710924 మొబైల్ నంబర్‌కు సంప్రదించవచ్చు.

సం/- కమిషనర్,
మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 907-PP/CL/ADVT/2026-27, Date: 17-04-2026

# రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా సూర్యాపేట

## జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యామిశ్రా పిలుపు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యామిశ్రా పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా (అరైవ్ అలైవ్) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్థానిక కల్నల్ సంతోష్‌బాబు చౌరస్తా నుండి రోడ్డు భద్రతపై నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పిల్లలమర్రి వద్ద బ్లాక్ స్పాట్స్‌లను పరిశీలించిన తదుపరి రుద్రంగి కన్వెన్షన్ హాల్ నందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కోదాడ శాసన సభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె. నరసింహాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నా రన్నారు. దేశంలో 2023లో రోడ్డు ప్రమాదాలతో 4.5లక్షల మంది మృత్యువాత పడ్డారని వివరించారు. ముఖ్యంగా యువత ఓవర్ స్పీడ్‌తో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, ఓవర్ స్పీడ్ వెళ్లకుండా జాగ్రత్తగా వాహనం నడిపితే దాదాపు 50 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. భద్రతగా గమ్యస్థానాలకు చేరడమే అరైవ్ అలైవ్ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జిల్లాలో దాదాపు 200 కిలోమీటర్ల మేర జాతీయ రహ దారులు, 3600 కిలో మీటర్ల మేరకు గ్రామీణ రోడ్డు విస్తరించి ఉన్నాయన్నారు. 2023వ సంవత్సరంలో 257 మంది, 2024లో 278 మంది, 2025లో 230 మంది, 2026 ఏప్రిల్ వరకు 78 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిం చినట్లు తెలిపారు. అరైవ్ అలైవ్ అద్భుతమైన కార్యక్రమమని కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి అన్నారు. రోడ్డు భద్రతపై విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. సూర్యాపేట జిల్లాలో గత సంవత్సరం 600కుపైగా రోడ్డు ప్రమాదాలు సంభవించగా 230 మంది ప్రాణా లు కోల్పోయారని గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో జైళ్ల శాఖ డిజి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఆర్‌టిసి డిఎం సునీత, ఆర్‌టిఓ జయప్రకాశ్ రెడ్డిలతోపాటు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## చైల్డ్ హెల్ప్‌లైన్ సాయంతో బాలికకు విముక్తి

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని పాలవరం గ్రామ శివారులోని పంట పొలాల్లో సుబ్బులు అనే బాలిక బాతులు మేపుతుండటంతో పాలవరం గ్రామానికి చెందిన యువకులు చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098కి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఐసిడిఎస్, ఐసిపిఎస్, సిహెచ్‌ఎల్ వారు అక్కడకు వెళ్లి ఆ పాపను అనంతగిరి పోలీస్ స్టేషన్‌కు తీసుకరాగా, పోలీసులు పాపతో మాట్లాడించారు. పాప తల్లిదండ్రులు సుబ్బయ్య, లక్ష్మి లు గత నాలుగు సంవత్సరాల క్రితం బాతుల యాజమాని పాలకుర్తి శ్రీకాంత్ కోదాడ వద్ద ఉంచి వెళ్లి పోయారని, అప్పటి నుంచి యాజమాని ఆ పాపను ఇంట్లో వెట్టిచాకిరి చేయిస్తూ, బాతులు మేపించడం, అదే విధంగా కొట్టడం, తిట్టడం చేస్తున్నారని పోలీసులకు తెలిపింది. దీంతో చైల్డ్ ఆఫీసర్ నిమ్మగడ్డ శేషారత్నం ఫిర్యాదు మేరకు పాలకుర్తి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్‌ఐ లింగారెడ్డి తెలిపారు.





## కరెంట్ వాళ్ళ కష్టాలు తీర్చండి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్రవ్యాప్తంగా గత పది సమ్మె చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మెను ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం నల్లగొండ విద్యుత్ కార్యాలయం ముందు జరిగిన సమ్మెలో దేవేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఆందోళన నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం చర్చలు జరిపి సమ్మె ను నివారించకపోవడం విచారకరమని అన్నారు.ఏపీఎస్‌ఈబి రూల్స్ అమలు చేయాలని ఆర్టిజెన్స్ ను కన్వర్షన్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీఏఈజెఎసి జిల్లా చైర్మన్ జిట్టబోయిన లింగస్వామి,జిల్లా నాయకులు గుండ లింగారెడ్డి,పెరిక శేఖర్,వేణుగోపాల్ రెడ్డి,పెరమళ్ళ మురళి,అద్దంకి వెంకన్న,లతీఫ్,విజయ్,ఉమాదేవి నాగమణి రమ్య,సతీష్ ,ప్రవీణ్ రమేష్ నరసింహ పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన హార్వెస్టర్

### చెలరేగిన మంటలు..తప్పిన పెను ప్రమాదం..రూ.లక్షల్లో ఆస్తినష్టం



**ప్రజాపక్షం/నకిరేకల్:** మండలంలోని వల్లభాపురం గ్రామ శివారులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.పొలంలో పని చేస్తున్న వరి కోత యంత్రం (హార్వెస్టర్) అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది.అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. వనం మదర్‌కు చెందిన పొలంలో హార్వెస్టర్ పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.పరిస్థితిని గమనించిన డ్రైవర్ వెంటనే యంత్రం నుంచి దూకి సురక్షితంగా బయటపడ్డాడు. క్షణాల్లోనే మంటలు విస్తరించి యంత్రాన్ని పూర్తిగా ఆవరించాయి. డ్రైవర్ సమాచారం అందించడంతో యంత్ర యజమాని కోట్ల నాగయ్య ఘటనాస్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటనలో ఎవరూ గాయపడకపోవడం ఊరటనిచ్చినప్పటికీ,హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమవడంతో లక్షల్లో ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈప్రమాదం రైతుల్లో ఆందోళనకు దారి తీసింది.

## ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా సిపిఐ పోరాటం : తీర్పారి



**ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల :** పచ్చని పంట పొలాల నడుము ప్రజా సముదాయం ఉండే ప్రాంతాల్లో నెలకొల్పి ఫార్మా కంపెనీల నిర్మాణాలకు వ్యతిరేకంగా సిపిఐ పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారివెంకటేశ్వర్లు అన్నారు .శుక్రవారం ఇంటి ఇంటికి సిపిఐ నినాదంతో ప్రజా సమస్యల అధ్యయనం చేస్తూ వివరాలు సేకరన కార్యక్రమం గట్టుప్పల మండలం వెల్మకన్నె గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకెపి సెంటర్‌లో ఉన్న వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.అధికారులు సివిల్ సప్లై నిబంధనలను సడలించి ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి పత్తి పంటకు 12,000 మద్దతు ధర వరి ధాన్యానికి 6000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బి.లాలయ్య.మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్,రైతు సంఘం జిల్లా కోశాధికారి కంపె దుర్గయ్య,మండల కార్యవర్గ సభ్యులు కందాల ముత్యం, దెందేనరసింహ,కందాల శ్రీశైలం,బాలం లింగయ్య పాల్గొన్నారు.

## మాదిగల జనాభా ప్రకారం రిజర్వేషన్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ప్రకారం 11శాతం ఎస్‌సి రిజర్వేషన్ల వాటాన్ని ఇచ్చి అమలు చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ, ఎంఆర్‌పిఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ ఏపూరి రాజు మాదిగలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ జమ్మిగడ్డలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా కులగననలో మాదిగలు 10.3 శాతం ఉన్నారని లెక్కలు తేల్చింది, గతంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు రేవంత్ రెడ్డి ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేసే ప్రక్రియలో మాదిగల జనాభా ప్రాతిపదికన మాదిగల వాటా 11శాతం రావాలని ఆనాడే సామాజిక పరివర్తలు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిన్నశ్రీరాములు మాదిగ, సైదులు మాదిగ పాల్గొన్నారు.

## బాధ్యతలు గుర్తు చేస్తూ... అవగాహన కల్పిస్తూ!



**ప్రజాపక్షం/హాలియా:** మార్పు ప్రజల నుంచి ప్రారంభమైనప్పుడే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని గుర్తించిన పోలీసులు ఆ దిశగా అడుగులు వేస్తూ జిల్లా ఎస్పి శరత్చంద్ర పవార్ చేపడుతున్న సామాజిక బాధ్యత కార్యక్రమాలు ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తుంది. గత సంవత్సర కాలంగా జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తప్పులకు మూలమైన సమస్యని వెతికి పట్టుకొని దానిని ఆ స్థాయిలోనే పరిష్కరించు కోవాలని తెలిపే కార్యక్రమాలను పోలీసుల ద్వారా ప్రజలకు వివరిస్తూ కొంత మార్పుకు శ్రీకారం చుట్టారు. సమస్య చిన్నదే అయినప్పటికీ దానిని ఆలోచించే విధానాల్లో తేడాలు ఉండడం వలన అది జటిలం అవుతుందని గుర్తించని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మత్తులో జోగుతున్న యువత పెడదారి పడుతున్నారని గుర్తించిన ఎస్పీ కొన్ని ఉపాధి కల్పించే కంపెనీల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారిలో మార్పుకు శ్రీకారం చుట్టారు. గత సంవత్సర కాలంగా హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్సై సాయి ప్రశాంత్‌లు పట్టణ కేంద్రాల్లోనే కాకుండా మారుమూల గ్రామాలు తిరుగుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి నిరక్షరాస్యులకు అవగాహన కల్పించడంలో సఫలీకృతమయ్యారు.

# పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండొద్దు

### భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి

### డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/భువనగిరి :** డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రధానంగా పూర్తయ్యాయని, అయితే ప్రత్యేకంగా రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి సదుపాయాలను సమగ్రంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ట్యాంక్ పనులను పరిశీలించి పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ లేకుండా, ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇళ్ల పంపిణీకి ముందు అన్ని సదుపాయాలు పూర్తి చేసి సిద్ధంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన వసతి కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తంగెళపల్లి శ్రీవాణి రవి కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఇది పార్టీ కార్యాలయం కాదు.. ఒక ఎర్రజెండా 'స్ఫూర్తి నిలయం'

### నమ్మిన మార్గం మారలేదు.. కాలం మారినా విశ్వాసం తగ్గలేదు...



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఒక రిటైర్డ్ మెడికల్ ఉద్యోగి తన జీవితాంతం హృదయం లో దాచుకున్న కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఇటుకల మధ్య నిలిపాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో సీనియర్ కమ్యూనిస్టు నేతి యాదగిరి చిన్ననాటి నుంచే ఆకర్షించిన ఎర్ర జెండా పట్ల ప్రేమను ఎప్పటికీ వదల్లేదు. సమానత్వం,సామాజిక న్యాయం,శ్రమజీవుల హక్కులు ఇవి కేవలం మాటలు కాదు,అతని జీవన విధానం.ప్రభుత్వ ఉద్యోగిగా బా ధ్యతలు నిర్వర్తించినప్పటికీ,భుజంపై ఎర్ర కండువా, హృదయంలో కమ్యూనిస్టు భావజాలం ఎప్పుడూ అతని గుర్తింపుగా నిలిచాయి. అదే నమ్మకానికి ప్రతీకగా,తన స్వగృహంపై సిపిఐ సుత్తికొడవలి గుర్తు ప్రతిష్టించాడు.సాధారణంగా పార్టీ కార్యాలయాలపై కనిపించే ఆ గుర్తు ఇప్పుడు అతని ఇంటి గోడలపై గర్వంగా మెరుస్తోంది.చూసేవారికి ఇది ఒక ఇల్లు కాదు ఒక ఉద్యమం నిలిచిన స్థలం అన్న భావన కలిగిస్తుంది.ఇంతటితో ఆగలేదు తన సిద్ధాంతాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో తన కు మారుడికి లెనిన్ అనే పేరు కూడ పెట్టాడు.ఈ యాదగిరి మాత్రం సిద్ధాంతాన్ని మాటల్లో కాకుండా జీవితంలో ఆచరించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు.

# వేగంగా రైస్ మిల్లర్లు ధాన్యం అన్ లోడింగ్



నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** యుద్ధ ప్రాతిపదికన వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. కొనుగోలు కేంద్రాలకు పెద్ద మొత్తంలో వస్తున్న ధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ధాన్యం దించుకోని,రబీ ధాన్యం సేకరణలో మిల్లర్లు రైతుల పక్షాన నిలబడి పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.శుక్రవారం అయన తన ఛాంబర్ లో జిల్లాలోని రైస్ మిల్లర్లు, ధాన్యం సేకరణకు సంబంధించిన సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.కొనుగోలు కేంద్రాలకు రబీ ధాన్యం పెద్ద ఎత్తున వస్తున్నందున రైస్ మిల్లర్లు జాప్యం చేయకుండా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే అన్లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వివిధ కారణాలతో మిల్లుల వద్ద లారీలు అన్లోడ్ కాకుండా నిలిచిపోకూడదన్నారు.జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని,మరో 15రోజుల్లో మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున మిల్లర్లు పూర్తి సామర్థ్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.తాలు,లారీలు తదితర కారణాలతో ఎలాంటి కొర్రీలు విధించకుండా ధాన్యాన్ని దించుకోవాలని,ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని ఆదేశాలు జారీ చేశారు.కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం లోడింగ్ లో ఒకే వెరైటీని మాత్రమే లోడ్ చేసి పంపించాలని,ఏ గ్రేడ్ ధాన్యంతో కామన్ వెరైటీలు కలిపి పంపించకూడదని చెప్పారు. ఇప్పటివరకు ఆయా మిల్లుల వారిగా దిగుమతి చేసుకున్న ధాన్యం వివరాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని కలెక్టర్ ఆదేశించారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,పౌరసరఫరాల జిల్లా అధికారులు వెంకటేశం,రామ్ పతి నాయక్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,డిసిఓ పత్యా నాయక్,జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు నారాయణ,శ్రీనివాస్ ఉన్నారు.

## శాలిగౌరారం ఎంపిడిఒపై బదిలీ వేటు

### కార్యదర్శుల ఫిర్యాదులపై స్పందించిన జిల్లా యంత్రాంగం

### ఇన్‌చార్జిగా నకిరేకల్ ఎంపిడిఒ రజిత నియామకం

**ప్రజాపక్షం/నల్లగొండ:** శాలిగౌరారం మండలంలో ఎంపీడీవోపై వచ్చిన ఆరోపణలు, మండల పంచాయతీ కార్యదర్శుల ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం స్పందించి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి పనికి డబ్బులు డిమాం డ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపిడిఒ జి.జ్యోతిలక్ష్మిని బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండల పంచాయతీ కార్యదర్శులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయిస్తూ,ఎంపీడీవో తమపై మానసిక ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వకపోతే మెమోలు జారీ చేస్తానని,జీతాలు నిలిపివేస్తానని, సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు.వివిధ పనుల పేరుతో ఒక్కొక్క కార్యదర్శిని లక్ష్యంగా చేసుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో విషయం ప్రజల్లో చర్చనీయాంశంగా మారగా ప్రజాపక్షం లో ప్రచురితమైన వార్తకు స్పందించిన జిల్లా అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు.జిల్లా ప్రజా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్.ప్రేమ్ కరణ్ రెడ్డి ఉత్తర్వుల మేరకు ఎంపీడీవో జ్యోతిలక్ష్మిని బదిలీ చేశారు.నకిరేకల్ ఎంపీడీవో జె. రజితను పూర్తి అదనపు బాధ్యతలతో శాలిగౌరారం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమించారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : ఎస్‌పి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ పాటించినట్లయితే సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేరుకుంటారని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని ఏఆర్‌సీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలను పాటించినట్లయితే ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే పౌరులు తమవంతు బాధ్యతగా 100కి కాని 108కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహవీర్ పథకం ద్వారా మొదటిసారి రూ.25వేలు, రెండోసారి రూ.50వేలు, మూడోసారి రూ.1లక్ష వరకు పరిహారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతున్నందున ట్రాఫిక్ సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిర్వహిస్తున్న ఉచిత పెరుగన్నం పంపిణిలో జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ పాల్గొని పేదలకు పెరుగన్నం పంపిణి చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగభూషణ్, సోమనర్సయ్య, పీఎన్‌డీ.ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్ పర్సన్ గుడిపాటి శిరీషనవీన్‌తోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హిమోఫిలియా వ్యాధిపై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** హిమోఫిలియా అనే అరుదైన రక్తస్రావణాకి సంబంధించిన వ్యాధిపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ ఆదేశించారు. శుక్రవారం ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో దీనిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం గడ్డకట్టడానికి అవసరమైన క్లాటింగ్, వాపు, నొప్పి వంటి సమస్యలు కలుగుతాయని వివరించారు. హిమోఫిలియా లక్షణాలు ముందస్తుగా గుర్తించి అవసరమైన చికిత్స విధానాన్ని ప్రజలకు వివరించారు. చిన్న పిల్లల్లో తరచూ రక్తస్రావం, గాయాలు ఎక్కువై మానకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య కార్యకర్తలు వారిని గుర్తించి ఆరోగ్య కేంద్ర వైద్యులకు చికిత్స, సలహాల కోసం రిఫర్ చేయాలని సూచించారు. ఇది అంటు వ్యాధి కాదని వంశపారంపర్య వ్యాదిన్నారు. సరైన సమయంలో చికిత్స అందిస్తే రోగులకు సాధారణ జీవితం గడుపుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కోటి రత్నం, డాక్టర్ ప్రసిద్ధ్, డాక్టర్ శ్రీశైలం, సత్తయ్య, శ్రీదేవి, ఉపేందర్ పాల్గొన్నారు.

## ప్రాణాలు పోయినా సరే సెల్ టవర్‌ను నిర్మించనివ్వం

**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలి గౌరారం):** మా ప్రాణాలు పణంగా పెడతాం.. కానీ మా ఇళ్ల మధ్య మృత్యుపాశంలాంటి సెల్ టవర్‌ను నిర్మించనివ్వం అంటూ న శాలిగౌరారం మండలం మాదారం గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఐదో వార్డు ఎస్‌సి కాలనీలో నివాస గృహాల మధ్య ఎయిర్‌టెల్ 5జీ సెల్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసనలు శుక్రవారం ఉగ్రరూపం దాల్చాయి.గత 15 రోజులుగా జిల్లా కలెక్టర్ నుంచి స్థానిక అధికారుల వరకు పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఆగ్రహించిన యువకులు టవర్ నిర్మాణ ప్రదేశం వద్ద మెడకు ఉరితాడు వేసుకుని వినూత్న నిరసన చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యం తమ ప్రాణాలకు ముప్పు తెస్తోందని,జన సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో టవర్ నిర్మాణం ఎలా అనుమతించారని వారు ప్రశ్నించారు.టవర్ నుంచి వెలువడే రేడియేషన్ కారణంగా నిద్రలేమి, తీవ్రమైన తలనొప్పి వంటి సమస్యలతో పాటు దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గ్రామ మహిళలు,వృద్ధులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పక్షుల మనుగడకూ ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు.ఇక గ్రామపంచాయతీ అనుమతి లేకుండా టవర్ నిర్మాణం చేపట్టడం సరికాదని గ్రామస్థులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోటకూరి పరుశురాం,కార్మిక విభాగం మండల అధ్యక్షుడు మామిడి రమేష్,వార్డు సభ్యులు మామిడి రాజశేఖర్,కట్ట కరుణ,ప్రవీణ్,దాసరి మానస,మధు,యువకులు తీగల గోవర్ధన్,షేక్ షరీఫ్, కందుకూరు వెంకన్న,దాసరి జానమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్
# నలుగురు మావోయిస్టులు మృతి



**హజారీబాగ్ :** జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో శుక్రవారం భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ముందస్తు సమాచారం ఆధారంగా, కెరెడారి పోలీస్ స్టేషన్ పరిధిలోని బటుకా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని వారు పేర్కొన్నారు. మరణించిన మావోయిస్టులలో ఒకరిని సహదేవ్ మహతోగా గుర్తించారు. అతని తలపై రూ. 15 లక్షల రివార్డు ఉంది. 'ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మరణించారు. ఈ ఆపరేషన్‌లో ఏ ఒక్క భద్రతా సిబ్బందికీ గాయాలు కాలేదు' అని బర్కాగావ్ ఎస్‌డిపిఒ పవన్ కుమార్ తెలిపారు. జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో ఈనెల 15న, రూ. 1 కోటి రివార్డు కలిగిన మిసిర్ బెస్ర నేతృత్వంలోని మావోయిస్టు దళానికి, పోలీసు సిబ్బందికి మధ్య జరిగిన తీవ్రమైన కాల్పుల ఘటన జరిగిన కొద్ది రోజులకే ఈ తాజా పరిణామం చోటుచేసుకుంది. ఆ ఎన్‌కౌంటర్‌లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. భారతదేశంలో వామపక్ష తీవ్రవాదం ఆవిర్భవించి ఐదు దశాబ్దాలకు పైగా గడిచిన నేపథ్యంలో, దేశంలో ప్రస్తుతం నక్సల్ హింసా ప్రభావిత జిల్లాలు ఏవీ లేవని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసింది. 2015లో రూపొందించిన 'వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి 'జాతీయ విధానం, కార్యాచరణ ప్రణాళిక' పరిధిలో, ఈ నెల ఆరంభంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష అనంతరం ఈ ప్రకటన వెలువడింది. భారతదేశం మావోయిస్టుల ముప్పు నుండి విముక్తమైందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్చి 30న పార్లమెంటుకు తెలియజేశారు.

## శాసనసభలు, జమ్మూ–కశ్మీర్, యుటిలలో..
# మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 'కేంద్రం నోటిఫై'

**న్యూఢిల్లీ:** అసెంబ్లీలు, జమ్మూ కశ్మీ ర్, కేంద్రపాలిత ప్రాంతాలలో మహిళలకు 33 శాతం కోటాను అందించే మహిళా రిజర్వేషన్ చట్టం–2023 అ మలును కేంద్రం శుక్రవారం నోటిఫై చేసింది. జమ్మూ కశ్మీర్ కోసం జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌లో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఎ) ఇలా పేర్కొంది. 'జ మ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండవ సవరణ) చట్టం, 2023 (38 ఆఫ్ 2023)లోని సెక్షన్ 1 యొక్క సబ్‌సెక్షన్ (2) ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, సదరు చట్టంలోని నిబంధనలు 2026 ఏప్రి ల్ 17వ తేదీ నుంచి అమలులోకి వ స్తాయని కేంద్ర ప్రభుత్వం ఇందుమూలంగా నియమిస్తోంది. ఈ చ ట్టాన్ని అమలు చేస్తున్న కేంద్ర పాలిత ప్రాంతాలకు (యుటిలకు) మంత్రి త్వ శాఖ మరో నోటిఫికేషన్‌ను కూడా జారీచేసింది. 2023లో ఆమోదించిన చట్టం సవరణలపై పార్లమెంట్ చర్చిస్తున్న తరుణంలో ఈ చర్య తీసుకున్నారు. 2023 సెప్టెంబరులో శాసనసభలో మహిళ ప్రాతినిథ్యాన్ని పెంపొ ందించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా పార్లమెంట్ 'నారీ శక్తి వందన్ అధినియమ్'ను ఆమోదించింది. దీని ని సాధారణంగా మహిళా రిజర్వేషన్ చట్టం అని పిలుస్తారు. ఈ చట్టం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు మూడింట ఒకవంతు సీట్లను రిజర్వ్ చేయడానికి వీలు కల్పించింది. 2023 చట్టం ప్రకారం ఈ రిజర్వేషన్ 20234కు ముందు అమలులోకి రాదు. ఎందుకంటే ఇది 2027 జనాభాగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి కావడంతో ముడిపడి ఉంది. లోక్‌సభలో ప్రస్తుతం చర్చలో ఉన్న మూడు బిల్లులను, 2029లో మహిళా కోటాను అమలుచేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

## మహిళా రిజర్వేషన్ చట్టంపై...
# బిజెపి, ప్రతిపక్షాల మధ్య వాగ్వివాదం

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ చట్టం విషయంలో రాజకీయాలు చేస్తున్నారని బిజెపి, ప్రతిపక్షాలు శుక్రవారం ఒకరిపై మరొకరు పరస్పరం ఆరోపణల దాడికి దిగారు. ఈ చర్యను అధికార బిజెపి 'చరిత్రాత్మక చర్య'గా సమర్థించుకోగా, ఈ చట్టంపై నోటిఫికేషన్ జారీ విషయంలో 'ప్రభుత్వం నిద్రపోతోంది' అని ప్రతిపక్షాలు ఘాటుగా విమర్శించాయి. రాజ్యాంగ విరుద్ధమైన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌ను వాడుకుంటోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. శాసనసభలలో మహిళలకు 33శాతం కోటాను కేటాయించే మహిళా రిజర్వేషన్ చట్టం, 2023 పార్లమెంట్‌లో ప్రస్తుతం చర్చిస్తున్న సవరణలను అమలులోకి తీసుకురావడానికి గురువారం నుంచి అమలులోకి రానుంది.ఆ చట్టాన్ని అమలులోకి తీసుకురావడం అత్యవసరమని, ఎందుకంటే అదిలేకుండా ప్రతిపాదిత సవరణ అమలులోకి వచ్చేది కాదని ఒక అధికారి వివరించారు. రాజ్యాంగ సవరణ బిల్లు చట్టంగా మారింది కానీ, ప్రభుత్వం దానిని అమలులోకి తీసుకురాని కారణంగా రాజ్యాంగంలో భాగం కాలేదని, ఒక చట్టం అమలులోకి రాకపోతే, దాని ప్రతిపాదిత సవరణను ఎలా అమలు చేయగలరని ఆయన ప్రశ్నించారు. అందుకే దీనిని ఏప్రిల్ 16నుంచి అమలులోకి తెచ్చామని ఆ అధికారి వివరించారు.

## రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా..
# హరివంశ్ ఏకగ్రీవ ఎన్నిక

**న్యూఢిల్లీ :** నామినేటెడ్ సభ్యుడైన హరివంశ్, శుక్రవారం నాడు వరుసగా మూడవసారి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హరివంశ్ ఎన్నికకు సంబంధించి సభా నాయకుడు జె.పి. నడ్డా తీర్మానం ప్రవేశపెట్టగా, ఎస్. ఫాంగ్నాన్ కోన్యాక్ బలపరిచారు. కాగా, ఆ తీర్మానం మూజువాణి ఓటు ద్వారా ఆమోదం పొందింది. అనంతరం హరివంశ్ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. హరివంశ్‌ను డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నుకోవడానికి మొత్తం ఐదు తీర్మానాలు ప్రవేశపెట్టారు. హరివంశ్ జీ రాజ్యసభ ఉపసభాపతిగా ఎంపికయ్యారని ప్రకటిస్తున్నట్లు తీర్మానం ఆమోదం పొందిన తర్వాత రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. సభా నాయకుడు నడ్డాను, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి, ఉపసభాపతి కోసం కేటాయించిన స్థానానికి హరివంశ్ తోడ్కొని వెళ్లాలని రాధాకృష్ణన్ కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో, ఆ ఇద్దరూ హరివంశ్‌ను ప్రతిపక్ష నాయకుడి పక్కన ఉన్న స్థానానికి తీసుకువెళ్లారు. ఈనెల 9న హరివంశ్ పదవీకాలం ముగిసిన తర్వాత, రాజ్యసభ ఉపసభాపతి పదవి ఖాళీ అయ్యింది. ఆ తర్వాత, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను ఎగువ సభకు సభ్యుడిగా నామినేట్ చేశారు. హరివంశ్ ఎన్నికైన సందర్భంగా ప్రధానమంత్రి మోదీ, ఖర్గే ఆయనకు అభినందనలు తెలిపారు. 'ఇది అనుభవానికి లభించిన గౌరవం, అలాగే ఒక సహజసిద్ధమైన పనితీరుకు లభించిన ఆమోదం' అని మోదీ ఆయనను అభినందిస్తూ అన్నారు. 'హరివంశ్ జీ నాయకత్వంలో సభ పనితీరులో పెరుగు



తున్న సమర్థతను మనమందరం ప్రత్యక్షంగా చూశాం. ఆయన కేవలం సభా కార్యకలాపాలను నిర్వహించడమే కాకుండా, తన జీవిత అనుభవాలను ఉపయోగించి సభకు మరింత వన్నె తెస్తున్నారని చెప్పగలను' అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మూడవసారి ఈ పదవికి హరివంశ్ ఎన్నికవడం అనేది, ఆయనపై, ఆయన అనుభవంపై సభకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు.ఒక నామినేటెడ్ సభ్యుడు ఉపసభాపతిగా ఎన్నికవడం ఇదే మొదటిసారి. హరివంశ్ గతంలో పాత్రికేయుడిగా పనిచేశారు. ఉపసభాపతి ప్రతిపక్షాల పట్ల శ్రద్ధ వహిస్తారని, సభలో వారికి తగినంత సమయం కేటాయిస్తారని ఖర్గే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచడంలో సహాయపడేందుకు, తన మూడవ పదవీకాలంలో హరివంశ్ ప్రతిపక్షాలకు మరింత ప్రాధాన్యత ఇస్తారని ప్రతిపక్ష నాయకుడు ఆశించారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి 2019 నుంచి ఖాళీగా ఉండటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ విషయం తనను బాధించిందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. అంతకుముందు, హరివంశ్‌ను ఎన్నుకోవాలనే తీర్మానాన్ని ఆమోదిస్తున్నప్పుడు సమాజ్‌వాదీ పార్టీ, టిఎంసి వాకౌట్ చేశాయి. హరివంశ్‌కు అనుకూలంగా ప్రవేశపెట్టిన ఇతర తీర్మానాలలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ ప్రవేశపెట్టగా, బిజెపి ఎంపి బ్రిజ్ లాల్ బలపరిచినవి కూడా ఉన్నాయి. మరొక తీర్మానాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టగా, బిజెపి ఎంపి సురేంద్ర సింగ్ నగర్ బలపరిచారు. నాలుగో తీర్మానాన్ని జెడియు ఎంపి, వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా ప్రవేశపెట్టగా, ఆర్ఎల్ఎం ఎంపి ఉపేంద్ర కుష్వాహా బలపరిచారు. హరివంశ్‌కు అనుకూలంగా ఆర్ఎల్‌డి ఎంపి, కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఇచ్చిన మరో నోటీసును శివసేన ఎంపి మిలింద్ మురళీ దేవరా బలపరిచారు.

**సభ సజావుగా జరిగేలా కృషి : హరివంశ్**

సభ గౌరవాన్ని కాపాడటానికి, సభ్యుల హక్కులను పరిరక్షించడానికి, స భా కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటానికి తన బాధ్యతలను ని ర్వర్తించడంలో తాను అన్ని విధాలా కృషి చేస్తానని మూడవసారి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన హరివంశ్ సభ్యులకు హామీ ఇచ్చారు. 'పార్లమెంటరీ నియమాలు, సంప్రదాయాలు, రాజ్యాంగ పరిధికి లోబడి ఉ ంటూనే... సభ గౌరవాన్ని నిలబెట్టడానికి, సభ్యుల హక్కులను పరిరక్షించడానికి, సభ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటానికి నేను సర్వవిధాలా కృషి చేస్తానని ఈ సభకు హామీ ఇస్తున్నానన్నారు. పార్లమెంటులో ఆరోగ్యకరమైన సైద్ధాంతిక చర్చలకు ఆస్కారం ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యంలో ఎటువంటి ద్వేషాలకు లేదా కఠినత్వానికి తావు లేదని ఆయన పేర్కొన్నారు.

# ఇంఫాల్‌లో కాగడాల ర్యాలీ



**ఇంఫాల్/గౌహతి :** మణిపూర్‌లో మరోసారి ప్రజలు రోడ్డెక్కారు. ఇటీవల జరిగిన బాంబు దాడిలో ఇద్దరు చిన్నారులు మరణించిన ఘటనకు నిరసనగా ఇంఫాల్ వెస్ట్ జిల్లాలో నిషేధాజ్ఞలను ధిక్కరించి వేలాది మంది కాగడాల ర్యాలీ నిర్వహించారు. దీంతో భద్రతా దళాలతో ఘర్షణలు చెలరేగాయని అధికారులు తెలిపారు. బిష్ణుపూర్ జిల్లాలోని ట్రోంగ్లావోబిలో ఈనెల 7న జరిగిన పేలుడులో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో సింగ్‌జమేయి వద్ద వేలాది మంది కాగడాలు పట్టుకుని ర్యాలీ ప్రారంభించారు. కొంతమంది నిరసనకారులు భద్రతా దళాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారని, ఘటనా స్థలంలో మోహరించిన సిబ్బందిని దూషించారని అధికారులు తెలిపారు. దాదాపు 2 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత, ఈ ర్యాలీ ముఖ్యమంత్రి బంగ్లా, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, లోక్ భవన్‌లకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న చింగమథక్‌కు చేరుకుంది. సంఖ్యాపరంగా చాలా తక్కువగా ఉన్న భద్రతా సిబ్బంది, నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున నిరసనకారులను వెనక్కి వెళ్లమని కోరడంతో ఘర్షణ చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో, భద్రతా దళాలు గుంపును చెదరగొట్టడానికి పలు దఫాలుగా బాష్పవాయువు ప్రయోగించి, లాఠీచార్జికి పాల్పడ్డాయి. పలువురు యువకులు భద్రతా దళాలపై రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయని వారు తెలిపారు. ఈ ఘర్షణల్లో పలువురు గాయపడగా, బాష్పవాయువు పొగ కారణంగా స్వల్ప గాయాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కనీసం ఐదుగురిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. 'రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని తమకు అనుకూలంగా మలచుకోవడానికి కొందరు శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వ, భద్రతా దళాలకు వ్యతిరేకంగా వారు చేస్తున్న ఎజెండాలను వాడుకుంటున్నాయి' అని ఒక అధికారి తెలిపారు. ట్రోంగ్లావోబి బాంబు దాడి తర్వాత చెలరేగిన హింసాత్మక నిరసనల నేపథ్యంలో, సాయంత్రం 5 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు వ్యక్తులు తమ నివాసాల వెలుపల సంచరించడాన్ని నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు ఇంకా అమలులో ఉన్నాయి.

# బెంగాల్‌లో పెరిగిన అభ్యర్థుల ఆస్తులు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో, టిఎంసి తరపున జంగీపూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసిన జాకిర్ హుస్సేన్, తన ఆస్తుల విలువ రూ. 67 కోట్లుగా ప్రకటించారు. ఐదేళ్ల తర్వాత, 2026 ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన ఆస్తులు రెట్టింపై రూ. 133 కోట్లకు పైగా చేరాయని వెల్లడైంది. దీంతో ఆయన అత్యంత సంపన్న అభ్యర్థులలో ఒకరిగా నిలిచారు. అయితే, ఈ జాబితాలో ఆయన ఒక్కరే లేరు. అదే స్థానం నుండి తిరిగి పోటీ చేస్తున్న బిజెపికి చెందిన పురూలియా ఎమ్మెల్యే సుదీప్ కుమార్ ముఖర్జీ ఆస్తులలో భారీ పెరుగుదల నమోదైంది. 2021లో రూ. 45 లక్షలుగా ఉన్న ఆయన ఆస్తులు, 2026 నాటికి ఏకంగా 2,344 శాతం పెరిగి రూ. 11 కోట్లకు చేరాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో తిరిగి పోటీ చేస్తున్న పలువురు ప్రముఖ అభ్యర్థుల ఆస్తులలో గణనీయమైన పెరుగుదల కనిపించిందని, వారి అఫిడవిట్ల ఆధారంగా సేకరించిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని రాయ్‌గంజ్ నియోజకవర్గం నుండి తిరిగి పోటీ చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి కృష్ణ కళ్యాణి ఆస్తులు, 2021లో సుమారు రూ. 5.8 కోట్లు ఉండగా, 2026 నాటికి అవి 247 శాతం పెరిగి రూ. 20 కోట్లకు పైగా చేరాయి. ఆయన సహచరుడు, పశ్చిమ మేదినీపూర్ జిల్లాలోని సబాంగ్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న మానస్ రంజన్ భునియా ఆస్తులు కూడా రెట్టింపై, దాదాపు రూ. 15 కోట్లకు చేరాయి. దీనికి భిన్నంగా, గత అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించిన సువేందు అధికారి ఆస్తుల విలువలో (చరాస్తుల పరంగా) తగ్గుదల నమోదైంది. నందిగ్రామ్ నియోజకవర్గం నుండి తిరిగి పోటీ చేస్తున్న, అలాగే ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి కంచుకోటగా భావించే దక్షిణ కోల్‌కతాలోని భవానీపూర్ నియోజకవర్గంలో ఆమెతో హోరాహోరీగా తలపడుతున్న ఈ బిజెపి నాయకుడి 2026 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం... ఆయన ఆదాయం 2020–21 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.



8.13 లక్షలు ఉండగా, 2024–25 నాటికి అది రూ. 17.38 లక్షలకు పెరిగింది. అయితే, ఆయన చరాస్తుల విలువ సుమారు రూ. 24.57 లక్షలుగా ఉంది। ఇది 2021లో ఆయన ప్రకటించిన రూ. 59.31 లక్షల విలువతో పోలిస్తే తగ్గుదలనే సూచిస్తోంది. కొన్ని సందర్భాల్లో, ఆస్తుల పెరుగుదల శాతాల పరంగా చూస్తే అత్యంత భారీగా ఉన్నట్లు కనిపిస్తోంది. కూచ్ బెహార్ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి సుకుమార్ రాయ్ ఆస్తులు 300 శాతానికి పైగా పెరిగాయి. అదే సమయంలో, తుఫాన్‌గంజ్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థి చిన్మోయ్ దేబ్ బర్మన్, బహరంపూర్ నుంచి టిఎంసి అభ్యర్థి సుబ్రతా మైత్రా వంటి వారు తమ ఆస్తులలో 150 శాతానికి పైగా పెరుగుదలను నమోదు చేశారు. అయితే, అభ్యర్థులందరి ఆస్తుల విలువలోనూ పెరుగుదల కనిపించలేదు. అధికారితో పాటు, కాళింపాంగ్ నుంచి భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా అభ్యర్థి రుడెన్ సదా లెప్చా, సూతి నుంచి టిఎంసి అభ్యర్థి ఇమాని బిస్వాస్, అలాగే మొయినా నుంచి బిజెపి అభ్యర్థి (క్రికెటర్ నుండి రాజకీయ నాయకుడిగా మారిన) అశోక్ దిండా— వీరందరూ 2021తో పోలిస్తే తమ ఆస్తుల విలువ తగ్గినట్లు ప్రకటించారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌ల ఆధారంగా రూపొందించిన ఈ గణాంకాలు ఈనెల 23న జరిగే మొదటి దశ పోలింగ్‌లో తిరిగి పోటీ చేస్తున్న అభ్యర్థుల ఆర్థిక స్థితిగతులను ప్రతిబింబిస్తున్నాయి.

## మహిళా కోటా చట్ట సవరణను
# డీలిమిటేషన్‌కు ముసుకుగా వాడుతోంది
### కేంద్ర ప్రభుత్వంపై మమతా బెనర్జీ మండిపాటు

**కూచ్ బెహార్ :** కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంటులో ప్రతిపాదించిన మహిళా కోటా చట్ట సవరణను దేశాన్ని ముక్కలు చేసే డీలిమిటేషన్ బిల్లుకు ఒక ముసుగుగా వాడుకుంటోందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వపు ఈ చర్యను టిఎంసి ప్రతి దశలోనూ ప్రతిఘటిస్తుందని శుక్రవారం కూచ్‌బెర్‌లో జరిగిన తమ పార్టీ ఎన్నికల ర్యాలీలో ఆమె స్పష్టం చేశారు. కేంద్రం తీసుకున్న చర్యను వ్యతిరేకిస్తూ, 'మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి బిజెపి పునర్విభజన బిల్లును తీసుకొచ్చిందని బెనర్జీ ఆరోపించారు. పునర్విభజన బిల్లు ద్వారా లోక్‌సభ సీట్ల సంఖ్యను దాదాపు 850కి పెంచడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, ఇది దేశాన్ని ముక్కలు చేస్తుందని టిఎంసి అధినేత్రి విమర్శించారు. ఈ బిల్లులను ప్రవేశపెట్టడంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఒక మాజీ ఎంపిగా, మూడింట రెండు వంతుల మెజారిటీ లేకుండా రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందదని నాకు తెలుసున్నారు. సాధారణ మెజారిటీతో బిల్లులను ఆమోదింపజేయడానికి ప్రయత్నం జరుగుతోందని తన ఎంపిలు తనకు తెలియజేశారని కూచ్ బెహార్ ర్యాలీలో సమావేశమైన వారికి టిఎంసి అధినేత్రి తెలిపారు. తమ పార్టీలో ఇప్పటికే 37 శాతం మహిళా ఎంపిలు ఉన్నారని పేర్కొంటూ, బిజెపి దీనిని ఆదర్శంగా తీసుకుని, ఈ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో తమ మహిళా అభ్యర్థులు గెలిచేలా చూడాలని ఆమె కోరారు. బెంగాల్‌లో గెలిచిన తర్వాత, ఢిల్లీలో వారి ప్రభుత్వాన్ని కూలదోస్తామని మమత ధీమా వ్యక్తం



చేశారు. గత వారం జరిగిన ఒక బిజెపి సభలో, ఉత్తర బెంగాల్ అభివృద్ధికి సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిజం మాట్లాడలేదని బెనర్జీ ఆరోపించారు. 2021 అసెంబ్లీ ఎ న్నికల సమయంలో కూచ్ బెహార్ జిల్లాలోని సీతల్‌కుచి వద్ద కేంద్ర బలగాలు జరిపిన కాల్పుల ఘటనను ప్రజలకు గుర్తుచేస్తూ— ఆ ఎన్నికల రోజున జరిగిన ఘర్షణలో నలుగురు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావించారు. బాధితులకు అండగా నిలవడానికి తాను వెంటనే అక్కడికి వెళ్లానని బెనర్జీ తెలిపారు. తాను బిజెపి బలాన్ని ఒంటరిగానే ఎదుర్కొంటున్నానని పేర్కొంటూ, కాషాయ పార్టీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కానీ ప్రజాస్వామ్యంలో తూటాలు కాదు, ఓట్లు మాత్రమే పని చేస్తాయని బెనర్జీ వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) ముసుగులో సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం)ను ప్రవేశపెడుతున్నారని ఆరోపిస్తూ, బెంగాల్‌లోని చట్టబద్ధమైన నివాసితులను చొరబాటుదారులుగా ముద్రవేస్తున్నారని ఆమె మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సర్ ప్రక్రియలో ఓటర్ల జాబితా నుండి 90 లక్షలకు పైగా పేర్లు తొలగించబడ్డాయన్నారు. బెంగాల్ నుండి వలస వెళ్లే కార్మికులను ఇతర రాష్ట్రాలు కేవలం దాతృత్వంతో కాకుండా, వారి నైపుణ్యాల కారణంగానే స్వీకరిస్తున్నాయని పేర్కొంటూ, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన 1.5 కోట్ల మంది ప్రజలు బెంగాల్‌లో పని చేస్తున్నారని, కానీ మేము వారి పట్ల ఎటువంటి అకృత్యాలకు పాల్పడమని టిఎంసి అధినేత్రి అన్నారు.

# అటవీ కార్యాలయం ధ్వంసం

### స్థానికుల సృష్టించిన బీభత్సంలో పలువురికి గాయాలు

**కోక్రాఝర్/ గౌహతి :** రిజర్వ్ అటవీ భూమిని ఆక్రమించారనే ఆరోపణలపై కొందరు స్థానికులను అదుపులోకి తీసుకోవడంతో, అసోంలోని చిరాంగ్ జిల్లాలో ఉన్న రునిఖాతా రేంజ్ కార్యాలయం వద్ద శుక్రవారం ఒక మూక దాడికి దిగింది. ఈ ఘటనలో అటవీ సిబ్బందితో సహా పలువురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. భూటాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న అటవీ రేంజ్ కార్యాలయాన్ని ఆ ధ్వంసం చేసి, ఆవరణలోని ప్రభుత్వ వాహనాలకు నిప్పు పెట్టిందని వారు చెప్పారు. సీనియర్ పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకోవడం, అదనపు భద్రతా బలగాలను మోహరించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గుంపును చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. 'గురువారం అటవీ సిబ్బంది కొందరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని వెళ్లనిచ్చారు. అయితే, శుక్రవారం ఉదయం ఆగ్రహించిన మూక గుమిగూడి సిబ్బందిపై, అటవీ కార్యాలయంపై రాళ్లు విసిరారు. కొన్ని వాహనాలకు నిప్పు పెట్టారు' అని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అదనపు భద్రతా బలగాలను పిలిపించాం. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని ఆయన అన్నారు. నలుగురు నుంచి ఐదుగురు అటవీ, పోలీసు సిబ్బంది గాయపడ్డారని, నిరసనకారులలో కొందరు కూడా గాయపడ్డారని నివేదికలు ఉన్నప్పటికీ, కచ్చితమైన సంఖ్య ఇంకా తెలియరాలేదని ఆయన అన్నారు. అటవీ కార్యాలయానికి, వాహనాలకు జరిగిన నష్టంపై అంచనా వేసే ప్రక్రియ జరుగుతోందని మరో అధికారి తెలిపారు. అటవీ కార్యాలయం నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని దోచుకున్నారన్న ఆరోపణలపై ఆయన మాట్లాడుతూ, 'మేము అన్ని ఆరోపణలను పరిశీలించాల్సి ఉంది' అని అన్నారు. ఈ గందరగోళంలో తన సహచరులలో కొందరు గాయపడ్డారని ఒక అటవీ సిబ్బంది విలేకరులతో అన్నారు. ఆ గుంపు అటవీ



కార్యాలయాన్ని, నివాస గృహాలను ధ్వంసం చేసి, ఆవరణలోని వాహనాలకు నిప్పు పెట్టింది అని ఆయన చెప్పారు. చిరాంగ్ జిల్లాలో భారత్–భూటాన్ సరిహద్దు వెంబడి ఉన్న సిఖ్నా జ్వలావ్ జాతీయ పార్క్ పరిధిలోకి వచ్చే రిపు చిరాంగ్ రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా చెట్లను నరికి, అటవీ భూమిని చదును చేశారన్న ఆరోపణలపై గురువారం అటవీ సిబ్బంది కొందరు స్థానికులను అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తతలు చెలరేగాయని ఒక అధికారి తెలిపారు. అదుపులో ఉన్న వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి ఒక గుంపు అటవీ కార్యాలయాన్ని ముట్టడించినప్పటికీ, అది ఎటువంటి హింస లేకుండా చెదిరిపోయింది. అయితే, అటవీ సిబ్బంది ముందు రోజు తమపై దాడి చేశారని, ఈ దాడిలో ఇద్దరు మహిళా నిరసనకారులు గాయపడ్డారని ఆరోపిస్తూ, కర్రలు, ఇతర ఆయుధాలు పట్టుకున్న ఒక గుంపు శుక్రవారం ఉదయం గుమిగూడి బీభత్సం సృష్టించింది. ఈ దాడికి పాల్పడిన అటవీ సిబ్బందిపై చర్య తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. వారు అటవీ కార్యాలయం నుండి ఫర్నిచర్‌ను తగలబెట్టి, రాళ్లు పరిచి కొంతసేపు రహదారిని దిగ్బంధించారు. అటవీ సిబ్బందిపై తమ ఫిర్యాదులను పరిపాలనా యంత్రాంగానికి సమర్పించాలని ఒక సీనియర్ పోలీసు అధికారి నిరసనకారులను కోరారు.

# మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌కు ఎందుకు ముడిపెట్టారు

### శశిథరూర్

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ల బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందాల్సిందే అని, అయితే దానిని డీలిమిటేషన్‌తో ఎందుకు ముడిపెట్టారని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రశ్నించారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మూడు బిల్లులపై జరిగిన చర్చలో శశిథరూర్ పాల్గొన్నారు. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ల గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయన్న థరూర్, రాజకీయ కారణాల వల్లే ఇవి ఆలస్యమవుతున్నాయని తెలిపారు. డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం మహిళా రిజర్వేషన్ల ఆశయాన్ని దెబ్బతీస్తుందనీ, ప్రస్తుత లోక్‌సభ సభ్యుల సంఖ్యాబలంతో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం చేపడుతున్న పునర్విభజన ప్రక్రియ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. 'పంట కోతకు సిద్ధంగా ఉంది (మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయవచ్చు). మన ప్రస్తుత పార్లమెంటరీ బలాన్ని బట్టి దీనిని తక్షణమే అమలు చేయవచ్చు. చేయాలి కూడా. దీనిని నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడమంటే, మన దేశ చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైన, సంక్లిష్టమైన పరిపాలనా ప్రక్రియల్లో ఒకదానికి భారతీయ మహిళల ఆకాంక్షలను బందీలుగా చేయడమే. నియోజకవర్గాల పునర్విభజన అనేది కేవలం మ్యాప్‌లను మార్చే పని మాత్రమే కాదు. ఇది రాజకీయ అధికారంలో ఉద్దేశపూర్వకంగా తీసుకువచ్చే ఒక లోతైన మార్పు. మహిళా రిజర్వేష



న్‌ను దీనితో లింక్ చేయడం ద్వారా, భారతీయ మహిళల ఆకాంక్షలను మన చరిత్రలోనే అత్యంత వివాదాస్పద రాజకీయ ప్రక్రియకు బందీలుగా చేసినట్లవుతుంది. గౌరవనీయ సభ్యులు చెప్పినట్లుగా, ఇటువంటి చర్య మన సమాఖ్య వ్యవస్థ నిర్మాణాన్ని దెబ్బతీసే ప్రమాదాలను కలిగి ఉంటుంది' అని శశిథరూర్ పేర్కొన్నారు.

**2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన ద్వంద్వ వైఖరికి నిదర్శనం'**

మరోవైపు లోక్‌సభలో సీట్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఏమొచ్చిందని డిఎంకె ఎంపి కనిమొళి కేంద్రాన్ని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మూడు బిల్లులపై జరిగిన చర్చలో కనిమొళి పాల్గొన్నారు. దేశ జనాభాలో మార్పులు వచ్చాయని ఒకవైపు కేంద్రం చెప్తుందన్న ఆమె, 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామనడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మహిళ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని తమిళనాడు సిఎం సహా ప్రతిపక్ష నేతలు పదేళ్లుగా కేంద్రానికి లేఖలు రాశారని కనిమొళి గుర్తుచేశారు. అప్పుడు చేయకుండా ఇప్పుడు ఇంత హడావుడిగా బిల్లును ప్రవేశపెట్టడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని కనిమొళి ధ్వజమెత్తారు.

**జనగణన ఎందుకు చేపట్టలేదు : డింపుల్ యాదవ్**

ఇదిలా ఉండగా మహిళా రిజర్వేషన్ల బిల్లు చర్చ సందర్భంగా కేంద్రం తీరుపై సమాజ్ వాదీ ఎంపి డింపుల్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మహిళల పక్షాన విపక్షాలు లేవని ఆరోపిస్తున్నారు. 2023లో అధికార, విపక్షాలు కలిసి బిల్లును ఆమోదించాయి. సర్వ సమ్మతితోనే మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందింది. నిజంగా కేంద్రం మహిళల సశక్తీకరణ చేయాలని భావిస్తోందా? 2023లో బిల్లు ఆమోదం వేళ జనగణన చేపడతామని చెప్పారు. జనగణన చేపట్టాలని సమాజ్‌వాదీ పార్టీ చెబుతూ వస్తోంది. జనగణన గురించి ప్రశ్నిస్తే ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతుందని చెప్పారు. మూడేళ్లుగా దేశంలో జనగణన ప్రక్రియ ఎందుకు చేపట్టలేదు. జనగణన, డీలిమిటేషన్ తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్నారు. 2024లో ఎన్‌డిఎ సర్కారు ఏర్పడిన తర్వాత ఎందుకు జనగణన చేపట్టలేదు. ఇప్పటికే జనగణన చేపట్టి ఉంటే డీలిమిటేషన్ దశలో ఉండేవాళ్లం. మహిళా రిజర్వేషన్ల అమలు 2029 వరకు ఆలస్యమయ్యేవి కావు' అని డింపుల్ యాదవ్ అన్నారు.

# చిత్తయిన బిజెపి కుటిల నీతి

లోక్‌సభ సాక్షిగా అధికార బిజెపి కుటిల నీతి చిత్తయింది. ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు పరాజయం పాలయ్యింది. రెండున్నర సంవత్సరాల క్రితమే పార్లమెంటు ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం మాటున తమకు అనుకూలంగా లోక్‌సభ నియోజకవర్గాలను అడ్డగోలుగా పెంచుకోజూసిన మోదీ సర్కార్ పప్పులు ఉడకలేదు. దీనికి సంబంధించిన కుతంత్రపు డీలిమిటేషన్‌కు బాటలు వేసే రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు సమష్టిగా తిప్పికొట్టాయి. బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో 528 మంది ఎంపిలు పాల్గొనగా, ఆమోదానికి అవసరమైన మూడింట రెండో వంతు ఓటు అంకె 352ను అందుకోకుండానే అధికారపక్షం చతికిలపడింది. దానికి జతగా ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఓటింగ్ అవసరం లేకుండానే పక్కకుపోయాయి. ఎన్‌డిఎకు 293 సభ్యుల బలం ఉండగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు పడ్డాయి. ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 మంది ఎంపిలు ఉండగా, బిల్లును వ్యతిరేకిస్తూ 230 మంది సభ్యులు ఓటేశారు. స్థూలంగా ఎవరి శిబిరం వారివైపే ఉన్నప్పటికీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల ముంగిట మహిళా రిజర్వేషన్‌లను ఓడించారనే బిజెపి తప్పుడు ప్రచారం చేస్తుందని తెలిసినా, వెరవకుండా ప్రతిపక్షాలు ధైర్యంగా నిలబడి సమాఖ్యవాదం, రాజ్యాంగ కవచాన్ని కాపాడుకున్నాయి. అంతేగాక ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలలో గూడుకట్టుకున్న మహిళా సాధికారత, సామాజిక న్యాయం పట్ల వ్యతిరేకత బట్టబయలు చేశాయి.

ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన అనుంగ కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు జాతీయ యవనికపై బహుశా ఇదే అతి పెద్ద ఎదురుదెబ్బ. 'తిమ్మిని బమ్మిని చేసైనా సరే' తమ పంతం నెగ్గించుకునేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడని ఈ ద్వయానికి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం నిస్సందేహంగా ఘోర పరాభవం. 2023 సెప్టెంబర్‌లోను ఉభయ సభల ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లులోనే అమలుపై ఎన్‌డిఎ ప్రభుత్వం మోకాలడ్డింది. 2026లో జరిగే జనగణన అనంతర నియోజకవర్గ పునర్విభజన తరువాతనే లోక్‌సభ, శాసనసభల్లో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్‌లు అమల్లోకి వస్తుందనే నిబంధనను అందులో పొందుపరిచింది. అంటే 2034లో జరిగే ఎన్నికల వరకూ మహిళలు నిరీక్షించాల్సిందే. బిల్లు పెట్టినప్పుడు విపక్షాలన్నీ 2025లో జరిగే తక్షణ లోక్‌సభ ఎన్నికల్లోనే అమలు చేయాలని నెత్తిన నోరుపెట్టుకొని మొత్తుకున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో మహిళా రిజర్వేషన్ పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది. అనుకున్నదొక్కటి అయినదొక్కటిలాగా 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్ (400 సీట్లు దాటుతామనే)' నినాదంతో 2025 ఎన్నికలకు వెళ్ళిన బిజెపికి ఓటర్లు షాక్ ఇచ్చారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సాధారణ మెజారిటీ కూడా దక్కకపోవడం తో టిడిపి, జెడి(యు)ల సహకారంతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బహుశా అప్పుడే వచ్చే ఎన్నికల నాటికి తమ పాచికలు పారబోవని కాషాయ దళం నిర్ణయానికి వచ్చినట్లుంది. ఎట్లాగైనా 2029 ఎన్నికల్లో కూడా అధికారాన్ని మరోసారి దక్కించుకునేందుకే కొత్త ఎత్తు వేసింది. అందులో భాగమే మహిళా రిజర్వేషన్‌ల చట్ట సవరణను తెరపైకి తీసుకువచ్చింది. అదెంత ఘోరమైంటే అప్పటి వరకూ లోక్‌సభ స్థానాల పెంపుకు రాజ్యాంగరక్షణగా ఉన్న మూడింట రెండో వంతు మెజారిటీతో పనిలేకుండా సాధారణ మెజారిటీతోనే మార్పులు తీసుకువచ్చే దుర్మార్గపు ఎత్తుగడ సైతం 131వ రాజ్యాంగ సవరణలో భాగమే. దీంతో పాటుగా లోక్‌సభ సీట్ల సంఖ్యను 543 నుంచి 850 వరకు పెంచుకునేలా మార్పులు చేసి, కుటిల బుద్ధితో ప్రస్తుత స్థానాలకు అదనంగా 50 శాతం అన్ని రాష్ట్రాల్లో పెంచుతామనే ఫార్ములాను బిల్లులో ప్రస్తావించకుండా నోటిమాటగానే ముందుకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం తెంపరితనాన్ని ప్రదర్శిం చింది. ఈ దుర్మార్గపు సూత్రంతో అత్యంత నష్టపోయేది దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలే. దీనిని గట్టిగా తిరస్కరిస్తూ దక్షిణాది ముఖ్యమంత్రులు స్టాలిన్ (తమిళనాడు), ఎ.రేవంత్ రెడ్డి(తెలంగాణ)లు బలమైన వాణిని వినిపించారు. అంకెలతో సహా అన్యాయాన్ని ప్రజలకు వివరించడంలో సఫలీకృతుల య్యారు. అయినప్పటికీ, జనగణన పూర్తయ్యేందుకు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున 2029లోనే లోక్‌సభ సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్ అమలుకే రాజ్యాంగ సవరణ తీసుకువస్తున్నట్లు కేంద్రం బుకాయించిం ది.

అయితే, 2026 జనగణనతో జరిగే కులగణన ద్వారా ఒబిసి వివరాలు అధికారికంగా తెలియడంతో పాటు, వారికీ రిజర్వేషన్ ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వస్తున్నందునే, హడావుడిగా 2011 జనాభా లెక్కలతో డీలిమిటేషన్‌కు బిజెపి సిద్ధమైందని ప్రజలను ఒప్పించడంలో ఉత్తరాది పార్టీలైన సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడిలు విజయవంతమయ్యాయి. దీంతో ఎన్‌డిఎ వాదనలు దూదిపింజల్లా తేలిపోవడమే గాక, బిల్లు ఓడిపోయిన పరాభవాన్ని మూటగట్టుకుంది. ప్రభుత్వం చెబుతున్నట్లుగా 2029 వరకు ఆగేకంటే, తక్షణమే మహిళా రిజర్వేషన్ అమల్లోకి తీసుకువచ్చేలా చట్టాన్ని సవరించేందుకు తాము సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఇండియా కూటమి వాదన కూడా ఎన్‌డిఏను ఇరుకున పెట్టింది. దీంతో విపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకమనే బిజెపి కూటమి వేసిన అపవాదుకు తావు లేకుండా పోయింది. మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన రోజునే(ఏప్రిల్ 16న)... 2023లోనే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలులోకి తీసుకువస్తూ కేంద్రప్రభుత్వం హడావుడిగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అంటే మహిళల రిజర్వేషన్‌లు అమలులో ఉన్నట్లే లెక్క. దానిని తక్షణం ఆచరణలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎన్‌డిఎ ప్రభుత్వంపైనే ఉంది. అందుకు డీలిమిటేషన్‌కు సంబంధం లేకుండా చట్టసవరణ బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు విపక్షాలన్నీ రెడీగానే ఉన్నాయి.



## దుష్ట ప్రయత్నాన్ని ఐక్య ప్రతిపక్షం ఓడించింది

**దేశ ప్రజాస్వామ్యానికి హాని కలిగించేందుకు భారతదేశ జనాభాలో సగభాగాన్ని ఒక కవచంగా ఉపయోగించుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ దుష్ట ప్రయత్నాన్ని ఐక్య ప్రతిపక్షం ఓడించింది. మోదీ–షా దేశ జనాభాలో సగభాగాన్ని ఒక కవచంగా ఉపయోగించుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ప్రయత్నించి, ఈ దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, సమాఖ్య వాదానికి హాని కలిగించేందుకు దుష్ట ప్రయత్నం చేశారు. వారి కుయుక్తిని ఐక్య ప్రతిపక్షమైన ఇండియా కూటమి పసిగట్టింది. రాజ్యాంగ సవరణ బిల్లు ఓడిపోయింది. ప్రతిపక్ష పార్టీల నాయకులందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు.**

– కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే




## వారసత్వ కట్టడాలు మానసిక ఆరోగ్య ప్రదాతలు

అంతర్జాతీయ మానవాళిని ఆకర్షిస్తున్న సహజ సిద్ధమైన లేదా మానవ నిర్మిత కట్టడాలు లేదా ప్రదేశాలను వారసత్వ కట్టడాలు (హెరిటేజ్ స్ట్రక్చర్స్) లేదా స్మారక చిహ్నాలు (మాన్యుమెంట్స్) లేదా ప్రదేశాలు (సైట్స్) అని పిలుస్తారు. అత్యంత పురాతన దేవాలయాల నుంచి అత్యద్భుత కట్టడాల వరకు అన్ని ప్రదేశాలు అనాదిగా మానవ నాగరికత చిహ్నాలుగా, గత వారసత్వ సంపద పునాదులుగా కొనసాగుతూనే ఉన్నాయి. వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు మానవ సమాజ మానసిక ఆరోగ్య ప్రదాతలుగా, మానవాళి గత చరిత్రకు సాక్షాలుగా గంభీరంగా నిలబడి ఉన్నాయి. మన పునాదులను పటిష్ట పరుచుకోవడం, వాటి భద్రతకు నడుం బిగించడం నేటి ఆలోచనాపరమైన మానవాళి కర్తవ్యం. మనం నివసిస్తున్న ప్రదేశానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. వాటిలో పురాతన కట్టడాలు, గత వైభవం కలిగిన దేవాలయాలు, అద్భుత సహజ ప్రకృతి ప్రదేశాలు, మనం సగర్వం గా చెప్పుకునే వారసత్వ కట్టడాలు ఉంటాయి.

**అంతర్జాతీయ స్మారక చిహ్నాలు–ప్రదేశాల దినోత్సవం :**

మన వారసత్వ కట్టడాలు, ఆకర్షణీయ స్థలాల మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారడం, విపత్తులు/సంక్షోభాల విష వలయంలో చిక్కి విధ్వంసానికి గురి కావడం జరుగుతున్న వేళ, మన వారసత్వ నిర్మాణాలను కాపాడుకోవాలనే సదుద్దేశంతో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ సంస్థ చొరవతో పాటు యునెస్కో సౌజన్యంతో ప్రతి ఏట 18 ఏప్రిల్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ స్మారక చిహ్నాలు ప్రదేశాల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్) లేదా ప్రపంచ వారసత్వ దినోత్సవం (వరల్డ్ హెరిటేజ్ డే) పాటించుట 1983 నుంచి కొనసాగుతున్నది. వారసత్వ కట్టడాలు, ఇతర ప్రజాదరణ పొంది న కట్టడాలు తరతరాలుగా మానవాళి విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక ప్రశాంతతను, పర్యాటకాన్ని అందిస్తూనే ఉన్నాయి. వీటిని అపురూపంగా కాపాడుకోవడం, వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను సత్వరమే తీసుకోవడం, మన సాంస్కృతిక వైభవ చిహ్నాలను సంరక్షించుకోవడం, వాటిని జాతీయ గుర్తింపు కలిగిన కట్టడాలుగా నిలబెట్టడం మన కనీస కర్తవ్యమని గమనించాలి.

**అంతర్జాతీయ స్మారక చిహ్నాలు–ప్రదేశాల దినోత్సవం–2026 ఇతివృత్తం:**

ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ ఏర్పడి 60 ఏండ్లు పూర్తి అవుతున్న శుభ గడియల్లో 2026 అంతర్జాతీయ స్మారక చిహ్నాలు, ప్రదేశాల దినోత్సవ ఇతివృత్తంగా విపత్తులు, సంక్షోభాల నేపథ్యంలో వారసత్వ కట్టడాల పరిరక్షణ అత్యవసర చర్యలు అనబడే అంశా న్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకృతి సహజ విపత్తులు, మానవ సాయుధ సంక్షోభాలు, వాతావరణ ప్రతికూల మార్పులతో మన వారసత్వ కట్టడాల ఉనికి ప్రమాదపు అంచున నిలుస్తున్న వేళ ప్రభుత్వా లు, సంస్థలు, వృత్తి నిపుణ కళాకారులు, పౌర సమాజం, యువత చేయి చేయి కలిపి మన గత ఘన చరిత్రను కాపాడుకోవడం విధిగా జరగాలి.

**యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు:**

ప్రపంచవ్యాప్తంగా యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపదలు 1,092 ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 845 సాంస్కృతిక, 209 సహజ, 38 మిశ్రమ కట్టడాలు లేదా ప్రదేశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో అత్యధిక వారసత్వ కట్టడాల్లో ఇటలీలో 54, చైనాలో 53, స్పెయిన్‌లో 47, జర్మనీలో 44, ఫ్రాన్స్‌లో 44, ఇండియాలో 43 ఉన్నాయి. 2024లో భారతంలో 43వ యునెస్కో గుర్తింపు పొందిన కట్టడంగా అస్సాంలోని మెయిడమ్ అహోం రాజవంశపు కట్టడం జాబితాలో చేరింది. మన దేశంలోని యునెస్కో గుర్తింపు పొందిన 43 కట్టడాల్లో ముఖ్యమైనవిగా అజంతా గుహలు, ఎల్లోరా గుహలు, ఆగ్రా కోట, తాజ్‌మహల్, కోణార్క్ సూర్య దేవాలయం, మహాబలిపురం, కాజిరంగా నేషనల్ పార్క్, ఖజురాహో స్మారక చిహ్నం, ఫతేపూర్ సిక్రీ, కుతుబ్ మినార్, ఢిల్లీ ఎర్ర కోట, రామప్ప దేవాలయం, శాంతినికేతన్ లాంటివి ఉన్నాయి.

మన పునాదులను కాపాడుకుంటూ, గత వైభవ చిహ్నాల నుంచి ప్రేరణ పొందుతూ, వాటి నుంచి విజ్ఞానాన్ని జుర్రుకుంటూ, పర్యాటక ప్రదేశాలుగా తలచి మానసిక ప్రశాంతతను పొందుతూ బాధ్యతాయుతంగా కొనసాగుదాం. మన వారసత్వ మనుగడను మనమే సంరక్షించుకుందాం.

**(18 ఏప్రిల్ అంతర్జాతీయ స్మారక చిహ్నాలు, ప్రదేశాల దినోత్సవం సందర్భంగా)**

# మహిళా రిజర్వేషన్ బిల్లు రూపశిల్పి గీతా ముఖర్జీ

**డాక్టర్ కుముదిని పతి**

మహిళా రిజర్వేషన్ బిల్లు ముసాయిదా రూపకల్పనలో గీతా ముఖర్జీ పాత్ర , పార్లమెంట్ సంయుక్త సెలెక్ట్ కమిటీలో ఆమె అందించిన సూచనలు ఆదర్శప్రాయమైనవి. నిజానికి ఆ బిల్లుకు ప్రధాన రూపశిల్పి ఆమెనే. ఆమె ఆ బిల్లు కోసం చురుకుగా ప్రచారం చేయడమే కాకుండా, తన జీవిత కాలంలోనే దానిని ఆమోదింపజేయాలని సంకల్పించారు. కానీ, దురదృష్టవశాత్తు, అది జరగలేదు. అయినప్పటికీ, ఆమె కల నెరవేరే రోజు మహిళా ఉద్యమ చరిత్రలో ఒక మలుపు అవుతుంది. నిరాడంబరమైన, వినయశీలి అయినప్పటికీ, మహిళల హక్కులు, భారతదేశంలోని శ్రామిక ప్రజల కోసం పోరాడాలనే ఉక్కు సంకల్పం కలిగిన పశ్చిమ బెంగాల్‌లోని పన్స్కురా నుండి ప్రాతినిధ్యం వహించి సిపిఐ ఎంపి గీతా ముఖర్జీ. ఆమె తన జీవిత చివరి రోజు వరకు చురుకుగా ఉన్నారు. ఆమె 1967 నుండి 1977 వరకు పశ్చిమ బెంగాల్ శాసనసభ సభ్యురాలిగా పని చేశారు. పన్స్కురా పూర్వ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. ఆమె 7 పర్యాయాలు పార్లమెంట్ సభ్యురాలిగా కూడా ఎన్నికయ్యారు. 33 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు పార్లమెంటరీ పోరాటాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆమె కరడుగట్టిన కమ్యూనిస్ట్ అయినప్పటికీ, పార్టీలకు అతీతం గా అందరూ ఆమెను ఆరాధించడమే కాదు గౌరవించారు కూడా.

**గీతా ముఖర్జీ – మహిళా బిల్లు**

రాష్ట్ర శాసనసభలు, పార్లమెంటులో ని మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు మహిళలకు రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటు సంయుక్త సెలెక్ట్ కమిటీకి గీతా ముఖర్జీ 1996 నుండి చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. 1996లో జరిగిన 11వ లోక్‌సభ ఎన్నికల సమయంలో, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ఆమోదింపజేస్తామని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలలో ప్రకటించాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును మొదటిసారిగా 1996 సెప్టెంబర్ 4న యునైటెడ్ ఫ్రంట్ (దేవెగౌడ) ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిని 81వ రాజ్యాంగ సవరణ బిల్లుగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దివంగత గీతా ముఖర్జీ అధ్యక్షతన పార్లమెంటు ఉభయ సభల నుండి 31 మంది సభ్యులతో ఏర్పాటైన సంయుక్త సెలెక్ట్ పార్లమెంటరీ కమిటీకి దీనిని నివేదించారు. సంయుక్త సెలెక్ట్ కమిటీకి వివిధ సంస్థలు, మహిళా సంఘాలు, అసోసియేషన్ల నుండి 102 వినతిపత్రాలు అందాయి. కమిటీ అనేక మంది ప్రముఖ సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధుల వాదనలను కూడా విన్నది. కేవలం 3 నెలల రికార్డు సమయంలో 1996 డిసెంబర్ 9న గీతా ముఖర్జీ నేతృత్వంలోని కమిటీ 11వ లోక్‌సభకు తన నివేదికను సమర్పించింది. ఎంతమంది మహిళలు రక్తంతో సంతకాలు చేసి వినతి పత్రాలు పంపారో నాడు ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నాయకులు గుర్తుచేసుకున్నారు. ఇది గీతా ముఖర్జీని ఎంతగానో కదిలించింది.

**1997 ఆగస్టు 14న వర్షాకాల సమావేశాల చివరి రోజున స్పీకర్, డిప్యూటీ స్పీకర్ లేనప్పుడు సభా కార్యకలాపాలను నిర్వహించే ప్యానల్ స్పీకర్‌లలో ఒకరిగా ఉన్న గీతా ముఖర్జీ...ఆమెకు స్పీకర్ స్థానాన్ని అధిష్టించే అవకాశం లభించింది. అకస్మాత్తుగా గీతా ముఖర్జీ అధ్యక్ష స్థానంలో ఆసీనురాలైన వెంటనే, మహిళా రిజర్వేషన్ బిల్లును చర్చ కోసం స్వీకరిస్తామని ప్రకటించారు. కానీ, దురదృష్టవశాత్తు ఆ బిల్లు కార్యకలాపాల జాబితాలో 24వ అంశంగా చేర్చబడి ఉంది. అంటే, ఆ రోజున ఆ బిల్లు చర్చకు వచ్చే అవకాశమే లేదని అర్థం. సభా కార్యకలాపాలను నిబంధనల ప్రకారమే నిర్వహించాల్సి ఉంటుందని రామ్ నాయక్ (బిజెపి) ఆమెకు గుర్తు చేశారు.**

ఆ బిల్లును దాని తార్కిక ముగింపుకు చేర్చాలని తాను నిశ్చయించుకున్నానని ఆమె అన్నారు. కానీ, కోటాలోనే మరో కోటా కావాలని డిమాండ్ చేసిన ఆర్‌జెడి, జెడి(సెక్యులర్), సమాజ్‌వాదీ పార్టీల సామాజిక న్యాయ శిబిరం అభ్యంతరాల వల్ల ఆమె కల నెరవేరలేదు. దానిని ఆమోదింపజేయడానికి జరిగిన పోరాటం తీవ్రంగా నీరుగారిపోయింది.

**మహిళా బిల్లు కోసం గీతా ముఖర్జీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేశారు. పార్లమెంటులో బిల్లును తీసుకురాలేకపోయిన రోజు గీతా ముఖర్జీ సభ ముగిసిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, 'నా భర్త చనిపోయినప్పుడు కూడా నేను ధైర్యంగా ఉన్నాను. కానీ ఈ రోజు నేను కన్నీళ్లు పెట్టుకున్నాను' అని భావోద్వేగానికి గురయ్యారు.**

మెజారిటీ సాధించడానికి ఆమె వామపక్షాలు, కాంగ్రెస్, బిజెపిలపై ఆధారపడ్డారు. కానీ ఏకాభిప్రాయం లేదనే సాకుతో వారు వెనకడుగు వేయడం చూసి గీతా ముఖర్జీ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆమె ఇతర సమస్యల పట్ల



కూడా అంతే నిబద్ధతతో ఉన్నప్పటికీ, మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా చూడటమే ఆమె ప్రధాన ధ్యేయంగా మారింది. ఆ బిల్లుపైనే పూర్తి గా దృష్టి పెట్టాలను కుంటున్నానని చెబు తూ,ప్రధానమంత్రి ఐ.కె. గుజ్రాల్ ప్రభుత్వంలో మంత్రి పదవి స్వీకరించాలన్న వినతిని ఆమె తిరస్కరించారు.

**ఆ రోజు ఏమి జరిగిందంటే...**

ఇతర వెనుకబడిన తరగతులకు (ఒబిసి లకు) ప్రత్యేక కోటా కోరుకునే వారితో సహా అందరినీ తనతో పాటు కలుపుకువెళ్ళేందుకు గీతా ముఖర్జీ కృషి చేశారు. వర్షాకాల సమావేశాలంతటా, కార్యకలాపాల జాబితాలో చివరి స్థానంలో ఉన్న 81వ ఒకటవ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం ఆమె లాబీయింగ్ చేశారు. 1997 ఆగస్టు 14న వర్షాకాల సమావేశాల చివరి రోజున స్పీకర్, డిప్యూటీ స్పీకర్ లేనప్పుడు సభా కార్యకలాపాలను నిర్వహించే ప్యానల్ స్పీకర్‌లలో ఒకరిగా ఉన్న గీతా ముఖర్జీ... ఆమెకు స్పీకర్ స్థానాన్ని అధిష్టించే అవకాశం లభించింది. అకస్మాత్తుగా గీతా ముఖర్జీ అధ్యక్ష స్థానంలో ఆసీనురాలైన వెంటనే, మహిళా రిజర్వేషన్ బిల్లును చర్చ కోసం స్వీకరిస్తామని ప్రకటించారు. కానీ, దురదృష్టవశాత్తు ఆ బిల్లు కార్యకలాపాల జాబితాలో 24వ అంశంగా చేర్చబడి ఉంది. అంటే, ఆ రోజున ఆ బిల్లు చర్చకు వచ్చే అవకాశమే లేదని అర్థం. సభా కార్యకలాపాలను నిబంధనల ప్రకారమే నిర్వహించాల్సి ఉంటుందని రామ్ నాయక్ (బిజెపి) ఆమెకు గుర్తుచేశారు. గీతా ముఖర్జీ తర్వాత, అధ్యక్ష స్థానంలో కూర్చునే వంతు నితీశ్ కుమార్‌కు వచ్చింది. మరోసారి గీతా ముఖర్జీ మహిళా బిల్లుపై చర్చ జరపాలని పట్టుబట్టారు. నిబంధన 377 కింద చేపట్టాల్సిన కార్యకలాపాలు పూర్తయిన తర్వాత ఆమెకు అవకాశం కల్పిస్తానని నితీశ్ కుమార్ హామీ ఇచ్చారు. కానీ ఆ తర్వాత 'ప్రైవేటు సభ్యుల బిల్లుల' సమయం ఆసన్నమవడంతో, తాను ఏమీ చేయలేనని నితీశ్ స్పష్టం చేశారు.

అప్పుడే ఆమె నిరసనగా వాకౌట్ చేయాల్సిందిగా మహిళా సభ్యులకు విజ్ఞప్తి చేశారు. కానీ కొద్దిమంది మహిళా సభ్యులు మాత్రమే స్పందించారు. చివరకు ఆమెతో పాటు మరో ఐదుగురు వామపక్ష, కాంగ్రెస్ మహిళా ఎంపిలతో కలిసి సభ నుండి బయటకు వెళ్లిపోయారు. సుష్మా స్వరాజ్ (బిజెపి) వారితో చేరకూడదని నిర్ణయించుకున్నారు. '81వ రాజ్యాంగ (సవరణ) బిల్లును చేపట్టనందుకు నిరసనగా మేము వాకౌట్ చేస్తున్నాము' అని గీతా ముఖర్జీ సహా వాకౌట్ చేసిన మహిళ ఎంపిలు ప్రకటించారు. అప్పుడు మధ్యాహ్నం 3.46 గంటలు. హౌరా ఎంపీ ప్రియరంజన్ దాస్ మున్షి కూడా మద్దతుగా సభ నుండి నిష్క్రమించారు.

మహిళా బిల్లు కోసం గీతా ముఖర్జీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేశారు. పార్లమెంటులో బిల్లును తీసుకురాలేకపోయిన రోజు గీతా ముఖర్జీ సభ ముగిసిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, 'నా భర్త చనిపోయినప్పుడు కూడా నేను ధైర్యంగా ఉన్నాను. కానీ ఈ రోజు నేను కన్నీళ్లు పెట్టుకున్నాను' అని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె బలమైన రాజకీయ విశ్వాసాలు, సైద్ధాంతిక నిబద్ధత కారణంగా గీతా ముఖర్జీని పార్టీలకు అతీతంగా అందరూ గౌరవించారు, కానీ ఈ బిల్లుపై ఏకాభిప్రాయం కుదరలేదు. ఆ తరువాత అనేక ప్రయత్నాల తరువాత యుపిఎ హయాంలో రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేశారు. తరువాత 2023 సెప్టెంబర్‌లో ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన ప్రతీసారి గీతా ముఖర్జీ పేరు ను ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్షం వైపు సభ్యుల నుంచి ప్రస్తావించకుండా ఉండలేదంటే, అందుకు ఆమె చేసిన కృషి అర్థమవుతోంది.

మహిళా బిల్లు కోసం గీతా ముఖర్జీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేశారు. పార్లమెంటులో బిల్లును తీసుకురాలేకపోయిన రోజు గీతా ముఖర్జీ సభ ముగిసిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, 'నా భర్త చనిపోయినప్పుడు కూడా నేను ధైర్యంగా ఉన్నాను. కానీ ఈ రోజు నేను కన్నీళ్లు పెట్టుకున్నాను' అని భావోద్వేగానికి గురయ్యారు.

*(ఏప్రిల్ 17న లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా, అనేక మంది అధికార, విపక్ష సభ్యులు గీతా ముఖర్జీ పేరును ప్రస్తావించారు. ఇంతకు ఈ రిజర్వేషన్‌తో గీతా ముఖర్జీ పేరు అంతలా ముడిపడి ఉండడానికి కారణమేంటో తెలుసుకునేందుకు గతంలో ఆమెపై ప్రచురితమైన పరిశోధనా పత్రంలో కొంత భాగాన్ని పాఠకుల కోసం ప్రచురిస్తున్నాం.)*

# ఆదివాసీల లెక్కలపై సందేహాలు!

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల సర్వే గణాంకాలు క్షేత్రస్థాయి వాస్తవాల అనుగుణంగా లేనందున, ఆదివాసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేస్తామనే ముసుగులో, తరతరాలుగా ఈ నేలనే నమ్ముకుని, అడవిని కాపాడుకుంటూ వస్తున్న ఆదివాసీ తెగల జనాభాను అధికారిక లెక్కల నుండి ఉద్దేశపూర్వకంగా తుడిచిపెట్టడం అత్యంత బాధాకరం. ముఖ్యంగా 'నాయకపు' (నాయక పోడు) సామాజికవర్గం విషయంలో ఆ వ్యత్యాసం కరువవుతోంది.

**గణాంకాల గారడీ.. ఆదివాసి తెగల 10లక్షల జనాభా ఎటు పోయింది?**

రాష్ట్రవ్యాప్తంగా 2011 జనాభాలెక్కల ప్రకారమే తొమ్మిది తెగల జనాభా 10లక్షలు..గోండులో ఉప తెగ నాయక పోడులు దాదాపు 6,50,000 పైచిలుకు ఉన్న నాయకపు, నాయక పోడు జనాభా, గడిచిన 15 ఏళ్లలో కనీసం ఎన్ని లక్షలకు చేరుకోవాలి. కానీ, ప్రభుత్వం విడుదల చేసిన తాజా నివేదికలో ఈ తెగ జనాభాను కేవలం 16,510గా చూపడం చూస్తుంటే, అసలు సర్వే అధికారులు గ్రామాల్లోకి వెళ్లారా లేక ఎసి గదుల్లో కూర్చుని అంకెల గారడీ చేశారా అన్న అనుమానం కలుగుతోంది.

ఒక్కో నియోజకవర్గంలో 20 వేల నుండి 30 వేల వరకు ఓటు బ్యాంకు ఉన్న ఒక శక్తివంతమైన సామాజిక వర్గాన్ని, రాష్ట్రం మొత్తానికి కలిపి 16 వేలకు పరిమితం చేయడం అంటే అది కేవలం గణాంకాల లోపం కాదు, అది ఒక జాతి అస్తిత్వంపై జరుగుతున్న దాడి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అట్టడుగు వర్గాల జనాభాను బలి ఇస్తోంది.

**మైదాన ప్రాంత ఆదివాసీల విస్మరణ**

నాయకపు ప్రజలు అత్యధికంగా మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రభుత్వం చేసిన అతిపెద్ద తప్పిదం ఏమిటంటే, తెగల వారీగా విభజించడంలో శాస్త్రీయతను పాటించకపోవడం. క్షేత్రస్థాయిలో సర్వే సిబ్బందికి ఆదివాసీ తెగలపై, వారి ఉపకులాలపై కనీస అవగాహన లే దు. గోండు నాయకపుల మధ్య ఉన్న విడదీయలేని అనుబంధాన్ని గుర్తించకుండా, వారిని ఇతర వర్గాల్లో కలిపేయడం వల్ల నష్టం జరిగింది.

**అధికారుల నిర్లక్ష్యం – పాలకుల బాధ్యతారాహిత్యం**

సర్వే నిర్వహించిన తీరు చూస్తే, ఆదివాసీ గ్రామాలు మరియు మైదాన ప్రాంతాల్లోని ఆదివాసీ ఆవాసాలను గాలికి వదిలేసినట్లు అర్థమవుతోంది. సర్వే సిబ్బందికి సరైన శిక్షణ లేకపోవడం, భాషా సమస్యలు మరియు ఆదివాసీ తెగల పేర్లపై అవగాహన లోపించడం వల్ల ఈ అనర్థం జరిగింది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలి. గణాంకాలు తప్పని తెలిసినా వాటిని సమర్థించుకోవడం పాలకుల అహంకారానికి నిదర్శనం. ఒక జాతి ఉనికిని కాగితాల మీద లేకుండా చేయడం ద్వారా మీరు ఏ సామాజిక న్యాయాన్ని సాధిస్తారని ప్రశ్నిస్తున్నాం.

**వెంకగారి భూమయ్య**, 9848559863

# పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే.. ఆత్మహత్యలు పరిష్కారం కావు

లేఖ

తెలంగాణలో ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. గతంతో పోల్చుకుంటే పాస్ పర్సంటేజ్ పెరిగింది. పరీక్షలలో తప్పామని పదిమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు కార్పొరేట్ కళాశాలలు మంచి మార్కుల వచ్చిన విద్యార్థుల వివరాలతో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. దాన్ని వారి వ్యాపారంలో భాగంగా చూడాలే తప్ప, మన వ్యక్తిగత జీవితానికి ఆపాదించుకోకూడదు. మార్కులు తగ్గినా, వెంటనే బెటర్‌మెంట్ పరీక్ష ఉంటుంది. పరీక్షల ఒత్తిడితో, ఫెయిల్ అవుతామని, ఫెయిల్ అయ్యామని ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థుల గురించి వినడం హృదయ విదారకంగా ఉంది. పరీక్షలే జీవితం కాదనే విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. ఇవి జీవితంలో ఒక భాగం మాత్రమే.ఎందరో గొప్ప వారు తొలుత పరాజయం పొందినవారే. అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహాం లింకన్ ఎన్నోసార్లు ఎన్నికల్లో ఓడిపోయారు. చివరికి అమెరికా అధ్యక్షులు అయ్యారు. ఇంకా హాకింగ్, ఎడిసన్ వంటి శాస్త్రవేత్తలు తమ అంగ వైకాల్యాన్ని అధిగమించి, జీవితంలో విజయం సాధించారు. మనకు ఓకే ఒక జీవితం ఉంటుంది. పరీక్షలలో ఫెయిల్ అయితే జీవితం ముగిసిపోదు. సెలవుల్లో జాగ్రత్తగా చదవాలి. పునః సమీక్ష చేసుకోవాలి. కాపీల ద్వారా గాకుండా, కష్టపడి చదవాలి. అధ్యాపకుల సలహా లు తీసుకోవాలి. వారిని గౌరవించాలి. ఐ.పిఎల్ మ్యాచులకు దూరంగా ఉండాలి. అంతే గానీ ఒత్తిడికి గురై, జీవితాన్ని బలి తీసుకోకూడదు. మనం ఏదైనా సాధించాలంటే జీవించాలి. లోపాలను సరిదిద్దుకోవాలి. ఎవరికైనా అవమానాలు వస్తాయి. వాటిని గురించి పెద్దగా ఆలోచించ వద్దు. అలాగని కష్టపడకుండా ఏదీ రాదు.

**కామిడి సతీష్ రెడ్డి**, 9848445134

## రోడ్డు భద్రత, నిబంధనలపై చైతన్యం అవసరం: డిజిపి శివధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రోడ్డు భద్రత, నియమాలు, ప్రమాదాల నిర్మూలనపై ప్రతి ఒక్కరు చైతన్యం కలిగి ఉండాలని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రమాదాలు అరికట్టేందుకు అరైవ్ అలైవ్ ప్రతిష్టాత్మకంగా చేపడుతుండగా, ఈ కార్యక్రమ లక్ష్యాలు ప్రతి ఒక్కరికి చేరాలని ఆకాంక్షించారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, రోడ్డు భద్రత కమిటీలతో క్షతగాత్రులకు త్వరితగతిన వైద్య సహాయం అందించే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు నిబంధనలు ఉల్లంగించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తదితర అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాలు తగ్గించడం కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే చక్కటి ఫలితాలు వస్తాయని చెప్పారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ట్రైనీ ఐపీఎస్ అయేషా ఫాతిమా, ఏసిపి నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ నిర్దేశిత గడువుల్లోనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి,సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయాలు లేకుండా తగినన్ని గన్నీ సంచులు,తూకపు యంత్రాలు,తేమ కొలిచే పరికరాలు,టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ప్రభుత్వం అందించిన చెక్ లిస్ట్ ప్రకారం అన్ని సామాగ్రి సమగ్రంగా ఉందో లేదో పరిశీలించి,పరికరాలు సక్రమంగా పనిచేసేలా ముందుస్తు తనిఖీలు చేయాలని సూచించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో నిబంధనలకు అనుగుణంగా రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని ధాన్యం స్వీకరణలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్,డీఆర్‌డీఓ విజయ లక్ష్మి ,వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాదవ,పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్,సుధాకర్,మార్క్‌ఫెడ్ ప్రతినిధులు మహేష్,మిలర్స్ అసోసియేషన్ సభ్యులు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో దొంగల పట్ల అప్రమత్తం

మెదక్ ఎస్‌పి డి.వి. శ్రీనివాస రావు

**ప్రజాపక్షం/మెదక్ :** వేసవి కాలంలో దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల పరిసరాలలో సిసి కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్‌పి డి.వి. శ్రీనివాస రావు సూచించారు. సెలవులు, పెళ్లిళ్లు, టూర్ల కారణంగా ఇళ్లను ఖాళీగా వదిలే సందర్భాలు ఎక్కువగా ఉండటంతో భద్రత పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమీపంలోని పోలీస్ స్టేషన్లో ముందస్తుగా సమాచారం అందించాలని సూచించారు. ఇళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం అవసరమన్నారు. విలువైన వ స్తువులు, నగదు, బంగారం ఇంట్లో ఉంచకుండా భద్రపరచుకోవాలని స్ప ష్టం చేశారు. బయటకు వెళ్లే విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకోవద్ద ని, అనుమానం కలిగితే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే దొంగతనాలను అరికట్టవచ్చని ఎస్‌పి తెలిపారు.

## సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు


**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల లో ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం ఆయన కళాశాల ప్రిన్సిపల్ ఆర్.పాండు రంగ శర్మ, వైఎస్ ప్రిన్సిపల్ జి.అనూష, ఆధ్యాపక బృందంతో కలిసి అడ్మిషన్లకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2026–27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభించడం జరిగిందని, 2018 నుండి ఇప్పటి వరకు అత్యుత్తమ వార్షిక ఫలితాలతో విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన

**ప్రజాపక్షం/గజ్వేల్:** సిద్దిపేట జిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ గ్యాదరి పరమేశ్వర్ ఆదేశాల మేరకు టిఎన్జీఓస్ గజ్వేల్ తాలూకా కార్యదర్శి రాజశేఖరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్ ఐఓసీ వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్సిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ లో ఉన్న అన్ని డిఏలు విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన అన్ని రకాల బెనిఫిట్స్ మంజూరు ఇవ్వాలని, లేని పక్షంలో ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతుందని హెచ్చరించారు. కాగా సిఎం రేవం త్ రెడ్డి ఎన్నికల సందర్భంలో ఈ విషయాలు మేనిఫెస్టోలో పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్జీవో వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం, వెంకట్, టిఎన్జీవో జిల్లా మహిళా విభాగం నేతలు జబినా సుల్తానా, గజ్వేల్ తాలూకా ట్రెజరర్ ప్రవీణ్, జిల్లా పెన్షనర్ల సంఘం సహా అధ్యక్షులు రాజేష్, గజ్వేల్ పెన్షనర్ సంఘం బాధ్యులు నాగేశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, ఆయా సంఘాల బాధ్యులు సత్యనారాయణ రెడ్డి, లింగం, వలీ అహ్మద్, సత్యనారాయణ, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొనగా, గజ్వేల్ తహసీల్దార్ స్వామికి వినతిపత్రం అందజేశారు.

## ధాన్యం, పసుపు, మొక్కజొన్న..
# కొనుగోళ్ల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రైతుల ప్రయోజనార్థం జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం సేకరణ, పసుపు, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. మొక్కజొన్న, పసుపు విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులుంటే రైతులు కంట్రోల్ రూమ్ 08462220183కు సంప్రదించి ఫిర్యాదులు, సలహాలు; సూచనలు అందించవచ్చని సూచించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూమ్ పని చేస్తుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంటారని, రైతుల నుండి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగంచేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా వరి ధాన్యం అమ్మకాలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ కోసం రాష్ట్రస్థాయిలో అందుబాటులోని టోల్ ఫ్రీ నెంబర్లు 1967 కు లేదా 180042500333 కు రైతులు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం ప్రవీన్, ఎఎస్‌ఓ అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

## విమానాశ్రయంపై త్వరలోనే స్పష్టత: ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్ :** ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టుపై త్వరలో పూర్తి స్పష్టత రానుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. శుక్రవారం రక్షణ శాఖ, ఏఏఐ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంయుక్తంగా బంగారిగూడ, లాండ సాంగి, సీసీఐ ప్రాంతాల్లోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సుమారు 15వందల ఎకరాలకు పైగా భూమి అవసరమని అధికారులు గుర్తించారని చెప్పారు. త్వరలోనే భూసేకరణపై దృష్టి సారిస్తామని, ఢిల్లీలో జరిగే తదుపరి సమావేశంతో ప్రాజెక్టుపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మెదక్ :** ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జెఎసి చైర్మన్ దొంత సరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో ఉద్యోగ సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏలు, బకాయిల విడుదలతో పాటు పీఆర్సీ అమలు, 51శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెఎసి సెక్రెటరీ జనరల్ విట్టల్, టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ట్రేస, పిఆర్టియూ, ఎస్టియూ, యుటిఎఫ్, టిపిటిఎఫ్, టిటియూ నేతలు మహేందర్ గౌడ్, సతీష్ రావు, రాజగోపాల్ గౌడ్, పద్మారావు, యాదగిరి, శివయ్య, ప్రసాద్, శ్యాంసుందర్, చరణ్ సంగ్, సౌమ్య నాయక్, నరేష్ కుమార్, సాంసన్ జయకర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కిషన్ తో పటు భారీ ఎత్తున ఉద్యోగులు, వివిధ ఉద్యోగుల సంఘం బాద్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మండల అభివృద్ధికి కృషి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి




**ప్రజాపక్షం/వెల్దుర్తి :** వెల్దుర్తి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. వెల్దుర్తి మండలంలోని ఉప్పు లింగపూర్ గ్రామంలో శుక్రవారం మండలం పరిధిలోని ఆయా గ్రామాల కు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకొని, బిల్లును తీసుకోవాలని సూచించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 400 ఇళ్లు మంజూరు కావడం జరిగిందని, అందులో వెల్దుర్తి మండలానికి 43 మంజూరు కాగా లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. వెల్దుర్తి నుండి మెదక్ వరకు రోడ్డు నిర్మాణం కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, త్వరలో మంజూరు కావడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు శాకారం శ్రీనివాస్ గౌడ్, వెల్దుర్తి ఉపసర్పంచ్ కమ్మరి శ్రావణ్ కుమార్, ఎంపీడీవో ఉమాదేవి, విద్యుత్ శాఖ ఏఈ పెంట్య నాయక్, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న సబ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

అవసరమైన చోట్ల సబ్ సెంటర్లు ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** మొక్కజొన్న పంటను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని,ఈపాటికి అన్ని మండలాల్లో మొక్క.జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు.శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ డిఎం శ్రీనివాస్ రెడ్డిని కలిసిన సందర్భంగా మాట్లాడారు .ముథోల్ నియోజకవర్గంలో ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న పంట ఉందని, భారీ వర్షాలతో రైతులు నష్టపోయారని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేపడితే కొంతైనా మేలు జరుగుతుందని ఆయన డిఎంకు తెలియజేశారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉన్నందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్మితే క్వింటాలుకు 700 రూపాయల వరకు అధిక ధర వస్తుందని, వెంటవెంటనే కొనుగోలు చేపట్టి, పంట అమ్మిన డబ్బులను రైతుల ఖాతాల్లో సత్వరం వేసేలా చర్యలు చేపట్టాలన్నారు.ప్రతి మండలంలో ప్రధాన కొనుగోలు కేంద్రాలతో పాటు సబ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పంట అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవని, ఎక్కడ ఎక్కడ సబ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలో ఆయన రాతపూర్వకంగా ఎండికి వివరించారు.నియోజకవర్గంలో 30కి పైగా సబ్ కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా అమ్మకానికి తెచ్చిన పంట వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. మొక్కజొన్న రైతులు ఆందోళన పడకుండా తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## నిర్మల్ ఎస్‌పి జానకి షర్మిలకి 'స్కాచ్' అవార్డు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సమాజంలో మహిళలు,విద్యార్థినుల భద్రత కోసం ప్రవేశపెట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమం జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది,ప్రతిష్టాత్మకమైన స్కాచ్ అవార్డును దక్కించుకున్న సందర్భంగా నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలని ట్రస్మా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్పీ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఎస్పీ తీసుకున్న చొరవ వల్ల ఈ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని గుర్తింపు పొందిన ఈ కార్యక్రమం మహిళా భద్రతలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని కొనియాడారు.ఈ సన్మాన కార్యక్రమంలో శ్రీధర్,శ్యామ్ ప్రకాష్, షబ్బీర్, జీషాన్ అలీతదితరులు పాల్గొని ఎస్పీ కి అభినందనలు తెలిపారు.

## సిపిఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రస్తుత తరుణంలో హృదయ సంబంధమైన రోగాలు ఎక్కువైపోతున్న నేటి సమాజంలో ప్రతి ఒక్కరు సిపిఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కమిషనర్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ హాల్‌లో బ్లూ కోర్టు సిబ్బందికి, ఆటోడ్రైవర్లకు సిపిఆర్ పద్దతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు త్వరితగతిన అట్టి వ్యక్తిని కాపాడడానికి సిపిఆర్ ఎలా ఉపయోగపడుతుందో వైస్ సిబ్బందితో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నియంత్రించడం, ప్రజలలో ట్రాఫిక్ నియమాలు పట్ల బాధ్యత పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. సిపిఆర్ విధానం, ప్రాథమిక చికిత్స అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీశైలం, ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ రిజర్వు ఇన్స్‌పెక్టర్ వినోద్, డాక్టర్లు విశాల్, రామనేశ్వర్, శ్రీశైలం, విఠల్ అనస్తేషియా, ఐటి కోర్ సిబ్బంది, బ్లూ కోర్టు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# రైతులకు రుణమాఫీ చేయాలి

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** రుణమాఫీ చేయమని అడిగినందుకు కమ్మర్‌పల్లి బిఆర్ఎస్ నాయకులు రైతులపై అక్రమ కేసులతో ఇబ్బంది పెడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి వైఖరిని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో 52 వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 22 వేల మంది రైతులకు రుణమాఫీ చేసి ఇంకా 30 వేల మంది రైతులకు రుణమాఫీ చేయనందుకు రైతులందరికి రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని నిలదీసినందుకు కమ్మర్‌పల్లి బిఆర్ఎస్ నాయకులు, రైతులపై అక్రమ కేసులు పెట్టి గత రెండేళ్లుగా కోర్టుల చుట్టూ తిప్పించటం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ కోర్టులో కేసు హియరింగ్‌కు హాజరైన బిఆర్ఎస్ నాయకులు, రైతులు తమకు న్యాయం చేయాలని, ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేయటం సమంజసమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిని నెరవేర్చాలని ప్రశ్నించిన బిఆర్ఎస్ నాయకులు, రైతులను కోర్టుల చుట్టూ తిప్పించటం అత్యంత బాధాకరమని, ఇది రైతులపట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్య ధోరణిని చూపిస్తోందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులపై ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని రైతులను ఇబ్బందులకు గురి చేసే విధానాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని వేముల డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని వేముల హెచ్చరించారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల అభివృద్ధి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించి గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని, ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్‌గా వ్యవహరించాలని సూచించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా వినియోగించి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు మోడల్ గా తీర్చిదిద్దాలని, గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. గ్రామల్లో సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని 15 ఆర్థిక సంఘం నిధులను అన్ని గ్రామాలకు ప్రభుత్వం అందించిందని, వాటితో గ్రామాల్లో సమస్యలు లేకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. నిధుల వినియోగం లో అక్రమాలకు తావులేదన్నారు. నిధులు సక్రమంగా వినియోగించక పోతే, అక్రమాలు జరిగితే సర్పంచ్, కార్యదర్శుల పై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా సంపత్ కుమార్, గ్రిడ్ డిఈ నాగభూషణం, డిఎల్పి లు సాయి బాబు, తిరుపతి రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నా రు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు

జిల్లా కలెక్టర్ హరిత ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హరిత ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించిన ఆమె నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలను సందర్శించి వడగాలుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మందుల నిల్వల గదిని పరిశీలించి ఆసుపత్రిలో సరిపడా మందులు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. సూపర్ వైజర్లు క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులతో స్నేహభావంతో వ్యవహరించి వారికి భరోసా కల్పించాలని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో

# సజావుగా రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ

అదనపు కలెక్టర్ మాధురి




**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి అటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏపిఎంలు ,ప్యాక్స్ సెక్రటరీలు వ్యవసాయ అధికారులు పిసీసీ ,ఐకేపి ఎంటర్ల ఇన్ చార్జి లు తూనికలు కొలతల శాఖ అధికారులు రవాణా శాఖ అధికారులు సహకార శాఖ అధికారులు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ఇతర సంబందిత శాఖల అధికారులతో కలిసి యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025– 26 రబీ సిజన్‌లో మొత్తం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం మార్కెట్కు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 20 వేల మెట్రిక్ టన్నుల ఉండనున్నాయని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ ,పిడి డిఆర్డీఓ జ్యోతి జిల్లా సహకార శాఖ కిరణ్ కుమార్, ఏసిఎస్‌ఓ రాజేశ్వర్ డిపిఎంలు ,ఏపిఎంలు ప్యాక్స్ సెక్రటరీలు వ్యవసాయ అధికారులు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళల ప్రాధాన్యానికి ప్రభుత్వం పెద్ద పీట

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :** కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సమయంలో అంగన్ వాడి టీచర్లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలోని అంగన్ వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో తొలి రోజు రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని అన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చే యడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ము ందుకు సాగుతున్నరని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు బస్సు లు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకివ్వడం, స్వయం ఉపాధి కోసం పెట్రోల్ బంక్ లో ఏర్పాటు, సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేసి మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పేర్కొన్నారు.అంగన్ వాడి టీచర్లు తల్లి బిడ్డల క్షేమం కోసం పనిచేయాలని మంత్రి కోరారు. ప్రస్తుతం అంగన్వాడి సేవలను ఆన్లైన్ ద్వారా అందించడానికి ప్రభుత్వం అంగన్ వాడి టీచర్లను సెల్ ఫోన్లు అందిస్తుందని మంత్రి వివరించారు. వివరించాల్సిన బాధ్యత అంగన్ వాడిలు తీసుకోవాలని మంత్రి కోరారు. జగిత్యాల జిల్లాలోని అంగన్ వాడి టీచర్లకు త్వరలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. అదనపు కలెక్టర్ రాజ గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ వాణి,తదితరులు ఉన్నారు.




## కాంగ్రెస్ పార్టీలోకి పెండ్యాల తిరుపతి

మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో చేరిక

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్ గ్రామానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు పెండ్యాల తిరుపతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జగన్నాథపూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఆరపెల్లి సమ్మయ్య, ఆరపల్లి రమేష్, వార్డు సభ్యులు ఆరపెల్లి సమ్మయ్య, ఆరపెల్లి చిరంజీవి, పెండ్యాల కుమారస్వామి, సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు పెండ్యాల భాస్కర్, బండి కుమార స్వామి, పెండ్యాల సామెల్, పంజాల చేటారి గౌడ్, రాజేష్, శ్రీనివాస్, మధు, శ్రీనివాస్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గోదావరి ఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి,ఆసుపత్రిలోని మెడికల్ ఓపీ, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ డాక్టర్స్ గదులను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని,అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత ఏజెన్సీకి సూచిస్తూ, తక్షణమే తనను కలవాలని ఆదేశించారు.రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెడ్ స్ట్రెంగ్త్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఒక ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.ల్యాబ్ యంత్రాలు, ఎసి వంటి పరికరాల్లో ఎలాంటి లోపాలు వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డాక్టర్ లు కృపాబాయి,రాజు,సంబంధిత అధికారులు, ఆసుపత్రి సిబ్బంది,పాల్గొన్నారు.

## మైదంబండ గ్రామానికి చిల్డ్రన్ పార్క్

మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మైదంబండ గ్రామంలోని చిన్నారుల వినోదం,ఉల్లాసం కోసం 13 లక్షల రూపాయల నిధులతో చిల్డ్రన్ పార్కును మంజూరు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బియ్యాని శివకుమార్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ తన విన్నపాన్ని సానుకూలంగా స్పందించి, తక్షణమే 13 లక్షల నిధులు కేటాయించినందుకు గాను మైదంబండ గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరుగుతుందన్నారు.ఈ పార్క్ ఏర్పాటుతో గ్రామంలోని పిల్లలకు ఆటపాటలకు మంచి వసతి లభిస్తుందని వారు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి చొరవతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని గ్రామ సర్పంచ్ కొనియాడారు.

## కరీంనగర్‌లో నీటి కోసం ప్రజల తిప్పలు

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాజు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నీటి బాధలు తీర్చాల్సిన మేయర్ ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎండాకాలం మొదలై తీవ్రంగా ఎండలుమండుతున్న దృష్ట్యా మానేరు డ్యామ్ లో నీటి కొరతతో చాలామంది నగర వాసుల బోర్లు ఎండిపోతున్నాయని నగర పాలక సంస్థ ఇవ్వాల్సిన నల్ల నీరు రెండు రోజులకు ఒకసారి గంట కూడా ఇవ్వకపోవడం వల్ల నగరములోని డ్యామును ఆనుకుని ఉన్న కోతిరాంపూర్, కట్టారాంపూర్,హనుమాన్ నగర్,తిరుమల నగర్, అలకాపురి, పోచమ్మ వీధి, లక్ష్మీ నగర్, గణేష్ నగర్, భగత్ నగర్,రామచంద్రాపూర్ కాలనీ, సప్తగిరి కాలనీలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నాయని, నల్ల నీటిపై అధికారులతో రివ్యూ పెట్టి ఎక్కడెక్కడ నీటి అవసరాలు ఉన్నాయో పర్యవేక్షణ చేపించి నల్లా నీరు ఇవ్వాలని, వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలనిడిమాండ్ చేశారు. వెంటనే నగర మేయర్ నల్ల నీటిని ప్రతి ఇంటికి ప్రతిరోజు ఒక గంట వచ్చేటట్లు ప్రణాళిక చేయాలని లేనిపక్షంలో తిరుగుబాటు చేస్తారని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

టిజిఇజెఎసి ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఉపాధ్యాయులు ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న పిఆర్సి డిఎలు వెంటనే ప్రకటించాలని పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల కార్యాచరణ సమితి(టిజిఈజెఎసి) ఆధ్వర్యంలో గొల్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి శాంతియుతంగా నిరసన తెలియజేస్తూ స్థానిక తహసిల్దార్ అబ్దుల్ మజీద్‌కు వినతి పత్రం అందజేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రావలసిన పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని,జూన్ 2 నాటికి పిఆర్సి ప్రకటించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి, వెంటనే ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులకు పెన్షనర్లకు నగతు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.2004 సెప్టెంబర్ 1 నాటికి ముందు నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత తర్వాత నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ,గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు .ఎస్‌జిటియు జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి మహేష్ గౌడ్ ,తపస్ మండల అధ్యక్షుడు బోయిని సురేష్ కుమార్ ,ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి,వివిధ సంఘాల బాధ్యులు కందుకూరి గంగారెడ్డి,బొల్లం ఆంజనేయులు,నరేందర్,సయ్యద్ ఆబిద్,సాగర్ ,రాజేందర్,గోస్కుల శ్రీను, రమేష్, జ్ఞానేశ్వర్ జిపిఒలు పాల్గొన్నారు.

## కెసిఆర్ భారీ సభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ఈనెల 20వ తేదీన కేసీఆర్ భారీ బహిరంగ సభ సందర్భంగా శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం లక్మీ పూర్ గ్రామంలో కార్యకర్తలు నాయకులతో సమావేశమై కేసీఆర్ సభ సంభందించిన జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ కలిసి నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు అన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పాలనలో విసుగెత్తిపోయారని మళ్ళీ కేసీఆర్ రావాలని తెలంగాణ ప్రజలందరూ కోరుకుంటున్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని అన్నారు. కెసిఆర్ సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను విజయవంతం చేసి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్ రావు, గ్రామ సర్పంచ్ కవిత స్వామి రెడ్డి,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు,మాజీ సర్పంచ్ జాన్,మాజీ ఎంపీటీసీ సునీత లక్ష్మణ్, మాజీ పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న గంగయ్య, మాజీ ఆత్మ చైర్మన్ రాజి రెడ్డిపాక్స్ డైరెక్టర్ రాజి రెడ్డి, మల్లారెడ్డి,బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల స్థితిపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం కలెక్టర్ చిత్రమిశ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.. ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపాలిటీ, రెవెన్యూ, సంక్షేమ శాఖ, నీటిపారుదల శాఖ, విద్యుత్, వెటర్నరీ, పంచాయతీ తదితర శాఖల వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఆన్ లైన్లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జెడ్పి సీఈఓ శ్రీనివాస్, విద్యుత్, నీటిపారుదల శాఖ, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్, రవాణా శాఖల స మన్వయంతో ‘అరైవ్ అలైవ్’ (అరైవ్ అలైవ్ ) కార్యక్రమాన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో శాం తిభద్రతల సమస్య కంటే రోడ్డు ప్రమాదాలే అతిపెద్ద సవాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రాష్ట్రంలో హత్యల వల్ల 800 మంది ప్రాణాలు కోల్పోగా, రోడ్డు ప్రమాదాల వల్ల ఏకంగా 7500 మంది మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని పే ర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్ర జా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుండి 18 వ తేదీ వరకు నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా పోలీసు శాఖ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సు ను కరీంనగర్ లోని పరేడ్ గ్రౌండ్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మా ట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్, రవాణా శాఖల బాధ్యత మాత్రమే కాదని, వార్డు మెంబర్ నుండి ముఖ్యమంత్రి వర కు అందరూ ఇందులో భాగస్వాము లు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని తెలిపారు. ప్రమాదాల్లో 70 శాతం మరణాలు ద్విచక్ర వాహనదారులవే ఉంటున్నాయ ని, బైక్ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూ డా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, తప్పనిసరిగా స్ట్రిప్ పెట్టుకోవాలని సూచించారు. స్ట్రిప్ లేకపోతే ప్రమాద స మయంలో హెల్మెట్ ఎగిరిపోయి ప్రాణాపాయం సంభవిస్తుందని హెచ్చరించారు. హెల్మెట్ పెట్టుకుంటే వెంట్రుక లు ఊడిపోతాయనేది కేవ లం అపోహ మాత్రమేనని, తన కు జుట్టు ఊడిపోవడానికి హెల్మెట్‌కు సంబంధం లే దని తన వ్యక్తిగత ఉదాహరణతో వివరిస్తూ నవ్వులు పూ యించారు. హెల్మెట్ ధరించడం అనేది ప్యాంటుకు బెల్టు పెట్టుకున్నంత సహజంగా అలవరచుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ఓవర్ కాన్ఫిడెన్స్‌తో డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయని ఉదాహరణలతో వివరించారు. వాహనదారులు ఎల్లప్పుడూ పరిసరాలను గమనిస్తూ ‘డిఫెన్సివ్ డ్రైవింగ్’ చేయాలని, ము ఖ్యంగా స్కూళ్లు, గ్రామాల జంక్షన్ల వద్ద వేగాన్ని తగ్గించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు అశ్విని, డిఎంహెచ్ఓ వెంకటరమణ, ఎంవిఐ చక్రవర్తి, ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ తో పాటు ఇతర అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.



# పిఆర్‌సి నివేదిక తక్షణమే అమలు చేయాలి

పెండింగ్ బిల్లులు..
రూ.13వేల కోట్లు చెల్లించాలి
టిజిఎ జెఎసి సిద్దిపేట జిల్లా డిమాండ్

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఉద్యోగులు,ఉపాధ్యాయులు పెన్షనర్లు తెలంగాణ రెండో పిఆర్‌సి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం పిఆర్‌సి గడువు పొడగించకుండ వెంటనే నివేదిక తెప్పించుకొని సంఘాలతో చర్చించి అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సిద్దిపేట జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి పిలుపులో భాగంగా శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట టిజి జెఎసి ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా సిద్దిపేట టిజిజెఎసి చైర్మన్ గ్యాదర్ పరమేశ్వర్, జిల్లా నాయకులు విక్రం రెడ్డి, తప్పెట యాదగిరి.ఇ ఇంద్రసేనారెడ్డి, తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ 2024 మార్చి నుండి రిటైర్డు అయిన 12వేల ఉద్యోగులు,ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్‌మెంట్ బకాయలు వెంటనే విడుదల చేయాలని. ఏకమొత్తంగా 13 వేల కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, సిపిఎస్ రద్దు చేసిన పాత పింఛన్‌ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ప్రధానమైన నాలుగు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ప్రధానమైన నాలుగు డిమాండ్లు పరిష్కరించకుంటే మే 5న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్‌లో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నేటి నిరసన ప్రదర్శనలో జిల్లాలోని 400లకు పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పించన్‌దారులు పాల్గొన్నారు. నిరసన ప్రదర్శన ఆనంతరం జాయింట్ కలెక్టర్ లక్ష్మి కిరణ్‌కు వినతి పత్రం అందచేశారు.ఈకార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగరాజు, రంగారావు, తిరుపతిరెడ్డి, కిష్టయ్య, ఖాజా. శశిధర్‌శర్మ. పొన్నమల్లు రాములు. రాజారెడ్డి. జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.




## రామగిరి మండలంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/రామగిరి :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా రామగిరి మండలంలోని ఆదివారంపేట,రాజాపూర్ గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు.జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ఆదివారంపేట,రాజాపూర్ గ్రామంలో సర్వే చేశారు.సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు.తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి,చదువు మానేసిన,ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో, ఎన్ని గంటలు పని చేశారో,ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలను కూడా నమో దు చేసుకుంటామని తెలిపారు. లలిత,కారోబార్ పరశురాములు,గ్రామపంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఆరోగ్య వైద్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే జాగ్రత్తలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది ఉన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ లక్ష్య సాధనలో పెద్దపల్లి జిల్లా ముందంజలో ఉండాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించడంలో పెద్దపల్లి జిల్లా ముందంజలో నిలవాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని ఎంబీ గార్డెన్‌లో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ డిస్ట్రిక్ కన్క్లేవ్ 2025–26 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రొజెక్టర్ ద్వారా ఎఫ్ఎల్ఎన్ జిల్లా రివ్యూ సమావేశం నిర్వహించారు.ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలను ఎఫ్.ఎల్.ఎన్ ఛాంపియన్ పాఠశాలలుగా ఎంపిక చేసి ప్రశంస పత్రాలు అందజేశారు.ఉపాధ్యాయులు విద్యార్థుల పఠన అవగాహన (రీడింగ్ కం పారీషన్ ఆర్సి) మెరుగుపరచడానికి అనుసరించిన బోధన పద్ధతులు, భాషలలో రచనా నై పుణ్యం (రైటింగ్ కాంపిటెన్సీ), గణితంలో గుణకం, భాగహారం (మల్టిపికేషన్ అండ్ డివిజన్) నైపుణ్యాల పెంపుకు చేపట్టిన తరగతి గది చర్యలపై తమ అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షల ఫలితాలను విశ్లేషించి, విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం మెరుగుపరచాలని సూచించారు. మండలాల వారీగా ఫలితాలను సమీక్షిస్తూ, లోపాలు ఉన్న చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు .వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి, ప్రతి విద్యార్థి ప్రాథమిక నైపుణ్యాలు, రీడింగ్ కాంప్రెన్షన్ సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు.అలాగే గద్దం జగదీశ్వర్, ఆర్. కిరణ్, కృష్ణ రెడ్డి, రవి, ప్రభాకర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, పుష్పలత తదితరులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సూపర్ సమ్మర్ క్యాంప్ వీడియోను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జి.శారద, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం.షేక్,అలోక్ ప్రాజెక్ట్ సి.ఈ.ఓ. ప్రమోద్, ప్రతినిధి సమీద్ అహ్మద్, జిల్లాలోని ఎం.ఈ.ఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, జిల్లా రిసోర్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.



# అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా.. యువరైతు మృతి

లంబాడిపల్లిలో తీవ్ర విషాదం
బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** తన వ్యవసాయ పొలం వద్ద వరి కోత ముగించుకుని ట్రాక్టర్‌లో వడ్లు తీసుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాకొట్టి యువరైతు మృతి చెందిన విషాద సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కుటుంబ సభ్యులు, పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడిపల్లి గ్రామానికి చెందిన కాటం కిషన్ రెడ్డి(28) అనే యువరైతు కొంత పొలం కోసుకుని కుంట కట్ట ఎక్కే సమయంలో ఒక్కసారిగా ట్రాక్టర్ వెనక్కి వస్తూ బోల్తా కొట్టిందని అక్కడికక్కడే కిషన్ రెడ్డి ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైరు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, సర్పంచ్ కాటం సంపత్ రెడ్డితో పాటు గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య శృతి, తల్లిదండ్రులు ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే కిషన్ రెడ్డి హఠాత్తుగా జరిగిన ప్రమాదంలో మృతి చెందడంతో ఘటన స్థలానికి వచ్చిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సిపిఐ జిల్లా నాయకురాలు గూడెం లక్ష్మి లు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వరి కోతలు కోస్తున్న సమయంలో ట్రాక్టర్ డ్రైవర్లు చాలా జాగ్రత్తగా వెళ్లాలని, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ఎస్సై పృథ్వీధర్ గౌడ్ కోరారు.



## క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయి

జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ని గీతా విద్యాలయ మైదానంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీష్మ క్రికెట్ టోర్నీని చైర్ పర్సన్ ప్రారంభించి మాట్లాడారు. ధైర్యం పెంపొందిస్తాయని తెలిపారు. క్రికెట్ వంటి క్రీడలు ముఖ్యంగా నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.గంగపుత్ర సంఘం ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అని,ఈ టోర్నమెంట్ యువతలోని ప్రతిభను వెలికితీసే మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు.( గామీణ మరియు పట్టణ ప్రాంతాల క్రీడాకారులకు ఇది మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జుంబర్తి గంగ లక్ష్మి రాజ్ కుమార్, ప్రశాంత్ రావు, నాయకులు పృథ్వీధర్ రావు,భీష్మ కప్ నిర్వాహకులు అరుముల్ల పవన్, జగిత్యాల అధ్యక్షులు తిరుపతి,అడ్వకేట్ రమేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.



# ముంబైకి నాలుగో ఓటమి..!






పంతొమ్మిదో సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఎదురన్నదే లేకుండా పోయింది. హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న ఆ జట్టు వాంఖడేలో ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించింది. భారీ ఛేదనలో ముంబై బౌలర్లను ప్రభసిమ్రాన్ సింగ్(80 నాటౌట్), శ్రేయాస్ అయ్యర్(66)లు ఎడాపెడా ఉతికేశారు. రెండు వికెట్లు పడినా ఆతిథ్య జట్టుకు ఒత్తిడి పెంచే అవకాశమివ్వలేదు ఇద్దరు. విజయానికి 12 పరుగులు అవసరమైన వేళ అయ్యర్ ఔటైనా ప్రభసిమ్రాన్‌సింగ్ లాంఛనం పూర్తి చేశాడు. నిరుడు రన్నరప్ పంజాబ్ కింగ్స్ ఈసారి అజేయంగా దూసుకుపోతోంది. ఎదురైన ప్రత్యర్థి నల్లా చిత్తు చేస్తున్న శ్రేయాస్ అయ్యర్ సేన వాంఖడేలో ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్((112 నాటౌట్) సూపర్ సెంచరీతో భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. పంజాబ్ బ్యాటర్లు కంగారు పడలేదు. గజన్ఫర్ విజృంభణకు పవర్ ప్లేలో ప్రియన్ష్ ఆర్య(17), కూపర్ కొన్నొల్లీ(15)లు ఔటైనా.. ముంబై నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు శ్రేయాస్ అయ్యర్(66), ప్రభసిమ్రాన్‌సింగ్(80 నాటౌట్)లు. అగ్నికి వాయువు తోడైనట్టు ఇద్దరూ కసికొద్దీ బౌండరీలు బాదడంతో కొండంత లక్ష్యం కరుగుతూ పోయింది. బుమ్రా, హార్దిక్ ఓవర్లలో రెచ్చిపోయిన అయ్యర్, ప్రభసిమ్రాన్‌సింగ్ అర్ధ శతకాలతో పంజాబ్‌ను గెలుపు దిశగా నడిపారు. శార్దూల్ ఠాకూర్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన అయ్యర్‌ను నమన్ ధిర్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. అప్పటికీ పంజాబ్ విజయానికి 12 పరగులు కావాలంతే. స్టోయినిస్(10)తో కలిసి ప్రభ్సిమ్రన్ 7 వికెట్ల విజయాన్ని కట్టబెట్టగా.. సొంత మైదానంలోనైనా విజయంతో మురవాలనుకున్న ముంబై ఆశలు అడియాశలయ్యాయి.

**శతక్కొట్టిన డికాక్..**

వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ ఓపెనర్ క్వింటన్ డికాక్(112 నాటౌట్) అజేయ సెంచరీతో గర్జించాడు. పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్(322) ధాటికి ఆదిలోనే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వని డికాక్.. నమన్ ధిర్(50)తో కలిసి శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. పంజాబ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఈ ద్వయం ముంబై భారీ స్కోర్‌కు బాటలు వేసింది. వీరిద్దరి జోరుతో అలవోకగా రెండొందలు కొడుతుందనుకున్న ముంబై ఆఖర్లో తడబడింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా(14) మెరిసినా.. ముంబైని రెండొందల లోపే కట్టడి చేసింది పంజాబ్.


# సైన్స్

## నీటిలోనూ చలనం!



మనిషిలో.. జీవాల్లో మాత్రమేకాదు, నీటిలోనూ చలనం ఉంటుంది. ఒక నీటి అణువును రసాయిన భాషలో హెచ్2ఓ ($H_2O$)గా పేర్కొంటారు. రెండు హైడ్రోజన్ అణువులు, ఒక ఆక్సిజన్ అణవు కలిస్తే నీరు ఏర్పడుతు ంది. ఇది చాలా సరళంగానూ, స్పష్టమైనదిగానూ కనిపిస్తుంది. కానీ, నిజానికి ఆ సరళత వెనుక అంతు చిక్కని మాయ దాగి ఉంది. మనం ఒక గుక్కెడు నీళ్ల తాగినప్పుడు అందులో లక్షల కోట్లు, కోటి కోట్ల నీ టి అణువులు ఉంటాయి. ఆ సంఖ్య అంత పెద్దది కాబట్టి, నక్షత్రాలు, గ్రహాల పరిమాణాలతో పోల్చుకునే స్థాయిలో ఉంటుంది. ఒక చిన్న నీటి బొట్టులోనే మన కళ్లకు కనిపించని అపారమైన గుంపు దాగి ఉం ది. అణువులు అన్నీ నిరంతరం కదులుతూ, ఒకదానితో ఒకటి ఢీకొ ంటూ, అయినా అద్భుతమైన క్రమంలో పనిచేస్తూ ఉంటాయి. మనం ఆశ్చర్యానికి అంతరిక్షాన్ని చూస్తాం, ఎందుకంటే అది అపారంగా పె ద్దది. కానీ సూక్ష్మ ప్రపంచం కూడా అంతే ఆశ్చర్యకరం. అక్కడ కూ డా విస్మయం ఉంది, భయం కలిగించే స్థాయిలో అందం ఉంది. అం టే, సంక్లిష్టత దూరమైన గెలాక్సీల్లో మాత్రమే ఉండదు. మనం ప్రతిరోజూ తాకే అతి చిన్న వస్తువుల్లోనూ ఉంటుంది. ఆశ్చర్యకరమైన అంశాలు ఎప్పుడూ పెద్దపెద్ద అంశాల్లో లేదా సుదూర ప్రాంతాల్లోనే ఉండాల్సిన అవసరం లేదు. కొన్ని సార్లు అది సంఖ్యల్లో, నిర్మాణంలో, మన చేతిలో ఉన్న ఒక నీటి బొట్టులోనే దాగి ఉంటుంది.

## మన ఆలోచనలు విశ్వ లక్షణమా?




ప్రపంచంలో ఎవరి ఆలోచనలు వారివి.. ఎవరి అభిప్రాయాలు వారివి. ఆయా పరిస్థితుల నుంచి సామాజిక రూపురేఖల వరకూ ఎన్నో అంశాలపై మనిషి ఆలోచనలు ఆధారపడి ఉంటాయన్నది మ నం ఇప్పటి వరకూ నమ్ముతున్న సిద్ధాంతం. అ యితే, కొంతమంది క్వాంటం భౌతిక శాస్త్రవేత్తలు , తత్వవేత్తలు ప్రతిపాదిస్తున్న ఈ దృక్పథం ప్రకా రం, చైతన్యం కేవలం మానవ మెదడులో ఉద్భవించిన ఉపఫలితం మాత్రమే కాకు ండా, విశ్వం అంతటా వ్యాపించి ఉన్న ఒక మౌలిక లక్షణం కావచ్చు. అంటే మన ఆ లోచనలు విశ్వ లక్షణాలకు లోబడి ఉంటాయి. మన వ్యక్తిగత మనస్సులు ఆ విశ్వవ్యాప్త చైతన్య జాలంలోని చిన్న వ్యక్తీకరణాలై ఉండవచ్చన్నది ఈ ప్రతిపాదన కేంద్రబిందువు. దీనికి ప్రేరణనిచ్చే అంశాల్లో ఒకటి క్వాంటం మెకానిక్స్‌లో కనిపించే వి చిత్ర లక్షణాలు. కణాలు దూరాన్ని పట్టించుకోకుండా పరస్పరం ప్రభావితం కా వడం, అంటే క్వాంటం ఎంటాంగిల్‌మెంట్, స్థలం—కాలం కంటే లోతైన అనుసంధా నం ఏదో ఉందా? అనే ప్రశ్నను లేవనెత్తుతుంది. ఇక్కడ స్పష్టంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, ఈ అనుసంధానం సమాచారాన్ని లేదా ఆలోచనలను తక్షణమే పంపే చైతన్య సంకేతాలు అన్నట్లు శాస్త్రీయంగా నిరూపితం కాలేదు. ఇది కేవలం భౌతిక వ్యవస్థల మధ్య గణితపరమైన సంబంధం మాత్రమే. కొందరు దీనిని విశ్వ మేధస్సు లేదా సార్వత్రిక చైతన్యంగా ఉపమానాత్మకంగా వర్ణిస్తారు. అ యితే ఇది నిర్ధారిత శాస్త్రీయ సిద్ధాంతం కాదు. ప్రయోగాత్మకంగా పరీక్షించగల స్పష్టమైన మోడల్ ఇప్పటివరకు లేదు. అంతఃప్రజ్ఞ, సృజనాత్మకత, లేదా మానసిక చికిత్సలతో దీనిని నేరుగా అనుసంధానించడం ప్రస్తుతం తత్వశాస్త్ర స్థాయిలోనే ఉంది. మనం కూడా ఆ విశ్వ ప్రక్రియలో భాగమేనని గుర్తుచేస్తుంది. సారాంశంగా చెప్పాల ంటే, విశ్వవ్యాప్త చైతన్యం అన్న భావన శాస్త్రం అంగీకరించిన నిజం కాదు, కానీ క్వా ంటం భౌతికశాస్త్రం వెలికి తీసిన వింత లక్షణాలను అర్థం చేసుకునే ప్రయత్నంలో పు ట్టిన ఒక లో తైన తాత్విక ఊహ. ఇది నమ్మమని కాదు, ఆలోచించమని మాత్రమే ఆహ్వానిస్తుంది.

# ఆర్‌ఆర్ టీం మేనేజర్‌కు జరిమానా



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి భిందర్ డగౌట్‌లో ఫోన్ వాడటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. తాజాగా అతడిపై బిసిసిఐ చర్యలు తీసుకుంది. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడినందుకు అతడికి రూ. లక్ష జరిమానా విధించింది. పలు ఆరోగ్య సమస్యల కారణంగానే ఫోన్ వాడాల్సి వచ్చిందని భిందర్ వివరణ ఇవ్వడంతో అతడు నిషేధం నుంచి తప్పించుకున్నాడు. కేవలం జరిమానా విధించి అతడిని బిసిసిఐ హెచ్చరించింది.ఐపిఎల్ నిబంధనల ప్రకారం జట్టు మేనేజర్లు మొబైల్ ఫోన్లు ఉపయోగించుకునే అవకాశం ఉంది. ప్లేయర్ అండ్ మ్యాచ్ ఆఫీషియల్స్ ఏరియాలో మాత్రం అనుమతి లేదు. ఈ నిబంధనను ఉల్లంఘించినందుకు భిందర్‌పై చర్యలు తీసుకున్నారు. అయితే ఇది ఆయన తొలి తప్పిదం కావడంతో కేవలం జరిమానా, హెచ్చరికతో సరిపెట్టారు. 'ఇది అందరికీ హెచ్చరికగా ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు' అని బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

# ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నీ విజేతగా తొలి భారతీయురాలు



**సైప్రస్:** ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నీ విజేతగా నిలిచిన ఆర్. వైశాలి తొలి భారతీయురాలిగా నయా చరిత్రను లిఖించింది. ఈ టోర్నీ చరిత్రలో భారత్‌కు చెందిన ఒక మహిళా గ్రాండ్‌మాస్టర్ విజేతగా నిలవడం ఇదే తొలిసారి. బుధవారం రాత్రి జరిగిన 14వ, ఫైనల్ రౌండ్‌లో కాటెరీనా లాగ్నో(ఉక్రెయిన్)ను ఓడించిన వైశాలి ఫిడే మహిళల క్యాండిడేట్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. దీంతో ఈ ఏడాది చివర్లో జరిగే మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం జూ వెన్‌జున్(చైనా)తో తలపడనుంది. 1952లో తొలి సారి మహిళల క్యాండిడేట్స్ టోర్నీ ప్రారంభం కాగా.. 1997వరకు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత టోర్నీగా మాత్రమే కొనసాగింది.1952నుంచి 1988వరకు ఏకచక్రాధిపత్యం చెలాయించిన రష్యా గ్రాండ్‌మాస్టర్లకు తొలిసారి చైనా గ్రాండ్‌మాస్టర్లు చెక్ పెట్టారు. 1990లో షీ జుంగ్ రష్యా గ్రాండ్‌మాస్టర్ల రికార్డుకు బ్రేక్ వేయగా.. ఆ తర్వాత 1992లో జార్జియా 1994లో హంగేరీ గ్రాండ్‌మాస్టర్లు టైటిల్ విజేతలుగా నిలిచారు. 1998 నుంచి 2021 వరకు ఈ టోర్నీని రద్దు చేయగా.. తిరిగి 2022 నుంచి మహిళల క్యాండిడేట్స్ టోర్నీ పునరుద్ధరించబడింది. 2022, 2024లో చైనా మహిళా గ్రాండ్‌మాస్టర్లు విజేతలుగా నిలువగా.. 2026లో అంచనాలకు మించి రాణించి రమేష్‌బాబు వైశాలి విజేతగా నిలిచి త్రివర్ణ పతకాన్ని ప్రపంచపటంలో లిఖించింది.

# ఖాళీ స్థలానికి కొత్త నిర్వచనం..



ఆధునిక భౌతిక శాస్త్రం ఎన్నో విషయాల్లో ఇప్పటి వరకూ నమ్ముతూ వచ్చిన సిద్ధాంతాలను తల్లకిందులు చేస్తున్నది. అలాంటి వాటిలో ఖాళీ స్థలం (e mpty space) ఒకటి. సాధారణంగా ఖాళీ స్థలం అనేది నిశ్చల ంగా, ఏమీ చేయకుండా ఉండేదిగా అనిపించవచ్చు. కానీ ఆధునిక భౌతిక శాస్త్రం చెబుతున్నది దానికి పూర్తిగా విరుద్ధం. శూన్యం (vacuum) అనేది నిశ్శబ్దంగా అన్నింటికీ నియమాలు విధించే శక్తివంతమైన నేపథ్యం. సాధారణ భావన ప్రకారం కణాలు (particles) ఉంటేనే స్థలం ఉంటుంది అనుకుంటాం. కానీ ఇక్కడ ఆలోచన పూర్తి విరుద్ధంగా ఉంటుంది. ఎందుకంటే నూతన భౌతిక శాస్త్ర ప్రతిపాదనల ప్రకారం, స్థలమే ముందు ఉ ంటుంది. ఏ రకమైన కణాలు అక్కడ ఉండగలవో నిర్ణయిస్తుంది. ఏమీ లేదు అనిపించేది నిజానికి వాస్తవానికి స్టేజ్ మేనేజర్ లాంటిది. క్వాంటం ఫీల్డ్ సిద్ధాంతం ప్రకారం, శూన్యం అనేది అన్ని ఫీల్డ్‌లకూ కనీస శక్తి స్థితి. కణాలు కనిపించకపోయినా, ఆ ఫీల్డ్‌లు ఎప్పుడూ ఉంటాయి. ఒక కణం అంటే ఏమిటి? ఆ ఫీల్డ్ ఏర్పడే ఒక చిన్న అల, ఒక కంపనం మాత్రమే. శూన్యపు నిర్మాణం అనుమతిస్తేనే ఆ కంపనం కణంగా కనిపిస్తు ంది. శూన్యం మారితే, ఉండగల కణాల జా బితా కూడా మారుతుంది. అంటే ఉనికి నేపథ్య నియమాలను అనుసరిస్తుంది... నేపథ్యం ఉనికి చేత నియ ంత్రించబడదు. ఇదే కారణంగా క ణాలకు నిర్దిష్ట లక్షణాలు ఉం టాయి. భారం ,ఛార్జ్ , స్థిర త్వం యాదృచ్ఛికంగా వచ్చినవి కావు. ఫీల్డులు తమ కనీస శక్తి స్థితిలో ఎలా స్థిరపడతాయో దాని నుంచే ఇవి పు డతాయి. శూన్యం ఒక అచ్చు లేదా మౌల్డ్ లాంటి ది. కొ న్ని ఆకారాలే అ ందులో సరిపోతాయి. మిగతావి అక్కడ పూర్తిగా నిషిద్ధాలు. కణాలు అతిథులు. శూన్యం ఆఇల్లు. ఈ దృష్టికోణం విశ్వం గురించిన శాస్త్రవేత్తల ఆలోచనల్నే మార్చింది. ప్రారంభ విశ్వంలో జరిగిన భారీ మార్పులు శూన్యాన్ని మార్చి ఉండవచ్చు. అలా మారిన శూన్యం వల్ల ఏవి ఉండగలవో మారిపోయింది. బలాలు వేరయ్యాయి. కొత్త కణాలు సాధ్యమయ్యాయి. మరికొన్ని అంతరించిపోయాయి. వాస్తవం కొత్త ముక్కలు జోడి ంచడం ద్వారా కాకుండా, ముక్కలు ఉద్భవించేందుకు అనుమతించే మూ ల నిర్మాణం మా రడం ద్వారా అభివృద్ధి చెందింది. రోజువారీ జీవితానికి తీసుకుంటే, ఇది చాలా శక్తివంతమైన ఆలోచన. వస్తువుల కంటే పునాదులే ముఖ్యమని సూచిస్తుంది. ఏ వ్యవస్థ అయినా దాని పరిసరాల వల్ల గుర్తింపు పొందుతుంది. ఫలితాల కంటే ముందుగా నియమాలు వస్తా యి. మనకు కనిపించేదంతా, మనకు కనిపించని లోతైన పరిస్థితుల పై ఆధారపడి ఉంటుంది. శూన్యం ఖాళీగా అనిపిస్తుంది, కానీ అది అన్నింటినీ నిశ్శబ్దంగా పాలిస్తోంది. ఈ విధంగా వాస్తవాన్ని చూ డటం వినయాన్ని నేర్పిస్తుంది. మనం గమనించేది మూల స్థ లంకాదు.అదిఅన్నిటినీకలిపిఉంచేదాగిననిర్మాణంఫలితం మాత్రమే.

# పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి




**మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట వైద్య ఉద్యోగుల జెఎసి నిరసన**

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం రెండో వేతన సవరణ సంఘం నివేదికను ప్రవేశ పెట్టి తక్షణమే అమలు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. పిఆర్‌సి అమలుకై, ఐదు విడతల కరువు భత్యం డీఏ మంజూరు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కై రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట వైద్య ఉద్యోగుల జేఏసీ నేతృత్వంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎం.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు పెండింగులో ఉన్న రెండో పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపి ఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు సమర్థవంతంగా అమలు చేయాలని, పెండింగు బిల్లులు విడుదల చేయాలని లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి అనస్తీషియా విభాగాధిపతి డా.మాధవి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డా.అమరావతి, పెడియాట్రిక్స్ విభాగాధిపతి డా.సురేష్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.బాల శ్రీనివాస్, డా.స్వప్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శ్రీపాల్, డా.యశ్వంత్, డా.విజయ్ ఇంచార్జ్ ఆర్‌ఎంఓ డా.దుర్గా, నర్సింగ్ ఆఫీసర్ సూపరింటెండెంట్ అల్వీన, సునీత ఉద్యోగ సంఘాల నాయకులు, రాములు నాయక్, మధుసూదన్ రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్, కురుమయ్య, దత్తు, రామానాయుడు, ఆసుపత్రి హెల్త్ ఇన్స్పెక్టర్, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

# దండిభాస్కర్ నిత్య స్మరణీయుడు

**సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** లిస్ట్ దండి భాస్కర్ సేవలు నిత్య స్మరణీయమని జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఆయన ఆశయసాధనకు పునరంకితమై పనిచేయడమే ఆయనకిచ్చే సరైన నివాళి అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో గల ఆయన స్మారకస్థూపం వద్ద పదర వర్ధంతి వేడులను ఘనంగా నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన అరుణపతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎర్రబాబు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ...దండి భాస్కర్ ఎంతో ధైర్యశాలి అని, ఎంతటి విపత్తు వచ్చినప్పటికీ ధైర్యంగా ఎదుర్కొనే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని అన్నారు. ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. జర్నలిస్టుగా కూడా భాస్కర్ ప్రజల గొంతుకగా పనిచేస్తూ అధికారులను తన ప్రశ్నించేరాతలతో మేల్కొల్పేవారని తెలిపారు. దళితులు, బడుగుబలహీనవర్గాల పక్షాన భాస్కర్ ఓ వేగుచుక్కలా, నోటిలో నాలుకలా ఉండేవారని అన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా భాస్కర్ అన్నకు చెప్పుకోవాలి అనే స్థాయిలో ప్రజల నమ్మకాన్ని పొందిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను సాధించినప్పుడే మనం అర్పించే నిజమైన ఘన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్(అన్నయ్య), సిపిఐ నగర కార్యదర్శి జానీమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాది సాంబశివరెడ్డి, మేకల శ్రీనివాసరావు, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, పగడాల మల్లేష్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మోహన్‌రావు, ఉన్నం రంగారావు, యడ్లపల్లి శంకరయ్య, బానోత్ రాంకోటి, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, ఐపిఎల్ జాతీయ సమితి సభ్యుడు ఓరుగంటి శేషగిరి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మహిళా సంఘం జిల్లా నాయకురాల్లు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, ప్రజాపక్షం దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా బూరో ఇంచార్జ్ ఏనుగు వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, ఖమ్మంరూరల్ మండల విలేకరులు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, ఉపేందర్, రంగారావు, లక్ష్మారెడ్డి, లక్ష్మ ణ్, నాగరాజు, అశోక్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల వేగవంతం

**సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/గుండాల;** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక హైమావతి ఫంక్షన్ హాల్‌లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం జి. మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోళ్లను ఏర్పాటు చేసిన అకాల వర్షాలు పడి రైతులు నష్టపోకముందే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాలని, గన్ని బ్యాంకుల కొరత లేకుండా చూడాలని, రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే కొనుగోలు చేసి, రైతుల ఖాతాలలో డబ్బులు రెండు రోజుల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అందజేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య మాట్లాడుతూ సిపిఐ ఇంటింటి కార్యక్రమాన్ని ఈనెల 21 నుండి ప్రారంభించనున్న నేపథ్యంలో కార్యకర్తలు సకాలంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు దయాకర్‌రెడ్డి, కొమురయ్య, జోసఫ్, యాదయ్య, స్వామి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలి

**ఎఐసిటియు రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్ కుమార్**



**ప్రజాపక్షం/ వరంగల్ :** నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఎఐసిటియు రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐసిటియు రాష్ట్ర కమిటీ సమావేశము వరంగల్ జిల్లా ఓంకార్ భవన్‌లో నర్ర ప్రతాప్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. 100 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా కార్మిక హక్కులను కాపాడుకొనుట కోసం ఎంతో పోరాడి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ యజమానులకు పెట్టుబడుదారులకు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చిందన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు వాటిల్లిందని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడులను అమలుకు తెస్తున్నారని, 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని, సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తున్నది కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ ను కట్టినంతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటిని తుంగలోకి తొక్కి కార్మికులుగా గుర్తించకుండా వెట్టి చాకిరి చేసే విధంగా ప్రయత్నం సాగుతోందన్నారు. నాలుగు లేబర్ కోడులను తిప్పి కొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మిక వర్గానికి చాలా అవసరం ఉందన్నారు. ఈ మధ్యకాలంలో మహాత్మా గాంధీ గ్రామీణఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తూ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తూ గ్రామీణ పేదల కడుపు కొట్టే విధంగా చట్టాలు ముందుకు తీసుకొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిటియూ రాష్ట్ర నాయకులు కంచె వెంకన్న, ముక్కెర రామస్వామి, జగదీశ్వర్, మాలోత్ సాగర్, మొగిలి, శ్రీనివాస్‌రావు, ఇంద్రారెడ్డి, యాదగిరి, లక్ష్మ ణ్, ఎండి మాషిక్, సిరిబొమ్మల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఎంపి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్**



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితంగా, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర విభజన గురించి భారత పార్లమెంటు సాక్షిగా పాకిస్తాన్ తో పోల్చిన భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యుడు తేజస్వి సూర్య పార్లమెంటు సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో బిజెపికి చెందిన ఎంపి తేజశ్రీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చి రాష్ట్ర ప్రజలను అవమానించారని, బిజెపి ఎంపి పార్లమెంట్‌లో మాట్లాడుతున్నప్పుడు అక్కడే ఉన్న రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు మౌనంగా ఉండి ఆయన ప్రసంగాన్ని అడ్డుకోకపోవడం సిగ్గుచేటని, రాష్ట్రం కోసం ఆనాడు బిజెపి పోరాడిన విషయాన్ని మరిచి పోయారా అని, ఉద్యమకారులుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన రఘునందన్ రావు, ఈటల రాజేందర్,బండి సంజయ్ కుమార్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటి వారు ఆయన వ్యాఖ్యలపై తక్షణమే స్పందించకపోవడం దారుణమని శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రం ఏర్పాటయినయినప్పటి నుండి రాష్ట్రం నుండి కేంద్రానికి పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు చెల్లిస్తున్నప్పటికీ తిరిగి రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా, పునర్విభజన చట్టంలో పేర్కొన్న వాటిని అమలు చేయకుండా వివక్షత చూపుతున్నారని, వీటన్నింటినీ తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు కల్లుండి చూడలేని కబోదిల్లాగా వ్యవహరిస్తూ మోడీ దగ్గర మోకరిల్లుతున్నారని శ్రీనివాస్ ఆరోపించారు. మతోన్మాద ముసుగులో పరిపాలన కొనసాగిస్తున్న బిజెపి నాయకులు పదేపదే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై చులకన చేసి మాట్లాడితే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని బిజెపిని రాష్ట్రంలో తరిమికొట్టక తప్పదని, తక్షణమే బిజెపి ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఉపసంహరించుకొని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, పార్లమెంట్ స్పీకర్ ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించి సూర్య పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## పెద్ద వాగు ప్రాజెక్టు పునర్మిర్మాణంపై తెలంగాణ, ఎపి ప్రభుత్వాలు విఫలం

• నేటి పాదయాత్ర భవిష్యత్ పోరాటాలకు పునాది • పునర్మిర్మాణానికి రూ.500కోట్లు కేటాయించాలి • పోరాటాలతో ప్రభుత్వాలకుబుద్ధి చెబుతాం • సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, భద్రాద్రి జిల్లా సిపిఐ కార్యదర్శి సాబిర్ పాషా





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట** :అశ్వారావుపేట పెద్ద వాగు ప్రాజెక్టు పునర్మిర్మాణానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని, పెద్ద వాగు పునర్మిర్మాణానికి రూ.500కోట్లు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో గల పెద్దవాగు ప్రాజెక్టు నుండి వేలేరుపాడు మండల తహాశీల్దార్ కార్యాలయం వరకు 21కి.మీ పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను పెద్దవాగు ప్రాజెక్టు వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. గుజ్జుల ఈశ్వరయ్యతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ చైతన్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, స్థానిక జిల్లాభయ రాష్ట్రాల సిపిఐ బృందం పెద్ద వాగు పాజెక్టు పునర్మిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ అగ్రభాగాన నిలిచి పాదయాత్రలో పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఆద్యంతం పాదయాత్ర కొనసాగించారు. ఈసందర్భంగా గుజ్జుల ఈశ్వర్యయ్య మాట్లాడుతూ వేలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నా వేలాది కుటుంబాలు దాహానికి అల్లాడిపోతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నేరపూరిత నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం 1970లో సిపిఐ పోరాటాలు ఆందోళనలు సాగించిన నేపథ్యంలో 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో 20వేల ఎకరాల భూమికి సాగునీరు, 30 గ్రామాలకు తాగునీరు అందిస్తూ ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీరుస్తుందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 7 మండలాలు ఆంధ్ర రాష్ట్రంలో కలుపుకున్న పాలకులకు వారి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత లేదా అని ఈశ్వరయ్య ప్రశ్నించారు. 2024 జూలైలో ఊహించని వరద రావడంతో గట్లు తెగి గండి పడిందన్నారు. వేలాది మంది ప్రజలు రైతులు నిరాశ్రయులు అయ్యారని, అప్పటి నుండి ప్రజలు ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతూ రెండు సంవత్సరాలుగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. ఈప్రాంత ప్రజలు, గిరిజన కుటుంబాలు పెద్దవాగు ప్రాజెక్టుపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ వేలాది మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి చూపిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి ప్రాజెక్టు ఆవశ్యకత తెలిసి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పట్టెడన్నం పెట్టే ప్రాజెక్టు నుంచి చుక్కనీరు రాక ఈ ప్రాంతంలో వేరే పని లేక మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ ప్రాజెక్టులు నిర్మాణానికి వేల కోట్లు కేటాయిస్తున్నానని కల్లబొల్లి కబర్లు చెబుతున్నారని, పెద్దవాగు ప్రాజెక్టు పునర్మిర్మాణంలో ఎందుకు మీన మేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. 2024లో ప్రాజెక్టు గండిపడి పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, అయితే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. అయితే నేటికి పూర్తిస్థాయిలో పునర్మిర్మాణానికి ప్రయత్నించకపోవడం దుర్మార్గం అన్నారు. అధిక ఆయకట్టు కలిగిన ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి తక్షణం సమస్యను పరిష్కరించాలన్నారు. జీవనాధారం కోల్పోయి ఆంధ్రాలోని వేల కుటుంబాలు రోడ్డున పడకముందే ప్రాజెక్టును పునర్మిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పెద్దవాగు ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజలకు వరమని తెలిపారు. ప్రాజెక్టులో సీల్ట్ తీయని కారణంగా 2024 జూలైలో ప్రాజెక్టుకు గండిపడి ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం చేకూరిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం 3.50కోట్లతో మరమ్మతులకు ఖర్చుచేసి చేతులు దులుపుకుందన్నారు. అయితే తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రాజెక్టు పునర్మిర్మాణం చేయడంతో పాటు నష్టపోయిన బాధితులకు పరిహారం ఇవ్వాలని లేకుంటే భవిష్యత్‌లో తమ పోరాటాల ద్వారా ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం వేలేరుపాడు తహాశీల్దార్ ఉదయ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, ద్వారక తిరుమల మండలాల కార్యదర్శులు బాడిశ రాము, కొన్నే లక్ష్మయ్య, జంపన వెంకటరమణరాజు, గోలిమే బాలేసు, జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబురావు, సన్నేపల్లి సాయిబాబా, బేతి కిషర్, కొప్పుల నాగరాజు, అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సలీం, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, జిల్లా ఎఐటియుసి నర్రాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్** : ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 35వ డివిజన్‌లో ఇందిరమ్మ చీరలను మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళలకు ఇందిరమ్మ పథకం క్రింద చీరలు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్** : కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని 4,6, 7 డివిజన్లలో కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను మేయర్ పునుకొల్లు నీరజ లబ్దిదారుల ఇండ్లకు వెళ్లి స్వయంగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లి భారంకాకుండా ఉండేందుకు ప్ర భుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మం నగరంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, నాగండ్ల కోటేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కారేపల్లి**:మండల పరిధిలోని మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకర పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సారిగా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నెలకొల్పడం అందరూ హర్షించదగ్గ విషయమన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధరలు అందించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరెగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు మద్దతు ధర రూ 2,400 ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాల కోసం ఎమ్మెల్యే పాయంకి వినతి



**ప్రజాపక్షం/మణుగూరు**:మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ గృహ నిర్మాణాల కోసం అలాగే గ్రామంలో ఉన్న పలు సమస్యల పరిష్కారం కొరకు, ఆ గ్రామ సర్పంచ్ ఇర్ప కవిత నేతృత్వంలో ప్రతినిధులు శుక్రవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ నేలపట్ల సుధాకర్ రెడ్డి, ఎస్.డి. అబ్బర్ కూడా పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం సహకారం అందించాలని వారు కోరారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల నిరసన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్** : ఉద్యోగులు, ఉపాధ్యాయుల, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పెండింగ్ సమస్యలను, న్యాయబద్ధమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఈజేఏసి) ఛైర్మన్ లచ్చిరెడ్డి, జిపివో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు లు రాష్ట్ర వ్యాప్త శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్న పిలుపు మేరకు శుక్రవారం ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిపివో అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చీమల నాగేంద్రబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. కోటేశ్వరరావు,జనరల్ సెక్రటరీ కొత్తపల్లి బాలమురళీకృష్ణ, టిపియుఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎం. రంగనాథ్, రిటైర్డ్ టీచర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. రాంమోహన్, ఎస్‌జిటి అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ జి. హరికిరణ్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

గోల్డెన్ అవర్‌లో సహాయం చేసిన వారికి రూ. 25 వేలు బహుమతి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్**: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు డిసిపి ప్రసాదరావు లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్టివో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. రాహు వీర్, పిఎం రాహత్ అనే రెండు కొత్త పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించిన వారికి రాహు వీర్ పథకం క్రింద రూ. 25వేలు ప్రోత్సాహకంగా అందజేస్తామని తెలిపారు. పిఎం రాహత్ పథకం క్రింద ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ పథకాలు గోల్డెన్ అవర్‌ను సమర్థవంతంగా వినియోగించేందుకు తీసుకు వచ్చినవి అన్నారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం మన రక్షణ కోసమేనని వాటిని తప్పించుకోవాలని ప్రయత్నించడం సరి కాదన్నారు. కారులో ప్రయాణించే సమయంలో డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులు కూడా తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. జిల్లాలో టాప్ 30 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సరిదిద్దినట్లు తెలిపారు. దీని వల్ల ప్రమాదాలు తగ్గి ఈ ఏడాది 15 మంది ప్రాణ నష్టం తగ్గిందన్నారు.అదనపు డిసిపి ప్రసాదరావు మాట్లాడుతూ అరైవ్ అలైవ్ అంటే ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఒక్కరూ సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవడం అని భావించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. కారులు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆడియో విజువల్ (ఏవి) ప్రదర్శనను వీక్షించారు. అనంతరం కెఎంసిబిఆర్‌ఎఫ్ సిబ్బందికి హెల్మెట్లు ప్రదానం చేసి రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ఆర్టిసి ఖమ్మం రీజియన్‌లో ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇం చార్జి ఆర్టివో జెవన్ శ్రీనివాస రావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఎఎంవిఐలు జి. దినేష్, జి. సుమలత, ఆర్టిఏ మెంబర్ జి. వెంకన్న, డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహరా, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, వాహనదారులు, ప్రజలు, కళాకారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులో కేంద్రం నీచరాజకీయం




మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం**:మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సవరించాలని, అమలులో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కాలయాపన విధానం నీచమైన రాజకీయ కుట్ర అని జిల్లా భారతజాతీయమహిళా సమాఖ్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి విమర్శించారు. పట్టణంలోని రామాటాకీస్ రోడ్‌లో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లులోని అభ్యంతరకర అంశాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ మహిళా రిజర్వేషన్లను జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టి దాని అమలును ప్రశ్నార్థకంగా మార్చిందని మండిపడ్డారు. 1960వ దశకంలో గీతా ముఖర్జీ వంటి కమ్యూనిస్టు యోధులు చేసిన పోరాటా ఫలితమే ఈ రిజర్వేషన్లు అని, కానీ నేడు ప్రభుత్వం తన రాజకీయ ఎజెండా కోసం పార్లమెంటరీ నిబంధనలను తారుమారు చేస్తూ మహిళా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. జనాభా నియంత్రణ మహిళా సంక్షేమంలో మెరుగ్గా ఉన్న రాష్ట్రాలపై వివక్షచూపుతూ డీ లిమిటేషన్ పేరుతో మహిళా శక్తిని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని, దీనిని ప్రజలు గుర్తించి ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు ఈసంశెట్టి పద్మ, మావిడాల ధనలక్ష్మి, మునిగడప పద్మ, సత్తెనపల్లి విజయలక్ష్మి, పైడిపెల్లి లక్ష్మి, షేక్ షాహీన్, కైసర్, రమాదేవి, షహీమ్,లత తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

టిజిఇజెఎసి డిమాండ్

కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్** : పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టిజిఈజెఏసి ఛైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సంయుక్త వేదిక టిజిఈజేఏసి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో సుమారు 15.25 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారన్నారు. ప్రభుత్వ పరిపాలన సమర్థవంతంగా సాగాలంటే ఉద్యోగుల సంక్షేమం అత్యంత కీలకమన్నారు. ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి సరికాదని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సిని వెంటనే ప్రకటించి అమలు చేయాలని , డిఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని, ఈహెచ్‌ఎస్, ఆరోగ్యకార్డుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. టిజిఈజెఎసి కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని అటువంటి ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. న్యాయమైన హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీజకు అందజేశారు. జిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తుంబూరు సునీల్‌రెడ్డి, రాజేష్, పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్‌కె రంజాన్, కట్టా శేఖర్, వెంగళరావు, పరిశ పుల్లయ్య, తాళ్లూరి వేణు, యలమద్ది వెంకటేశ్వర్లు, కొణిదెన శ్రీనివాస్, మోదుగు వెలాద్రి, జెడ్ఎస్ జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, డా॥ విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్, వెంకన్న, అస్లాంఖాన్, పెద్దినేని రాధాకృష్ణ, ఏలూరి హరికృష్ణ కోనార్, బిక్కు, వెంకటరమణ, కోడి లింగయ్య, రమణ యాదవ్, రమేష్, లలిత కుమారి, విజయ, మృదుల, రాధికా రెడ్డి, రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.


## సినిమా పక్కీలో 22 గొర్రెలు చోరీ

నలుగురిలో ముగ్గురు పరారీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి**:దొంగలు మండలం లో బరితెగిస్తున్నారు. సినిమా పక్కీలో గొర్రెలను మంద నుంచి రూ.2 లక్షల విలువైన గొర్రెలను ఎత్తుకెళ్లారు...నలుగురు దొంగల ను వెంబడించంగా ముగ్గురు పరారయ్యారు. వారిలో ఒక దొంగ ను పట్టుకుని గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి శివారు లో గొర్రెల మంద పై దొంగలు చోరీ చేశారు. మహబూబునగర్ కు చెందిన గడ్డం లక్ష్మయ్య . అనే రైతు ఆయన తో పాటు మరో ఇద్దరు రైతులు మొత్తం దాదాపు 500 గొర్రెల మంద ను గత వారం రోజుల క్రితం గ్రామంలోకి తీసుకొచ్చారు. రైతు పొలం లో పెంట పెట్టేందుకు గ్రామ శివారు లో ఓ రైతు పొలంలో గూడారం వేసుకుని ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి దొంగల ముఠా మంద పై పడింది. నలుగురు దొంగల లక్ష్మయ్య గొర్రెల మంద లో దాదాపు రూ.2 లక్షల విలువైన 22 గొర్రెలను డీసీఎం వ్యాన్ లోకి వెక్కించారు. ఇంకా గొర్రెలను ఎక్కించే క్రమంలో గొర్రెల మంద ఆరిచి పరుగులు తీయటంతో అలికిడికి గొర్రెల మంద రైతులు మేల్కోని చూసే సరికి గొర్రెల ను వ్యాన్ లో తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. వెంటనేలక్ష్మయ్య గట్టిగా అరవటంతో పక్కనే ఉన్న రైతులు మేల్కోని దొంగలను వెంబడించారు. కాగా అప్పటికే ఎక్కించిన గొర్రెలతో వ్యాన్లో నలుగురు పారిపోయేందుకు సిద్ధమయ్యారు. రైతులు వెంబడించటంతో ముగ్గురు వ్యాన్ ఎక్కారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల కు చెందిన ఓ దొంగ బరితెగించి రైతుల పైనే దాడి చేసేందుకు వారికి ఎదురుగా వచ్చారు. ఈ క్రమంలో మిగతా రైతులంతా ఎదురుదాడి చేసి దొంగను పట్టుకున్నారు. ఈ విషయం ను గమనించిన మిగతా దొంగలు గొర్రెలతో పారిపోయారు. పారిపోయన వారంతా బోనకల్ కు చెందిన వారిగా తెలుస్తుంది. బాధితులు విషయం ను గ్రామస్తులకు తెలియజేయటంతో దొరికిన దొంగ కు వారు దేహశుద్ధి చేసి తాళ్లతో బంధించి పోలీసులకు అప్పగించారు. బాధితుడు లక్ష్మయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.9 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/మధిర**:మధిర పట్టణాభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధి, సందరీకరణ పనులు కోసం రూ.9కోట్లు మంజూరు చేయడం జరిగింది. వైరా నది కరకట్ట పక్కన ఈ ప్రాజెక్టు అమలు ద్వారా మధిర పట్టణానికి కొత్త అందం రావడంతో ప్రజలకు విశ్రాంతి, వినోదం కోసం ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ, పర్యాటక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారింది. మధిర అభివృద్ధి పట్ల నిరంతరం కృషి చేస్తున్న భట్టివిక్రమార్కకి మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

లబ్ధిదారులతో సమీక్షలో

ఎంపిడిఓ జమలారెడ్డి



**ప్రజాపక్షం/బూర్గంపాడు**:ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఓ జమలారెడ్డి అన్నారు. శుక్రవారం సోంపల్లి గ్రామ పంచాయితీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సోంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నందు ఎంపిడిఓ జమలారెడ్డి సమీక్ష నిర్వహించారు. గ్రామంలోని లబ్దిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల పనులనను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఆలస్యం జరగకుండా అధికారులు, లబ్దిదారులు సమన్వయంతో పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లబ్దిదారులు తమ సమస్యలను ఎంపిడిఓ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పనుల నాణ్యత, పురోగతి, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో సోంపల్లి సర్పంచ్ తాటి లక్ష్మి, ఉప సర్పంచ్ పండగ సౌజన్య, హౌసింగ్ ఎఇ ఉదయ్ కిరణ్, పంచాయితీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్** : రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి గాంధీచౌక్ వరకు రోడ్డు నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షులు దీపక్ చౌదరి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా దీపక్ చౌదరి మాట్లాడుతూ 46వ డివిజన్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం పక్క నుంచి గాంధీచౌక్ వరకు చేరుకునేవిధంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఇట్టి విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, ఏఎంసి డైరెక్టర్ బోజడ్ల సత్యనారాయణ, ఐఎన్‌టియుసి నగర అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు, ఓబిసి సెల్ అధ్యక్షులు బానాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

## భర్తను హత్య చేయించిన భార్య సహా ఐదుగురి అరెస్టు




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భార్య, ప్రియుడు కలిసి సుఫారీ ఇచ్చి భర్తను చంపించన ఘటన కేసును వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఛేదించారు. హనుమకొండ లోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఐదుగురి నిందితులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి పరకాల టౌన్ కు చెందిన మడికొండ సుమన్ భరత్ కనబడడం లేదని తండ్రి సాంబయ్య పిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఊహించని విధంగా భార్య లావణ్యనే భర్తను చంపించినట్లు తేలింది.లావణ్యకు పరకాలకు చెందిన ఇమ్మడి నరేష్ తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయంలో భర్త సుమన్ భరత్ మద్యం సేవించి భార్య లావణ్యను హించినేవాడు. భర్త అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడు నరేష్, ఆమె తమ్ముడు పెండల రాజు కలిసి భరత్ ను హత్య చేయడానికి ములుగు జిల్లా గోవిందారావు పేటకు చెందిన చిరంశెట్టి వెంకటేశ్వర్లు, భూక్య రాకేష్ తో సుఫారీ హత్యకు రూ.5లక్షలు డీల్ కుదుర్చుకొని రూ.4లక్షల,60 వేలు ఇచ్చారు.ఏప్రిల్ 3 న వెంకటేశ్వర్లు, రాకేష్ మృతుడు భరత్ ను ములుగుకు పిలుపించుకున్నారు. ముగ్గురు మద్యం సేవించారు. అక్కడి నుంచి వెంకటేశ్వర్లు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి, వెంకటేశ్వర్లు, రాకేష్ ఇద్దరు కలిసి భరత్ తల పై బీర్ బాటిల్ కొట్టి చంపి, పెట్రోల్ పోసి తగలబెట్టారు. వీడియో తీసి లావణ్య ఫోన్ కు పంపించారు. భరత్ డెడ్ బాడీని కాల్చి, ఆనవాళ్లు లేకుండా బొక్కలను సమీపంలోని వాగులో పడేశారు. తరువాత లావణ్య రూ.40 వేలు వెంకటేశ్వర్లకు అందజేసినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు.

## అప్పల బాధతో మహిళ ఆత్మహత్య



**ప్రజాపక్షం/జనగామ:** అప్పుల బాధతో మహిళా మృతి చెందిన సంఘటన జనగామలో జరిగింది. సిఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం సత్తుపల్లి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గుప్త నవిత అనే మహిళ అధికంగా అప్పులు చేసి ఆర్థిక సమస్యలలో ఇబ్బందులు పడుతుండేదన్నారు. మానసికంగా బాధపడుతున్న నవిత ఈ నెల 16న తన ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా జనగామకు వచ్చిన పట్టణంలోని ఏకశిలా డిగ్రీ కళాశాల దగ్గర మోనోకోటోపాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందన్న ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని సిఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

## 'అరైవ్– అలైవ్'తో రోడ్డు ప్రమాద బాధితులకు అండ: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వం చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాహువీర్ పథకంలో బాగంగా రూ.25వేలను ప్రమాదం జరిగిన గంటలోపు గోల్డెన్ అవర్‌లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25వేల నగదు, ప్రశంసాపత్రం అందుతుందన్నారు.అత్యుత్తమ సేవలందించే టాప్ 10 రాహ్వీర్లకు జాతీయ స్థాయిలో రూ.1లక్ష వరకు బహుమతి లభిస్తుందన్నారు. బాధితులకు ఆసుపత్రిలో రూ.1.5లక్షల వరకు ఉచిత వైద్యం అందించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్టీఏ మెంబర్ అభిగౌడ్, డీటీవో జీవీఎస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిపై ఎమ్మెల్యే నాయిని తీవ్ర విమర్శలు



**ప్రజాపక్షం/హనుమకొండ:** బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలు, వ్యాఖ్యలపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను అవమానించే విధంగా బిజెపి నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.పార్లమెంట్ సాక్షిగా బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్రాన్ని పాకిస్తాన్‌తో పోల్చడం అత్యంత దుర్మార్గమని నాయిని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై తక్షణమే బిజెపి మంత్రులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలకు వారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.దక్షిణాది రాష్ట్రాలపై బిజెపి వివక్ష చూపుతోందని, ఇది ఒక కుట్రగా ప్రజలకు ఇప్పుడు బహిర్గతమవుతోందని ఆయన విమర్శించారు. దేశంలో అభివృద్ధి పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, కుల మతాల పేరుతో రాజకీయాలు చేయడం తప్ప కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేయడం లేదని ఆరోపించారు.అదేవిధంగా కేంద్రంలో ఉన్న బిజెపి మంత్రులు, ముఖ్యంగా బండి సంజయ్ కుమార్, కిషన్ రెడ్డి వంటి నాయకులు తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వారు గట్టిగా మాట్లాడాల్సిన బాధ్యతను విస్మరించారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మహిళలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఈ బిల్లుకు తమ మద్దతు ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలగకుండా కొన్ని సవరణలు చేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం మానుకుని సమానత్వంతో వ్యవహరించాలని నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాద స్థలాల పరిశీలన



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని వరంగల్...ఖమ్మం జాతీయ రహదారిపై తరచుగా రోడ్డు ప్రామదాలు జరిగే స్థలాలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం పోలీసులతో కలిసి పరిశీలించారు. వర్థన్నపేట ఏసిపి అంబటి నర్సయ్య, సిఐ కొమ్మురి శ్రీనివాసరావు, ఎస్ఐ ముత్యం రాజేందర్‌లతో కూడిన బృందం ఎన్‌హెచ్ఏఐ అధికారులు పరిశీలించి ప్రమాదాల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

# సుస్థిర వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక దృష్టి

### కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా




**ప్రజాపక్షం/జనగామ:** సుస్థిర వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రధాన మంత్రి ధన్ ధాన్య యోజన పథకం అమలుపై జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా టాస్క్‌ఫోర్స్ కమిటి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ పంటల ఉత్పాదకత పెంపుకోసం మెరుగైన విత్తనాలు, ఎరువులు వినియోగంపై మార్గదర్శకాలు, రైతులకు శిక్షణ కార్యక్రమాల నిర్వాహణ, కిసాస్ క్రెడిట్ కార్డులు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం, మట్టి పరీక్షలు, పంటల పంటల ప్రణాళికల వంటి పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో హారికల్చర్‌కు మంచి అవకాశాలు ఉన్నందున తోట పంటల విస్తరణ, డ్రిప్, స్ప్రింక్లర్లు, మైక్రో ఇరిగేషన్ పద్ధతుల ప్రోత్సాహం, పండ్ల, కూరగాయాల ప్రాసెసింగ్ యూనిట్లు, ఎపికల్చర్ కింద మష్రూమ్, తేనే వంట వాటిని ప్రోత్సహించాలన్నారు. పశువుల ఆరోగ్య సేవలు, టీకాలు, పాలు, మాసం ఉత్పత్తి పెంపు చర్యలు, పశుపోషణపై రైతులకు శిక్షణ ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. చేపల పెంపకం ప్రోత్సాహం, చెరువుల వినియోగం, మెరుగుపరచడం, మత్స్యకారులకు సబ్సిడీలు, సాంకేతిక పరిజ్ఞానం, విధానం, రాస్ టెక్నాలజీని ఉపయోగించేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులకు పంటల రుణాలు, ఇతర ఆర్థిక సహాయం స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, ఆర్థిక చైతన్య కార్య క్రమాలను నిర్వయించాలన్నారు. కొత్త వ్యవసాయ సాంకేతికతల ప్రదర్శనలు, రైతులకు ప్రాక్టికల్ ట్రైనింగ్, పరశోధన ఆధారిత అవగామన పెంపొందించాలన్నారు. గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రోత్సాహం, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి దిశగా కృషి చేయాలని నాబార్ అధికారికి సూచించారు. అన్ని శాఖలు పర్స్పర సమన్వయం, సహాకారంతో పని చేస్తే ఆయా శాఖలకు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని సుస్థిరంగా మార్చడమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు. పిఎండిడికేవై పథకం అమలులో జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, ఉద్యానవన శాఖ అధికారి రవికాంత్, పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్‌రావు, మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మూర్తి, కేవికె మామ్నూర్ శాస్త్రవెత్త, నాబార్డ్ ఏజిఎంతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడొచ్చు**

రోడ్డు ప్రమాదాల సమయంలో గోల్డర్ అవర్‌లో ప్రాణాలు కాపాడొచ్చున అని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. రోడ్డు ప్రమాదాల సందర్భంగా డ్రైవర్లకు గోల్డెన్ అవర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వయించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం జరగగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు బయపడి అక్కడి నుండి వెళ్లిపోకూడదన్నారు. బాధితులకు కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావానలి, ప్రమాదం జరిగిన వెంటనే 108కా ఫక్షన్ చేసి దగ్గరలో ఉన్న హాస్పటల్‌కు క్షతగాత్రులను తరలించాలన్నారు. ఏ రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ కీలకమని ఆ సమయంలో సరైన చికిత్స అందితే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. సిపిఆర్ ద్వారా ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని, ప్రమాధ బాధితులను అస్పటల్ తరలించే వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న రాహవీర్, పెం రాహత్ పథకాల ద్వారా ప్రోత్సాహం అందుతుందన్నారు. సిపిఆర్ విధానంపై వైద్యాధికారి రవికృష్ణ, సరిత, 108 సేవలు, పిఎం రాహత్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్‌రావు, ఆర్టీ మెంబర్ అభిగౌడ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## నృసింహుని కల్యాణానికి మంత్రి సీతక్కకు ఆహ్వానం



**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంబుగా వెలసిన మల్లూరు శ్రీ లక్ష్మి నృసింహ స్వామి చెంచులక్ష్మి ఆదిలక్ష్మి అమ్మవార్ల కల్యాణనికి 27 నుంచి మే 5 వరకు జరుగు బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క ను హైదరాబాద్ లో మంత్రి కార్యాలయంలో ముఖ్య అతిధిగా మంత్రి సీతక్క రావాలి అని అంగరంగ వైభవంగా జరుగు కళ్యాణం తిలకించాలని మల్లూరు హేమచల శ్రీ లక్ష్మి నృసింహ స్వామి ఆలయం ఈఓ ఏం వీరాస్వామి ఆహ్వానించారు.

## వరంగల్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ నియామకం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీని 10 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. రాష్ట్ర సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా శ్రీరామ్ రామ చందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, ఎండి హుస్సేన్ పాషా, మట్టా దుర్గా ప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, పల్లెల్ల సోమేశ్వరరావు, పెద్దపల్లి వర ప్రసాద్, బొడిగ శ్రీనివాస్, బొల్లెపల్లి రాజు సభ్యులుగా నియమిస్తూ కమిషనర్ ఆదేశాల జారీ చేశారు. ఈ కమిటీకి జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆయుబ్ అలీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో దక్షిణ మధ్య రైల్వే, టిజిఎస్‌ఆర్‌టిసి ప్రతినిధులు, సమాచార శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. కొత్తగా ఏర్పడిన నూతన కమిటీ తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/ములుగు:** వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన పాటేటి సులోచన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెకు అవసరమైన రెండు మోకాళ్ళ పూర్తి మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మంత్రి సీతక్క సహాయంతో రూ.2,50,000 చెక్కును మంజూరు చేసి బాధితులకు అందించారు. ఈ సహాయంతో హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిలక్ సైన్సెస్(నిమ్స్), పంజాగుట్టలో చికిత్స అందించబడుతుంది. పేదల ఆరోగ్య సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క తెలిపారు.

## మక్కల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/రాయపర్తి:** మక్కల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జాంబవ రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘం నిర్వహణలో ఏర్పాటుచేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మక్కలను విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర 2400 రూపాయలను పొందాలని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అన్నారు. రైతులకు అన్ని విధాల అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి వీరభద్రం, జాటోత్ హమ్యా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి దామోదర్, వెంకన్న, ఎండి నయిమ్, మల్యాల నర్సింహా మూర్తి, పాల్గొన్నారు.

## పకడ్బందీగా ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

### రెండో విడత రైతు భరోసా నిధులను విడుదల చేయనున్న ముఖ్యమంత్రి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో ఈ నెల 20 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత రైతు భరోసా నిధుల మంజూరు కార్యక్రమాన్ని మన జిల్లా నుంచే ప్రారంభించనున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మేడిగడ్డ, కాళేశ్వరం దేవస్థాన ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనతో పాటు, కాటారం మండలం నస్తూరపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైతు భరోసా నిధుల మంజూరు కార్యక్రమం సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు, డిఆర్డీఓ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసిని బలోపేతం చేస్తున్న మహాలక్ష్మి పథకం




**ప్రజాపక్షం/తొర్రూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆర్టీసీని బలోపేతం చేస్తునే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలేమాన్, ఆర్ఎం ఎస్.భవాని ప్రసాద్‌లు అన్నారు. శుక్రవారం తొర్రూరు ఆర్టీసీ డిపోను ఈడీ సోలేమాన్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల కాలంలో ఆర్టీసీ సంస్థ ప్రభుత్వ సహకారంతో ఉద్యోగుల అంకితభావంతో ప్రజా రవాణా వ్యవస్థగా ఎదిగిందన్నారు. మహాలక్ష్మి పథకం అమలు తరువాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా ప్రభుత్వం నుండి ప్రతీ నెల సుమారు రూ.300కోట్ల ఆదాయం సంస్థకు అందడంతో రోజువారి ఆర్థిక సమస్యలు ఎలాంటివి లేకుండా సంస్థ సాఫీగా కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు 3038 ఉద్యోగ నియామకాలతో పాటు కొత్తగా 1500కండక్టర్ నియామకాల కోసం ప్రభుత్వం నుండి అనుమతి వచ్చిందన్నారు. త్వరలోనే ఈ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. వరంగల్ నూతన ఆర్ఎం ఎస్.భవాని ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి ఆర్ఎం భవాని ప్రసాద్‌తో డిపో ఆవరణలో మొక్కను నాటించారు. అనంతరం డిపో మేనేజర్ పద్మావతి మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి సమయపాలన పాటించి తమ విధులను సక్రమంగా నిర్వర్తించి డిపో అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఎస్‌టీఐ రజితరెడ్డి, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, ఏడీసీలు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్లమెంట్ వద్ద ప్లకార్డులతో వరంగల్ ఎంపి కడియం కావ్య ధర్నా


**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చిన వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తూ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ మకర ద్వారం వద్ద కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ధర్నా చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు ఫ్లాకార్డులను ప్రదర్శిస్తూ బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "బీజేపీ క్షమాపణలు చెప్పాలి", "తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలి" అంటూ నినాదాలతో పార్లమెంట్ ప్రాంగణం మార్మోగింది. భాజపా ఎంపీ తేజస్వీ సూర్యతో పాటు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. ధర్నాలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వమాట్లాడుతూ దశాబ్దాల ఉద్యమం, ఎన్నో బలిదానాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత దురదృష్టకరమని, ఇది తెలంగాణ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని మండిపడ్డారు. రాజకీయంగా కాంగ్రెస్‌కు నష్టం తెలిసినా, సోనియా గాంధీ పెద్ద మనసుతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. బీజేపీ నేతలు తెలంగాణ పట్ల నిరంతర వ్యతిరేక ధోరణి కొనసాగిస్తున్నారని, 'బ్లాక్ డే' వంటి వ్యాఖ్యల ద్వారా ప్రజల భావోద్వేగాలను అవమానిస్తున్నారని విమర్శించారు. తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు.

## అక్రిడిటేషన్ కమిటీ సభ్యులుగా ఐజేయు నాయకులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** హనుమకొండ జిల్లా అక్రిడిటేషన్ కమిటీని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రకటించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గా ఉంటూ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నుండి ఐదుగురిని నియమించారు. ఐజేయూ నుంచి గడ్డం కేశవమూర్తిని నియమించారు. అలాగే బిగ్ మీడియా నుంచి కంకణాల సంతోష్, మీడియం డెయిలీ నుంచి నల్లాల బుచ్చిరెడ్డి, చిన్న పత్రికల నుంచి గాడిపెల్లి మధు, వీడియో జర్నలిస్టు నుంచి బోళ్ల అమర్ ను నియమించారు. వీరితో పాటు ఇతర యూనియన్ ల నుండి నలుగురు, డీపీఆర్ఓ, ఆర్టీసీ, సౌత్ సెంట్రల్ రైల్వే డిపార్ట్మెంట్ నుంచి అధికారులు సభ్యులుగా ఉండనున్నారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నుండి గరిష్ఠంగా ఐదుగురిని ఎంపిక చేయడం పట్ల ఐజేయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



**ప్రజాపక్షం/ములుగు:** రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఇంచర్ల గ్రామ సర్పంచ్ ముశ్నిపెల్లి కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మామిడి అశోక్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ వేముల సమ్మిరెడ్డి, వార్డు సభ్యులు కొట్టెపాక శ్రీనివాస్, నాయకులు మట్టేవాడ తిరుపతి,మాదాసు శ్రీను, సిఈఓ ఇట్టవేణి అనిల్, సోననేని కుమార్, బిక్షపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో ఉద్యోగులు – ఉపాధ్యాయుల నిరసన ర్యాలీ



**ప్రజాపక్షం/గూడూరు:** టీజీఈ జాక్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా గూడూరు తహసిల్థార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు నల్ల బ్యాడ్జిలు ధరించి తమ అసంతృప్తిని వ్యక్తం చేసిన వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ డిమాండ్ల సాధనకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అనంతరం తహశిల్థార్ నాగభవనికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యోగులకు ఇచ్చిన హామీల ను అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం బాధాకరమని విమర్శించారు. పలుమార్లు స్నేహపూర్వక చర్చలు జరిపినప్పటికి ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఈ నిరసనలకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్లలో భాగంగా పీఆర్‌సీని తక్షణమే అమలు చేయడం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ వ్యవస్థను పునరుద్ధరించడం బకాయిలను వెంటనే చెల్లించడం వంటి అంశాలను ప్రస్తావించారు. 317 జీవో సమస్యల పరిష్కారానికి విడుదలైన 190 జీవోను అన్ని శాఖల ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకలు వివిధ శాఖల సిబ్బంది పెన్షనర్లు పాల్గోన్నా రు.

'లార్క్ స్టూడియోస్, ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్ కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించాయి. ఇందులో జి.వి. ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రాలైన 'కరుడన్', 'మామన్' తర్వాత లార్క్ స్టూడియోస్ నిర్మిస్తున్న మూడవ చిత్రం ఇది.'

# రీల్

## జూన్ 26న వస్తున్న 'లెనిన్'



హీరో అఖిల్ అక్కినేని లేటెస్ట్ మూవీ 'లెనిన్' శరవేగంగా రూపొందుతోంది. ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన తొలి సాంగ్ 'వారేవా వారేవా..'కు ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వచ్చింది. తమన్ సంగీత సారథ్యంలో విడుదలైన ఈ సాంగ్‌తో మూవీ ప్రమోషన్స్ షురూ అయ్యాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఎట్టా ఎట్టా..' అనే సాంగ్ రెండో పాటగా విడుదలైంది. చక్కటి మ్యూజిక్ ట్రాక్తో ఈ పాటకు సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. ఈ జోష్‌తో నిండిన డాన్స్ మెలోడీ క్యాచీ బీట్స్, ఎనర్జీతో మెప్పిస్తోంది. అఖిల్, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే కెమిస్ట్రీ ఈ పాటకు హైలైట్. అఖిల్ తన మాస్ స్టెప్‌తో అదరగొడుతుంటే, భాగ్యశ్రీ తన చార్మింగ్‌తో స్క్రీన్‌పై మెప్పిస్తోంది. ఈ ఇద్దరి జోడీని స్క్రీన్‌పై చూస్తుంటే చాలా ఎనర్జిటిక్‌గా ఉంది. తనదైన సిగ్నేచర్ హుక్స్, బీట్స్‌తో సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాస్ మెలోడీని అద్భుతంగా కంపోజ్ చేశారు. సింగర్ శ్రీకృష్ణతో కలిసి తమన్ ఈ పాటను పాడటం విశేషం. భాస్కరభట్ల ట్యూన్‌కు తగ్గట్టు చక్కటి సాహిత్యాన్ని అందించారు. ప్రతీ పదం వినసొంపుగా లోకల్ టచ్‌తో రొమాంటిక్ స్టైల్లో ఉన్నట్లు అనిపిస్తోంది. 'లెనిన్' సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథతో పూర్తి ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో విడుదల కానుంది. ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా మేకర్స్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు.అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## 'రా రా ధీవర' పాట రిలీజ్



నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్ల నిర్మాణంలో, టాగోర్ మధు సమర్పణలో భారీ పీరియడ్ యాక్షన్ చిత్రంగా రూపొందుతోంది. ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌లో విడుదలైన ఫస్ట్ సింగిల్ 'రా రా ధీవర' అంచనాలను భారీగా పెంచింది. రవి బస్రూర్ సంగీతం అందించడంతో ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, ఆయన ఆ అంచనాలను మించి అదిరిపోయే సంగీతాన్ని అందించారు. పవర్‌ఫుల్ డ్రమ్స్, ఆర్కెస్ట్రా లేయర్స్‌తో పాట ఒక యోధుడి నినాదంలా అనిపిస్తుంది. సంతోష్ వెంకీ వోకల్స్ పవర్‌ను మరింత పెంచగా, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం ధైర్యం, సంకల్పం, యోధుని ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఈ పాటలో నిఖిల్ తన కెరీర్లోనే అత్యంత ఇంటెన్స్ అవతార్లో కనిపిస్తున్నారు. రఫ్ అండ్ టఫ్ లుక్, యుద్ధానికి సిద్ధమైన బాడీ లాంగ్వేజ్, ఖడ్గాలతో చేసే యాక్షన్ ఫైట్స్..కఠిన సాధనను చూపిస్తున్నాయి. ఆయన చేసిన ట్రాన్స్‌ఫార్మేష న్ ప్రత్యేకంగా నిలుస్తోంది. హై ఎనర్జీ డ్యాన్స్ మూమెంట్స్‌తో కూడా ఆకట్టుకుంటారు. నభా నటేశ్ ఈ పాటలో కనిపిస్తూ విజువల్ మరింత ఆకర్షణ తెచ్చారు. సినిమా గ్రాండియర్ ప్రతి ఫ్రేమ్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. కెకె సెంథిల్ కుమార్ అద్భుతమైన విజువల్స్ భారీ సెట్లు, యుద్ధభూములు, యోధుల గుంపులను అద్భుతంగా చూపించారు. దర్శకుడు భరత్ కృష్ణమాచారి తన విజన్ను భారీ స్థాయిలో ప్రజెంట్ చేశారు. యాక్షన్ సన్నివేశాలు, స్టేజింగ్,యు స్క్రీ కనిపించే ఎనర్జీ అన్నీ ప్రత్యేకంగా నిలుస్తాయి. విజే బిన్నీ మాస్టర్ కొరియోగ్రఫీ వార్ డ్యాన్స్ రిథమ్తో కలిపి 'రా రా ధీవర'ను ఒక గొప్ప వేడుకగా నిలుస్తోంది.స్వయంభూ' పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది.

## 'తస్సాదియ్యా' పాట ఆవిష్కరణ



త్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. సమంత హీరోయిన్‌గా నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'మా ఇంటి బంగారం' టీజర్ ఇప్పటికే అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేసింది. ఇక తాజాగా ఈ సినిమా నుంచి అదిరిపోయే అప్డేట్ను వదిలారు. పెళ్లి వేడుకల్లో మార్మోగిపోయేలా ఈ ఫస్ట్ సింగిల్ 'తస్సాదియ్యా'ని రూపొందించారు.'తస్సాదియ్యా' అంటూ సాగే ఈ పాటకు రెహమాన్ సాహిత్యాన్ని అందించగా.. చిన్మయి శ్రీపాద, పుణ్య సెల్వ ఆలపించారు. ఇక సంతోష్ నారాయణన్ బాణీ ఎంతో క్యాచీగా ఉంది. ఇక ఇందులో సమంత కనిపించిన తీరు, ఎనర్జిటిక్ స్టెప్పులు, క్లాసీ కొరియోగ్రఫీ అన్నీ కూడా పాటను విజువల్ ట్రీట్‌గా మార్చేసింది. 'ఓ బేబీ' తరువాత నందినీ రెడ్డి, సమంత కలిసి చేస్తున్న చిత్రం కావడంతో సహజంగానే ఆడియెన్స్‌తో అంచనాలు ఏర్పడతాయి. ఇక రాజ్ నిడిమోరు స్టోరీ, స్క్రీన్ ప్లేని అందిస్తుండటంతో మరింతగా హైప్ ఏర్పడింది. రాబోతోంది. ఈ సినిమాని సమ్మర్ కానుకగా మే 15న విడుదల చేయబోతోన్నారు.

## 'క్యాస్ట్' కథ అందరికీ కనెక్ట్ అవుతుంది



వరుణ్ సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎకె జంపన్న రచన & దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'క్యాస్ట్. . కశికా కపూర్, దివి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ గ్లింప్స్ లాంచ్ చేశారు. గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ఇలా నలుగురితో కలిసి 2007లో 'హ్యాపీ డేస్' సినిమా చేశాం. 17 ఏళ్లు అయ్యింది. ఇప్పుడు మళ్లీ నలుగురితో కలిసి సినిమా చేశాం. ఆలోచిస్తుంటే చాలా క్రేజీగా అనిపిస్తోంది. ఈ కథ విన్నప్పుడు చాలా కొత్త, డిఫరెంట్ కాన్సెప్ట్ అనిపించింది. ఇందులో చాలా బలమైన క్యారెక్టర్ చేశాను. ఇందులో ప్రతి క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. గగన్ చాలా డెడికేషన్ తో చేశారు. యాంకర్ రవి నుంచి యాక్టర్ రవిగా తన చాప్టర్ ప్రారంభించబోతున్నారు. తను కూడా చాలా చక్కగా పెర్ఫార్మ్ చేశారు. సత్యం రాజేష్‌తో నా కాంబినేషన్ చాలా బాగుంటుంది అని చెప్పారు. హీరో గగన్ బాబు మాట్లాడుతూ 'పుష్ప' సినిమా నాకు చాలా మందికి చేరువ చేసింది. నాకు అవకాశం ఇచ్చిన అందరికీ జీవితాంతం రుణపడి ఉంటాను. డైరెక్టర్ జంపన్న గారు ఈ సినిమాలో నాకు అద్భుతమైన క్యారెక్టర్ ఇచ్చారు. సత్యం రాజేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎవరు టచ్ చేయని సెన్సిటివ్ పాయింట్‌తో డైరెక్టర్ ఈ కథను అద్భుతంగా తీర్చిద్దారు. ప్రొడ్యూసర్ కోటేశ్వరరావు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. డైరెక్టర్ ఎకె జంపన్న మాట్లాడుతూ సినిమా ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేసిన వివి వినాయక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు. మనం చేసే పనిని బట్టి కులాన్ని నిర్ణయించే రోజుల్లో అంత బాగుండేది. కానీ మనిషి పుట్టుకను బట్టి కులాన్ని నిర్ణయించడం మొదలైనప్పటి నుంచి పరిస్థితులు మారిపోయాయి. కులం అనేది మనిషికి మనిషికి మధ్య ఒక అడ్డు గోడగా మారింది. ఈ సినిమాను చాలా కమర్షియల్గా చెబుతున్నాను. నిర్మాత కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించిన మా డైరెక్టర్ జంపన్నకి ప్రత్యేక కృతజ్ఞతలు. ఇది మా బ్యానర్‌లో తొలి సినిమా. చాలా అద్భుతంగా వచ్చింది. వరుణ్ సందేశ్ హీరోగా, కశికా కపూర్, దివి హీరోయిన్స్‌గా నటించారు. నాగబాబు, పృథ్వీ కీలక పాత్రలు పోషించారు. ఎక్కడా ఇబ్బంది పడకుండా అందరూ చాలా సహకరించారు. సినిమా అద్భుతంగా వచ్చింది. జూన్లో విడుదల చేయాలని అనుకుంటున్నాం. 90% షూటింగ్ పూర్తయ్యింది. సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు.




## హోర్ముజ్ ఓపెన్

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తి స్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగనున్నాయని తెలిపారు. ఇరాన్‌కు ధన్యవాదాలు చెప్పారు.


**పడిపోయిన ముడిచమురు ధరలు**

ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది. ఇరాన్ ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్ దూసుకెళ్లింది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ సూచీ 1 శాతం పెరగ్గా.. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.7 శాతం పుంజుకొంది. నాస్‌డాక్ కాంపోజిట్ ఒక శాతం మేర లాభపడింది. భారత్ స్టాక్ మార్కెట్‌ను ప్రతిఫలించే గిఫ్ట్ నిఫ్టీ (ఫ్యూచర్స్) సైతం దాదాపు 300 పాయింట్లు మేర లాభంతో 24,700 పాయింట్ల ఎగువన ట్రేడ్ అయింది.

# ఐఎఫ్ఎస్ ప్రమోషన్లకు ఎంపిక జాబితా విడుదల

### తెలంగాణ అటవీ సేవాధికారులకు కేంద్ర ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అటవీ సేవా అధికారులకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో పదోన్నతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జాబితాలను విడుదల చేసింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ఆమోదంతో 2020 నుండి 2023 సంవత్సరాల వరకు ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ జాబితాలు సిద్ధం చేయబడ్డాయి. ఈ జాబితాలో ఐ.ప్రకాష్, జి.ముకుంద్ రెడ్డి, ఎ.నరసింహ రెడ్డి, డి.సంహిత, ఎం.జోజి, జి.బి.రేఖాభాను, సిహెచ్.గంగా రెడ్డి, ఎస్.రాజశేఖర్ పేర్లు ఉన్నాయి. ఇందులో ఐ.ప్రకాష్ పేరును క్రమశిక్షణా, క్రిమినల్ కేసుల క్లియరెన్స్, రాష్ట్ర ప్రభుత్వ సమగ్రత ధ్రువీకరణకు లోబడి తాత్కాలికంగా చేర్చినట్లు స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వ సెక్రటరీ ప్రేమ్ ప్రకాష్ మౌర్య జారీ చేశారు. ఈ ఎంపిక జాబితాల ద్వారా తెలంగాణకు చెందిన అటవీ అధికారులకు ఐఎఫ్ఎస్‌లో పదోన్నతులు పొందే అవకాశం లభించనుంది. దీంతో రాష్ట్ర అటవీ పరిపాలనలో అనుభవజ్ఞులైన అధికారుల భాగస్వామ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.






ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య తగ్గుతోందన్నారు. దాంతో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ హక్కులు క్రమంగా క్షీణిస్తున్నాయని, ఈ పరిస్థితిలో ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయడం అత్యవసరమని అన్నారు. ఈ బహిరంగ సభలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్కే బాషుమియా, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ రాష్ట్ర నాయకులు మేకల రవి, పంజాల రమేష్, తోట బిక్షపతి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, జాతీయ సమితి సభ్యులు బోయిని అశోక్, సలిగంటి శ్రీనివాస్, రామకృష్ణ, లావణ్య, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఆరుట్ల రాజ్ కుమార్, రాజరత్నం, రత్నకుమారి, ఉషశ్రీ, లక్ష్మీ, జేరుపోతుల కుమారస్వామి, వెంకటస్వామి, దేవి, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆగని అకృత్యాలు

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి, కుల నిర్మూలన కాగితాలకు పరిమితమైనదన్నారు. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రూపుదిద్దుకుందని, రాజ్యాం గ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, రాజ్యాంగ పునాదులుగా ప్రతిపాదించారని అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాజ్యాంగ సంస్థలు బలహీనపరచబడుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు. దళిత, బలహీనవర్గాల హక్కుల కొరకు అభివృద్ధికి రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు గత కొన్ని సంవత్సరాలుగా పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ విధానాల వలన రోజురోజుకు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు, కులవివక్ష, భూమి సమస్యలు, విద్యా హక్కుల వంటి ఘటనలు రాజ్యాంగ ఆత్మకు విరుద్ధంగా జరుగుతున్నాయని, రాజ్యాంగ పరిరక్షణ కేవలం న్యాయపరమైన అంశం కాదని, అది సామాజిక ఉద్యమం, దళితులపై జరిగే ప్రతి అన్యాయానికి వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడటమే, దళితుల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) ప్రధాన లక్ష్యమన్నారు. దళిత బడ్జెట్ కేటాయింపులు పూర్తి స్థాయిలో ఖర్చు కావడం లేదని,



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com